# అశోకావదానం

( అశోకుని గాథ )



అనువాదం

శ్రీ మోక్షానంద

# అశోకావదానం

(అశోకుని గాథ)

*తెలుగు అనువాదం*

**శ్రీ మోక్షానంద**

*ప్రచురణ*

**ధర్మదీపం ఫౌండేషన్**

హైదరాబాద్ స్టడీసర్కిల్

దోమల్‌గూడ, ఇందిరాపార్క్ క్రాస్‌రోడ్స్

హైదరాబాద్ - 500 029

ఫోన్: 040-27635654

# అశోకావదానం

# Asokãvadãnam

Telugu Translation : **Sri Mokshananda**

© Sri Mokshananda

*Publication No* : **29**

*First Edition* : **January, 2015**

*Price* : **₹ 120/-**

*Copies* : **1,000**

*Cover Illustration* : **Moshe**

*Published by* :
**Dharmadeepam Foundation**
Hyderabad.

*For Copies* :
**Arts & Letters**
Hyderabad.
Ph: 040-27635654
Cell: 9704640273

*Printed at* :
**Kala Jyothi Process Pvt. Ltd.**
1-1-60/5, R.T.C. Cross Roads,
Musheerabad, Hyderabad-500 020.
Ph: 040-27645536.

# ముందుమాటలు

అవదాన అనేమాటకు ధర్మాన్ని బోధించటంద్వారా మనస్సుని పరిశుద్ధంచేసే పవిత్రగాథ, ఇతిహాసం, కర్మవృత్తం, మొదలైన అర్థాలున్నాయి. వినేవారి హృదయాన్నితాకి, వారి మనస్సుల్లో ధర్మపరివర్తన కలిగేటట్లుగా ప్రఖ్యాతపురుషుల జీవనఘట్టాలను వర్ణించటం దీని ప్రధానలక్ష్యం.

ఈ దృష్టితో చూసినపుడు అశోకావదానం తన లక్ష్యాన్ని పూర్తిగా సాధించిందని చెప్పవచ్చును. కాళ్లూ, చేతులూ నరికివేయబడి శ్మశానంలో వాసవదత్త చనిపోవటానికి కొంతముందు ఉపగుప్తుడు ఆమెవద్దకు పోయి ఆమెలో మార్పు తెచ్చినతీరు, దిగ్భ్రాంతిని కలిగించే వీతశోకుని మరణం, కంటతడి పెట్టించే కునాలుని ఉదంతం, చివరిరోజుల్లో దారిద్ర్యంలోకి నెట్టబడి చివరికి తనవద్ద మిగిలిన సగం ఉసిరికాయను సంఘానికి పంపుతూ అశోకుడు పలికిన మాటలు ఎవరి హృదయాన్ని కదిలించవు! అవదాన కల్పలతలో ఉన్నట్లుగా ఇందులో సుదీర్ఘమైన వర్ణనలు లేవు. రచయిత చిన్న చిన్న వాక్యాల్లో సరళంగా విషయాన్ని వివరించాడు.

ఇక అవదానానికి ఇతిహాసం అనే అర్థం ఉన్నా అది ప్రామాణికమైన చరిత్ర కానక్కరలేదు. అశోకావదానంలో అశోకుడు బుద్ధుని పరినిర్వాణం తర్వాత నూరేండ్లకు పుట్టినట్లుగా చెప్పబడింది. కాని అశోకుడు బుద్ధుని పరినిర్వాణానికి రెండువందల ఏండ్ల తర్వాత పుట్టినట్లుగా మనకు చరిత్రద్వారా తెలుస్తుంది. అలాగే బుద్ధుని సమకాలికుడైన బింబిసారునిది హర్యంకవంశం. మౌర్యవంశాన్ని అంతంచేసి మగధరాజ్యపాలన చేపట్టిన పుష్యమిత్రునిది శుంగవంశం. మధ్యలో శిశునాగవంశం, మౌర్యవంశం ఉన్నాయి. కాని, అశోకావదానం బింబిసారుడు మొదలుకొని పుష్యమిత్రుని వరకు అందరినీ మౌర్యవంశరాజులుగానే చూపుతుంది. అశోకుడు బౌద్ధధర్మాన్ని ప్రచారం చేసినా, ఇతర అన్ని ధర్మాలపట్ల సహనాన్ని కలిగి ఉన్నట్లుగా, ఏ ధర్మాన్ని ద్వేషించనట్లుగా ఆయన శాసనాలద్వారా తెలుస్తూ ఉంది. కాని అశోకావదానంలో ఒకే దినం 18వేల మంది ఆజీవకులను చంపించినటు ఉంది. వందలసంఖ్యలో మంత్రులను, అంతఃపురస్త్రీలను చంపటం, నరకసదృశమైన భవనాన్ని నిర్మించి, అందులో ప్రవేశించినవారినందరినీ చిత్రహింసలుపెట్టించి, చంపించటం ఇవన్నీ కల్పనలే. దీనినిబట్టి మనం అవదానంలో ప్రామాణికమైన చరిత్రను ఆశించకూడదని తెలుస్తుంది. అశోకావదానంలో అశోకుని ధర్మవీరమే ముఖ్యాంశం. దాని చుట్టూ కరుణ, మైత్రి, త్యాగం, వైరాగ్యం, దానం మొదలైన భావాలు సుందరంగా అల్లబడినాయి.

కర్మవృత్తం అంటే కర్మచక్రం. ఒక సుకృతంతోగాని, దుష్కృతంతోగాని మొదలైన కర్మ, ఫలితాన్ని ఇవ్వటంతో ఒక వృత్తం ముగుస్తుంది. అశోకుడు బుద్ధునికి పిండి అనే భావనతో దుమ్మును దానం చేసిన కర్మ ఆయనను జంబూద్వీపానికి చక్రవర్తిని చేసింది. అది ఒక కర్మవృత్తం. అలాగే ఒక పూర్వజన్మలో వేటగాడుగా ఉన్నపుడు ప్రత్యేకబుద్ధుని చంపినందున ఈ జన్మలో వీతశోకుడు గొల్లవానిచేతిలో హత్యగావించబడ్డాడు. ఇది ఒక కర్మవృత్తం. ఈ కర్మలు వాటి బలాన్ని బట్టి అదేజన్మలో ఫలించవచ్చు లేదా తరువాతి జన్మలలో ఫలితాన్ని ఇవ్వవచ్చు.

దివ్యావదానం అనబడే పెద్ద అవదాన గ్రంథంలో ప్రస్తుతరూపంలో ఉన్న అశోకావదానం ఒక భాగం. అశోకావదానంలో ఉపాఖ్యానాల చివరన 'ఇతి శ్రీదివ్యావదానే' అనీ, ముగింపులో 'ఇతి శ్రీదివ్యావదానేఽ శోకావదానం సమాప్తం' అని ఉండటం వలన దివ్యావదానంలోనుండి అశోకునికి సంబంధించిన భాగాన్ని తీసుకొని విడిగా ఒక గ్రంథంగా రూపొందించినట్లు తెలుస్తుంది. ఆ మూల సంస్కృతగ్రంథం ఇప్పుడు ఉనికిలో లేదు. దాని రచయిత ఎవరో తెలియదు.

దివ్యావదానం క్రీ.శ. 300 సంవత్సరంలో ఫా-చియాన్ చే చైనాభాషలోనికి అనువదించబడింది. అశోకావదానంలోని వీతశోకుని కథలో నాణాన్ని 'దీనారం' అని పేర్కొన్నారు. అది కనిష్కుని నాణెం పేరు. కనిష్కుడు క్రీ.శ. ఒకటవ శతాబ్దానికి చెందినవాడు. పై రెండు కారణాలూ ఇంకా ఇతర ఆధారాల వలన దీని రచనాకాలం క్రీ.శ. రెండవ శతాబ్దంగా తలంచబడింది. ఇది బౌద్ధధర్మంలోని మొదటి పద్దెనిమిది నికాయాల (శాఖల) లో ఒకటైన సర్వాస్తివాదులకు సంబంధించినది.

ఇందులో కుక్కుటారామ ప్రధానస్థవిరుడు యశుడు అర్హతుడు, షడభిజ్ఞుడు అయినా, ఆయనకు పెద్దగా ప్రాధాన్యత లేదు. కాని మథురావాసి ఉపగుప్తుడు మాత్రం అలక్షణికబుద్ధుడుగా వర్ణించబడినాడు. దీనినిబట్టి ఇది బౌద్ధధర్మ కేంద్రం పాటలీపుత్రం నుండి మథురకు ఇంకా ఉత్తరానికి మారుతున్న కాలంలో వ్రాయబడినట్లుగా పండితులు భావించారు.

వచనాన్ని వచనంగా, శ్లోకాలను వచనకవితలుగా అనువదించాను. పారాగ్రాఫ్‌ల విభజన మూలాన్ని అనుసరించి చేయబడింది.

తెలుగునాట బౌద్ధధర్మ పునరుజ్జీవనానికి అన్నివిధాలా కృషి చేస్తున్న శ్రీ చెన్నూరు ఆంజనేయరెడ్డి గారు తమ ధర్మదీపం సంస్థ ద్వారా దీనిని ముద్రించి వెలువరించారు. వారికి ధన్యవాదాలు.

12-01-2015 — **- మోక్షానంద**

తిమ్మాపూర్ — మోక్షానందాశ్రమము

# విషయసూచిక


ఉపగుప్తుని కథ ........................................................ 1

పాంశుప్రదాన అవదానం............................................. 23

అశోకుని జననం ..................................................... 29

వీతశోకావదానం ..................................................... 44

అమాత్యుడు యశుడు ................................................. 57

అశోకరాజోపాఖ్యానం ................................................. 61

కునాలుని కథ ........................................................ 87

అశోకుని చివరి రోజులు............................................ 104

జ్ఞప్తి చతుర్థకర్మ ..................................................... 111

# అశోకావదానం
## (అశోకుని గాథ)

### ఉపగుప్తుని కథ

తన శరీరమాంసాన్ని కరుణతో
లోకహితంకోసం అర్పిస్తూ
చిరకాలం తపించిన బుద్ధుని
శ్రమను సఫలం చేయటానికి,
చెప్పబోయేదానిని ఏకాగ్రచిత్తంతో వినండి!

నేనిలా విన్నాను. "ఒకానొక సమయంలో భగవానుడు శ్రావస్తిలో విహరిస్తున్నపుడు ఈ సూత్రం చెప్పవలసి ఉంది. తథాగత భగవానుని ముఖమేఘం నుండి కురిసిన మాటల నీటిధారలచే ఎవరి రాగ, ద్వేష, మోహ, మద, మాన, మాయ, శాఠ్యాల బురద కడిగివేయబడిందో, వ్యాకరణ, న్యాయాది తర్కశాస్త్ర అధ్యయనం వలన కలిగిన ప్రజ్ఞాప్రదీపం వలన ఎవరి కుశాస్త్ర దర్శనాంధకారం తొలగిందో, ఎవరు సంసారతృష్ణను ఛేదించి, ఉత్తమ సద్ధర్మక్షీరాన్ని త్రాగారో, అటువంటి గురువుల సన్నిధిలో బోధకులందరిలో శ్రేష్ఠుడు శక్ర, బ్రహ్మ, యమ, వరుణ, కుబేర, వాసవ, సోమ, ఆదిత్యాదులపై ఎదురులేని శాసనం కలవాడు, మన్మథుని గర్వాన్ని అణచివేసిన శూరుడు, మహాత్ముడు, మహా ఇద్ధి శక్తి కలిగినవాడు అయిన ఉపగుప్త స్థవిరుని కథను ఆరంభిస్తూ జ్ఞానుల మనస్సులకు సంతోషాన్ని కలిగించే ధర్మకథనాన్ని మనస్సులో స్మరించుకుందాం! గురువులు చెప్పేదానిని ఏకాగ్రతతో వినండి."

ఇలా చెప్పబడింది. భగవానుడు తన పరినిర్వాణకాల సమయంలో అపలాలనాగుని, కుమ్మరిస్త్రీని, చండాలస్త్రీని, గోపాలక స్త్రీని శిక్షణలోకి తెచ్చి మథురను చేరుకొన్నాడు. అక్కడ భగవానుడు ఆయుష్మంతుడైన ఆనందుని సంబోధించి ఇలా అన్నాడు–"ఆయుష్మాన్ ఆనందా! నా పరినిర్వాణానికి నూరేండ్ల తర్వాత మథురలో గుప్తుడనే

పేరుగల సౌగంధికుడు[1] పుడతాడు. అతని పుత్రుడు ఉపగుప్తుడనే పేరుగలవాడు మహాపురుషలక్షణాలు లేని బుద్ధుడుగా నా పరినిర్వాణానికి నూరేండ్ల తర్వాత బుద్ధకార్యాన్ని నిర్వర్తిస్తాడు. అతని శిక్షణలో అనేక భిక్షువులు క్లేశాలన్నిటిని పోగొట్టుకొని అర్హత్వాన్ని సాక్షాత్కరించుకుంటారు. వారు ఒక్కొక్కరు నాలుగు అంగుళాల పొడవుగల ఒక్కొక్క శలాక (కర్రపుల్ల) ను వేయగా, నా చేతితో పద్దెనిమిది చేతుల పొడవు, పన్నెండు చేతుల వెడల్పు కొలతలుగల గుహ వాటితో పూర్తిగా వాటితో నిండిపోతుంది. బోధకులైన నా శ్రావకులందరిలో ఈ ఉపగుప్త భిక్షువే శ్రేష్ఠుడు."

"ఆనందా! దూరంగా ఆకాశంలో కనిపించే దట్టమైన ఆ నీలిరేఖను చూడు!"

"అలాగే భదంతా!"

"ఆనందా! అదే ఉరుముండమనే పర్వతం. తథాగతుని పరినిర్వాణం తర్వాత నూరేండ్లకు సాణకవాసి అనే భిక్షువు పుడతాడు. అతడు ఆ ఉరుముండ పర్వతంపై విహారాన్ని నిర్మిస్తాడు. ఉపగుప్తుని ప్రవ్రజింపజేస్తాడు."

"ఆనందా! మథురలో నటుభటులనే ఇద్దరు శ్రేష్ఠిసోదరులు జన్మిస్తారు. వారు ఉరుముండ పర్వతంపై విహారాన్ని స్థాపింపజేస్తారు. అది నటభటిక విహారమని పిలువబడుతుంది. ఆనందా! చిత్తశాంతికి అనుకూలమైన నా శయ్యాసనాలన్నిటిలో ఈ నటభటికారణ్యాయతనం శ్రేష్ఠంగా ఉంటుంది."

ఆయుష్మాన్ ఆనందుడు భగవానునితో "భదంతా! ఈ విధంగా ఆయుష్మంతుడు ఉపగుప్తుడు బహుజనులకు హితాన్ని చేకూర్చబోవటం ఆశ్చర్యంగా ఉంది" అన్నాడు.

భగవానుడు "ఆనందా! అతడు ఇప్పుడే కాదు ముందరిజన్మలో కూడా అప్పటి శరీరంతో ఇక్కడే బహుజనులకు హితాన్ని చేకూర్చాడు" అన్నాడు.

ఉరుముండ పర్వతానికి మూడు ప్రక్కలున్నాయి. ఒక ప్రక్క అయిదువందలమంది ప్రత్యేకబుద్ధులు నివసించేవారు. రెండవ ప్రక్క అయిదువందల ఋషులు ఉండేవారు. మూడవప్రక్క అయిదువందల కోతులు ఉండేవి. ఒకనాడు ఆ కోతులమంద నాయకుడు

1. అత్తరు, పన్నీరువంటి పరిమళద్రవ్యాల వ్యాపారి.

కోతులను విడిచి అయిదువందల ప్రత్యేకబుద్ధులుండే పార్శ్వానికి వెళ్ళాడు. అక్కడ అతనికి ప్రత్యేకబుద్ధులను చూచి ఆనందం కలిగింది. అతడు ఆ ప్రత్యేకబుద్ధులకు రాలిన ఆకులను, దుంపలను, పండ్లను సమర్పించుకొని, పద్మాసనంలో కూర్చున్న వృద్ధులకు ప్రణామం చేసి, క్రొత్తవారివద్దకుపోయి వారిప్రక్కన పద్మాసనంలో కూర్చున్నాడు.

ఆ ప్రత్యేకబుద్ధులందరూ పరినిర్వృతులైనారు. ఆ విషయం తెలియక అతడు వారికి ఎప్పటివలెనే రాలిన ఆకులను, దుంపలను, పండ్లను సమర్పించుకున్నాడు. వాటిని వారు తీసుకోలేదు. అతడు వారి చీవరాల మూలలను లాగాడు. పాదాలను పట్టుకున్నాడు. అప్పుడు వారు చనిపోయారని గుర్తించాడు. అప్పుడు అతడు ఏడ్చి, దుఃఖించి, అయిదువందల ఋషులు నివసించే రెండవ పార్శ్వానికి పోయాడు.

అక్కడ ఉండే ఋషులలో కొందరు ముండ్లపై పడుకొని ఉన్నారు. కొందరు బూడిదలో పడుకొని ఉన్నారు. కొందరు చేతులు పైకెత్తి ఉన్నారు. కొందరు పంచాగ్నిమధ్యంలో ఉన్నారు. అతడు వారిని ఆయా కఠినతపస్సుల నుండి విరమింప జేయసాగాడు. ముండ్లలో పడుకున్నవారిని ముండ్లనుండి లేపాడు. బూడిదపై పడుకున్నవారి ప్రక్కలనుండి బూడిదను చిమ్మివేశాడు. పైకెత్తినవారి చేతులను క్రిందికి దించాడు. పంచాగ్నిమధ్యంలో ఉన్నవారి అగ్నులను చల్లార్చాడు. వారిని ఆయా స్థితులనుండి విరమింపజేసిన తర్వాత వారిముందు పద్మాసనంలో కూర్చున్నాడు.

ఆ ఋషులందరూ ఈ విచిత్రాన్ని తమ ఆచార్యునికి విన్నవించారు. అతడు కూడా వారందరిని పద్మాసనంలోనే కూర్చుండమని చెప్పాడు. అప్పుడు ఆ అయిదువందల ఋషులు పద్మాసనంలోనే కూర్చున్నారు. వారికి ఆచార్యుడు ఉపదేశించకుండానే ముప్పదిఏడు[2] బోధిపక్షీయధర్మాలు అర్థమై, వారు ప్రత్యేకబుద్ధావస్థను సాక్షాత్కరించుకున్నారు.

---

2. నాలుగు స్మృతిప్రస్థానాలు, నాలుగు సమ్యక్ప్రధానాలు, నాలుగు ఋద్ధిపాదాలు, అయిదు ఇంద్రియాలు, పంచబలాలు, ఏడు బోధ్యంగాలు, ఆర్యఅష్టాంగమార్గం ఈ ముప్పది ఏడు బోధిపక్షీయధర్మాలు. వీటిని గురించి విపులంగా తెలుసుకోవాలనుకునేవారు విసుద్ధిమగ్గ 22వ అధ్యాయం చూడండి.

అప్పుడు ఆ ప్రత్యేబుద్ధులు 'ఈ కోతి రావటం వలన మాకు ఎంతో మేలు చేకూరింది' అనుకొని దుంపలను, పండ్లను పెడుతూ దానిని పోషించారు. ఆ కోతి చనిపోయినపుడు దాని శరీరాన్ని గంధపుచెక్కలతో దహనం చేశారు.

"ఆనందా! ఆ అయిదువందల కోతులమంద నాయకుడే ఈ ఉపగుప్తుడు. అతడు ఆ జన్మలోనూ అప్పటి శరీరంతో ఇక్కడే ఈ ఉరుముండ పర్వతంపై బహుజనులకు హితాన్ని చేకూర్చాడు. అలాగే నా పరినిర్వాణానికి నూరేండ్ల తర్వాత ఈ ఉరుముండ పర్వతంమీదే బహుజనులకు హితాన్ని చేకూరుస్తాడు. నీకు దానిని ఉన్నది ఉన్నట్లుగా దర్శింపజేస్తాను. చూడు!"

సాణకవాసిస్థవిరుడు ఉరుముండ పర్వతంపై విహారాన్ని స్థాపించి, 'ఆ సుగంధద్రవ్యవ్యాపారి పుట్టాడా లేదా?' అని దివ్యదృష్టిని సారించి చూశాడు. అతనికి అతడు పుట్టినట్లుగా తెలిసింది. అప్పుడు 'నా పరినిర్వాణానికి నూరేండ్ల తర్వాత అలక్షణికబుద్ధుడుగా అతనికి పుడతాడని చెప్పబడిన ఉపగుప్తుడు పుట్టాడా? లేదా?' అని అతడు దృష్టిని సారించాడు. అప్పటికి అతడు పుట్టలేదు.

సాణకవాసిస్థవిరుడు క్రమంగా అన్ని ఉపాయాలతో సుగంధద్రవ్యవ్యాపారియైన ఆ గుప్తుడు బుద్ధశాసనంపట్ల ప్రసన్నంగా ఉండేటట్లు చేశాడు. అతడు ప్రసన్నుడైన తర్వాత ఆ స్థవిరుడు అనేకమంది భిక్షువులతో ఒకనాడు అతని ఇంటికి వెళ్లాడు. ఆ మరునాడు తనతో ఒకన్ని మాత్రమే తీసుకుని వెళ్లాడు. వేరొకనాడు ఒక్కడే వెళ్లాడు. సౌగంధికగుప్తుడు సాణకవాసి స్థవిరుని ఒంటరిగా చూచి "ఆర్యునకు సహాయకశ్రమణుడెవరూ లేరే!" అన్నాడు. స్థవిరుడు "శ్రద్ధతో ప్రవ్రజించినవారు సహాయకులుగా మమ్ములను అనుసరించాలిగాని, జరాధర్ములమైన మేము సహాయకశ్రమణుని ఎందుకు ఉంచుకోవాలి?" అన్నాడు. సౌగంధికగుప్తుడు "ఆర్యా! నేను గృహజీవితంపట్ల ఆసక్తుడనై, విషయాలయందు ఆనందిస్తూన్నంతవరకు ప్రవ్రజించటం వీలుకాదు. కాని నాకు కొడుకు పుడితే వానిని ఆర్యులకు సహాయకశ్రమణునిగా ఇస్తాను" అన్నాడు. స్థవిరుడు "వత్సా! అలాగే అగుగాక! ఈ దృఢప్రతిజ్ఞను నీవు మరచిపోవద్దు!" అన్నాడు.

కొన్నాళ్లకు సౌగంధికగుప్తునకు కొడుకు పుట్టాడు. అతనికి అశ్వగుప్తుడని పేరు పెట్టారు. అతడు పెద్దవాడైన తర్వాత సాణకవాసిస్థవిరుడు సౌగంధికగుప్తుని వద్దకుపోయి

"వత్సా! 'నాకు కొడుకు పుడితే వానిని ఆర్యులకు సహాయకశ్రమణుడుగా ఇస్తాన'న్నావు. నీకు కొడుకు పుట్టాడు. వానిని ప్రవ్రజింపజేయటానికి అనుమతించు" అన్నాడు. సౌగంధికుడు "ఆర్యా! ఇప్పుడు నాకు ఒక్కడే కొడుకు కదా! ఇంకొక కొడుకు పుడితే వానిని ఆర్యులకు సహాయక శ్రమణునిగా ఇస్తాను" అన్నాడు

అప్పుడు సాణకవాసిస్థవిరుడు 'ఇతడు ఉపగుప్తుడేనా?' అని దివ్యదృష్టిని సారించి చూశాడు. కాని 'అతడు ఉపగుప్తుడు కాడ'ని తెలిసింది. అప్పుడు స్థవిరుడు "అలాగే కానీ!" అన్నాడు. ఆ తర్వాత కొంతకాలానికి సౌగంధికగుప్తునకు రెండవకొడుకు పుట్టాడు. అతనికి ధనగుప్తుడని పేరుపెట్టారు. అతడు పెరిగినవెంటనే సాణకవాసిస్థవిరుడు గంధికగుప్తునితో "వత్సా! 'నాకు కొడుకు పుడితే నీకు సహాయకశ్రమణునిగా ఇస్తా'నని నీవు ప్రతిజ్ఞ చేశావు. ఇపుడు నీకు కొడుకు పుట్టాడు. వానిని ప్రవ్రజింపజేయటానికి అనుమతించు" అన్నాడు. సౌగంధికుడు "ఆర్యా! వీనిని వదలిపెట్టండి. ఒకడు బయటకుపోయి సామాగ్రిని తెస్తాడు. రెండవవాడు ఇంటిపనులను చూస్తాడు. నాకు మూడవ కొడుకు పుడితే అతన్ని ఆర్యునకు ఇస్తాను" అన్నాడు.

అప్పుడు సాణకవాసిస్థవిరుడు 'ఇతడు ఆ ఉపగుప్తుడేనా?' అని దృష్టిని సారించి చూశాడు. 'అతడు కాద'ని తెలిసింది. స్థవిరుడు "అలాగే కానీ" అన్నాడు. ఆ తర్వాత సౌగంధికగుప్తునకు మూడవపుత్రుడు జన్మించాడు. అతడు అందంగా, చూడచక్కని వాడుగా, మానవవర్ణాన్ని అతిక్రమించిన దివ్యవర్ణం కలవాడుగా ఉన్నాడు. జాతకర్మలన్నీ పూర్తియైన తర్వాత అతనికి ఉపగుప్తుడని పేరుపెట్టారు. అతడు పెరిగిన తర్వాత సాణకవాసిస్థవిరుడు సౌగంధికగుప్తుని వద్దకుపోయి "వత్సా! 'నాకు మూడవపుత్రుడు పుడితే వానిని ఆర్యునకు సహాయకశ్రమణునిగా ఇస్తానన్నావు. ఇప్పుడు నీకు మూడవపుత్రుడు జన్మించాడు. వానిని ప్రవ్రజింపజేయటానికి అనుమతించు" అన్నాడు. సౌగంధికగుప్తుడు "ఆర్యా! అలాగే. కాని లాభనష్టాలు లేని స్థితి కలిగినప్పుడు అందుకు అనుమతిస్తాను" అన్నాడు.

ఆ సమయంలో మారుడు మథురను మొత్తం చెడువాసనతో నింపివేశాడు. మథురవాసులందరూ ఉపగుప్తునివద్ద సుగంధద్రవ్యాలను కొన్నారు. అతనికి అమ్మకాలు బాగా జరిగాయి. ఒకనాడు సాణకవాసిస్థవిరుడు ఉపగుప్తుని వద్దకు వెళ్లాడు. అప్పుడు ఉపగుప్తుడు సుగంధద్రవ్యాల దుకాణంలో ఉన్నాడు. అతడు ధర్మబద్ధంగా వ్యాపారం

చేస్తూ సుగంధద్రవ్యాలను అమ్ముతున్నాడు. సాణకవాసిస్థవిరుడు అతన్ని పలకరించి "వత్సా! నీ చిత్తచేతసికాలు ఏ విధంగా ఉన్నాయి. క్లిష్టమా? అక్లిష్టమా?" అని అడిగాడు. ఉపగుప్తుడు "ఆర్యా! నాకు క్లిష్టచిత్తచేతసికాలు[3] ఎలా ఉంటాయో, అక్లిష్ట చిత్తచేతసికాలు[4] ఎలా ఉంటాయో తెలియదు" అన్నాడు. సాణకవాసిస్థవిరుడు "వత్సా! కేవలచిత్తాన్ని తెలుసుకోగలిగినప్పుడు ప్రతిపక్షం నుండి విడుదల కావచ్చును. అందుకోసం నీకు నలుపు, తెలుపు పట్టికల (గుడ్డముక్కల))ను ఇస్తాను. క్లిష్టచిత్తం జనించినపుడు నల్లముక్కను ఉంచు. అక్లిష్టచిత్తం జనించినపుడు తెల్లముక్కను ఉంచు. మనస్సులో సంసారంలోని అశుభాన్ని చింతించు. బుద్ధానుస్మృతిని పెంపొందించుకో!" అని బోధించాడు.

అక్లిష్టచిత్తచేతసికాలు కలిగేవరకు అతడు రెండు నల్లముక్కలను, ఒక తెలుపు ముక్కను ఉంచేవాడు. అది సగం నలుపు ముక్కను, సగం తెలుపుముక్కను ఉంచేవరకు వచ్చింది. ఆ తర్వాత రెండు భాగాలు తెల్లముక్కలను, ఒక భాగం నల్లముక్కను ఉంచాడు.

ఆ క్రమంలో మొత్తం శుక్లచిత్తాలే కలుగసాగాయి. అతడు అన్నీ తెలుపు ముక్కలే ఉంచుతూ, ధర్మంగా వ్యాపారం చేసుకుంటున్నాడు.

మథురలో వాసవదత్త అనే వేశ్య ఉండేది. ఆమె దాసి ఉపగుప్తునివద్దకు పోయి గంధాన్ని కొని తెచ్చింది. ఆమెతో వాసవదత్త "అమ్మాయీ! ఇంత సామాగ్రిని ఎలా తెచ్చావు? ఆ సౌగంధికునివద్ద దొంగిలించలేదు కదా!" అన్నది. బాలిక "ఆర్యపుత్రీ! రూపవంతుడు, చతురుడు, మధురంగా వ్యవహరించేవాడు అయిన ఉపగుప్తుడనే సౌగంధికయువకుడు ధర్మంగా వ్యాపారం చేస్తున్నాడు" అన్నది. ఆ మాటలు విన్న వాసవదత్త చిత్తంలో ఉపగుప్తునిపట్ల అనురాగం కలిగింది. ఆమె 'మీ ఆగమనాన్ని కోరుకుంటున్నాను. మీతో పాటు సుఖించాలని కోరికగా ఉంది' అని దాసిద్వారా ఉపగుప్తునికి సందేశాన్ని పంపించింది. సందేశాన్ని విని ఉపగుప్తుడు "సోదరీ! నా దర్శనానికి ఇది సమయం కాదు" అన్నాడు.

---

3. మలినమైన ఆలోచనలు
4. పరిశుద్ధమైన ఆలోచనలు.

వాసవదత్త అయిదువందల కార్షాపణాలు తీసుకొని తన వద్దకు వచ్చినవారిని సేవించేది. ఆమెకు 'అతడు ఈ అయిదువందలు ఇవ్వటానికి వెనుకాడుతున్నాడేమో' అనిపించి, "నాకు ఆర్యపుత్రుని కార్షాపణాలతో పనిలేదు. కేవలం ఆర్యపుత్రునితో సుఖించాలని ఉంది" అని చెప్పి మళ్లీ ఉపగుప్తునివద్దకు దాసిని పంపింది. విని ఉపగుప్తుడు "సోదరీ! నా దర్శనానికి ఇది సమయం కాదు" అన్నాడు.

అప్పుడు ఒకానొక శ్రేష్ఠిపుత్రుడు వాసవదత్త వద్దకు వచ్చాడు. అదే సమయంలో ఇంకొక సార్థవాహుడు[5] ఉత్తరాపథంనుండి అయిదువందల గుర్రాలను తీసుకొని మథురకు వచ్చాడు. అతడు 'మథురలో అందరికన్న ముఖ్యమైన వేశ్య వాసవదత్త' అని విని, అయిదువందల కార్షాపణాలు తీసుకొని, అనేక కానుకలతో వాసవదత్తవద్దకు వచ్చాడు.

అప్పుడు వాసవదత్త ధనలోభంతో ఆ శ్రేష్ఠిపుత్రుని చంపించి, గడ్డివాములో దాచి, సార్థవాహునితో రతిని అనుభవించింది. శ్రేష్ఠిపుత్రుని బంధువులు వానికోసం వెదకి, గడ్డివామిలోనుంచి శవాన్ని తీసి రాజుకు తెలియజేశారు. అప్పుడు రాజు భటులతో "వెళ్లండి! వాసవదత్తను శ్మశానానికి తీసుకొనిపోయి ముక్కు, చెవులు కోసి, కాళ్లు, చేతులు నరికివేయండి!" అన్నాడు

వారు వాసవదత్తను శ్మశానానికి తీసుకొనిపోయి, కాళ్లు, చేతులు, ముక్కు, చెవులూ కోసి వదలివేశారు. 'వాసవదత్త చేతులు, కాళ్లు, ముక్కు, చెవులు కోయబడి శ్మశానంలో వదలివేయబడింద'ని ఉపగుప్తుడు విన్నాడు. 'ఇంతకుముందు ఆమె విషయసుఖంకోసం నన్ను చూడాలనుకొంది. ఇప్పుడు ఆమె కాళ్లు, చేతులు, ముక్కు, చెవులు నరుకబడినాయి. ఆమెను చూడటానికి ఇదే తగినసమయం' అనుకున్నాడు.

అందమైన వస్త్రాల్లో, విచిత్రాభరణ భూషితయైయున్నపుడు,
జన్మపరాన్ముఖులకు, మోక్షార్థులకు
ఆమె రూపం చూడతగ్గది కాదు.
కాని రాగం, అభిమానం, హర్షం అన్నీ పోయి
స్వభావనియతమైన ఆమె రూపం
వాడికత్తులచే నరుకబడిన ఈ

5. వ్యాపారి.

సమయం మాత్రం అందుకు అనువైనదే.

సహాయకుడుగా ఒక బాలుడు గొడుగు పట్టుకొని వెంటరాగా, ప్రశాంతమైన శారీరకభంగిమతో శ్మశానాన్ని చేరుకున్నాడు. అక్కడ పూర్వపు స్నేహం వలన ఒక దాసి వాసవదత్తకు సమీపంలో ఉండి, ఆమె శరీరంపై వాలే కాకులు మొదలైనవాటిని నివారిస్తూ ఉంది. ఆమె వాసవదత్తతో "ఆర్యపుత్రీ! నీవు నన్ను మాటి మాటికి ఏ ఉపగుప్తుని వద్దకు పంపించావో ఆ ఉపగుప్తుడు వచ్చాడు. అతడు కామరాగార్తుడై వచ్చాడేమో" అన్నది. విని వాసవదత్త –

"అందం నశించి, దుఃఖార్తనై
నెత్తుటిబురదలో భూమిపై పొరలుతున్న
నన్ను చూచి అతనికి ఇప్పుడు
కామరాగం ఎలా కలుగుతుంది?" అన్నది.

అప్పుడు ఆమె దాసితో "నా శరీరంనుండి కత్తిరించబడిన కాళ్లుచేతులను, ముక్కు చెవులను అతికించు" అన్నది. ఆమె వాటిని అంటించి వస్త్రంతో కట్టింది. ఉపగుప్తుడు వాసవదత్త ముందుకు వచ్చి కూర్చున్నాడు.

ఉపగుప్తుని ఎదురుగా చూచి వాసవదత్త "ఆర్యపుత్రా! నా శరీరం ఆరోగ్యంగా, రతివిషయసుఖానికి అనుకూలంగా ఉన్నప్పుడు మళ్లీ మళ్లీ ఆర్యపుత్రుని వద్దకు దూతికని పంపించాను. ఆర్యపుత్రుడు 'సోదరీ! దర్శనానికి ఇది సమయం కాదు' అన్నారు. ఇప్పుడు నా కాళ్లు చేతులు, ముక్కు చెవులు ఖండింపబడినాయి. నెత్తుటిబురదలో పడివున్నాను. ఇప్పుడు ఎందుకు వచ్చారు?"

"తామరపూరేకులా కోమలమైన,
అతివిలువైన వస్త్రాభరణాలతో అలంకరింపబడినప్పుడు
మీరు ఈ శరీరాన్ని చూడలేకపోయారు.
అది నా మందభాగ్యం
ఇప్పుడు నా శరీరం
నెత్తుటిబురద అంటి, భయావహమై
రతిహర్షవిస్మయాలను కోల్పోయిన తర్వాత

ఏమి చూడాలని వచ్చారు?" అన్నది.

ఉపగుప్తుడు ఇలా అన్నాడు –

"సోదరీ! నేను కామార్తుడనై నీ వద్దకు రాలేదు.
కామానికి మూలమైన ఈ మలినశరీర
స్వభావాన్ని చూడటానికి వచ్చాను.
మదనానుకూలమైన వస్త్రవిభూషణాలతో చుట్టబడి
దర్శనీయంగా ఉన్నప్పుడు నీ రూపాన్ని చూచినవారు
దాని అసలు స్వభావాన్ని గ్రహించలేరు.
వికృతమైన ఈ స్థితిలో నిన్ను చూచి పండితులు
శరీరాన్ని నిందిస్తారు. బ్రతికియున్న శవంలాంటి
దీనిలో అజ్ఞానులే రమిస్తారు."

"వేలాదినాడులతో ఆవరింపబడి మాంసంతో పూయబడి, రక్తంతో నింపబడి, చర్మంతో ఆవరింపబడిన ఈ శరీరంలో ఎవరు రమిస్తారు?"

అందువలన సోదరీ!
బయటి అందాన్ని చూచి మూఢులు రమిస్తారు.
లోపలి వికారాన్ని చూచి ధీరులు విరమిస్తారు.
ఇది అపవిత్రమైన దుర్గంధయుక్తమైన శవం.
సుఖాసక్తి ఉన్నా, ఏది శుభమో తెలిసినవాడు
దానినుండి వెనుదిరగటమే మంచిది.

స్వభావంతో అశుచియైన ఈ శరీరం
సుందరమైన వస్త్రాలతో, నగలతో అలంకరింపబడిన
ఈ మురికి, ఈ మలినం
చెడువాసన రాకుండా నీటితో కడుగబడి, సుగంధాలచే
పూయబడి కామాసక్తులచే సేవింపబడుతుంది.
సంబుద్ధుని మాటలను విని, ఆచరించేవారు,

శ్రమను, శోకాన్ని, దుఃఖాన్ని కలిగించే
దీనిని ఎప్పుడూ నిందిస్తారు.
వారు దీనిని వదలి, కామనిమిత్తముక్తమానసులై
శాంతులై వనాలకు పోతారు.
మార్గమనే పడవను ఆశ్రయించి
ఈ మహాభవసాగరాన్ని దాటిపోతారు.

ఇది విని వాసవదత్త సంసారంపట్ల విరక్తయై బుద్ధగుణానుస్మరణతో నిండిన హృదయంతో ఇలా అన్నది –

పండితులు చెప్పినట్లే ఉంది ఇదంతా.
నేను మిమ్ములను కలుసుకున్నాను.
మీరు నాకు బుద్ధవచనాన్ని
వినిపిస్తే బాగుంటుంది.

అప్పుడు ఉపగుప్తుడు వాసవదత్తకు అనుపూర్వికి కథనాన్ని వినిపించి సత్యాన్ని ప్రకాశింపజేశాడు. వాసవదత్త శరీరస్వభావాన్ని అర్థం చేసుకొని ఉపగుప్తుడు కూడా కామధాతువు నుండి వైరాగ్యాన్ని పొందాడు. తాను చేసిన ఆ ఆత్మీయ ధర్మోపదేశం వలన సత్యాన్ని అర్థం చేసుకొని ఉపగుప్తుడు అనాగామిఫలాన్ని, విన్న వాసవదత్త స్రోతాపత్తి ఫలాన్ని పొందారు. అప్పుడు సత్యాన్ని దర్శించిన వాసవదత్త ఉపగుప్తునితో కృతజ్ఞతతో–

"మీ దయవలన ఘోరమైన, బహుదోషయుక్తమైన
అపాయమార్గం మూయబడింది.
పుణ్యాత్ములు పొందే
స్వర్గమార్గం తెరువబడింది.
నిర్వాణమార్గం లభించింది."

"నేను తథాగతుడు, అర్హతుడు, సమ్యక్సంబుద్ధుడూ అయిన ఆ భగవానుని శరణు పొందుతున్నాను. ధర్మాన్ని, భిక్షుసంఘాన్ని కూడా."

"నవకమలవిమల ధవళనేత్రుడైన బుద్ధుని,

ఆ దేవబుధజనహితుడైన జినుని,

విరాగియైన సంఘాన్ని శరణు పొందుతున్నాను" అన్నది.

ఉపగుప్తుడు వాసవదత్తకు ధార్మికకథనం వలన జ్ఞానాన్ని దర్శింపజేసి వెళ్లిపోయాడు. ఉపగుప్తుడు వెళ్లినకొద్దిసేపటికి వాసవదత్త చనిపోయి దేవతలలో జన్మించింది. దేవతలు 'వాసవదత్త ఉపగుప్తుని వద్ద ధర్మదేశనాన్ని విని ఆర్యసత్యాలను దర్శించింది. ఆమె చనిపోయి దేవతలలో జన్మించింద'ని మథురలో ప్రకటించారు. మథురవాసులు అది విని వాసవదత్త శరీరాన్ని పూజించారు.

అప్పుడు సాణకవాసిస్థవిరుడు సౌగంధికగుప్తుని వద్దకుపోయి "ఉపగుప్తుని ప్రవ్రజింపజేయటానికి అనుమతించు" అన్నాడు. సౌగంధికగుప్తుడు "ఆర్యా! లాభం, నష్టం లేనప్పుడు అందుకు అనుమతిస్తాను" అన్నాడు.

అప్పుడు సాణకవాసిస్థవిరుడు బుద్ధితో అతనికి లాభం, నష్టం లేకుండా చేశాడు. సౌగంధికగుప్తుడు తూచుకొని, లెక్కించుకొని, కొలుచుకొని లాభం కాని, నష్టం కాని లేకపోవటాన్ని గుర్తించాడు.

సాణకవాసిస్థవిరుడు సౌగంధికగుప్తునితో 'నా పరినిర్వాణానికి నూరేండ్ల తర్వాత బుద్ధకార్యాన్ని నిర్వహిస్తాడ'ని బుద్ధుడు ఇతని గురించే చెప్పాడు. ప్రవ్రజింపజేయటానికి అనుమతించు అన్నాడు.

సౌగంధికగుప్తుడు అనుమతించాడు. అప్పుడు సాణకవాసిస్థవిరుడు ఉపగుప్తుని నటభటిక అరణ్యానికి తీసుకొనిపోయి జ్ఞప్తిచతుర్థకర్మతో[6] ఉపసంపన్నుని చేశాడు. అన్ని క్లేశాలూ పోగా, ఉపగుప్తుడు అర్హత్వాన్ని సాక్షాత్కరించుకున్నాడు.

అప్పుడు సాణకవాసిస్థవిరుడు "వత్సా ఉపగుప్తా! నా పరినిర్వాణానికి నూరేండ్ల తర్వాత అలక్షణికబుద్ధుడుగా ఉపగుప్తుడనే భిక్షువు పుడతాడు. అతడు నా నిర్వాణానికి నూరేండ్ల తర్వాత బుద్ధకార్యాన్ని నిర్వహిస్తాడు. బోధకులైన నా శ్రావకులందరిలో 'ఆ ఉపగుప్తుడే శ్రేష్ఠుడు' అని తథాగతుడు నీ గురించే చెప్పాడు. కనుక వత్సా! శాసనహితం కోసం నీవు కృషి చేయాలి" అన్నాడు. ఉపగుప్తుడు "అలాగే జరుగుగాక!" అన్నాడు.

---

6. అనుబంధంలో చూడుము

అప్పుడు అతడు ధర్మాన్ని వినిపించటానికి పూనుకున్నాడు. 'ఉపగుప్తుడనబడే అలక్షణికబుద్ధుడు నేడు ధర్మాన్ని ఉపదేశిస్తాడు' అని మథురలో తెలియజేయబడింది. వినటానికి అనేక వందలవేల ప్రాణులు బయలుదేరారు.

అప్పుడు ఉపగుప్తస్థవిరుడు ధ్యానసమాపన్నుడై తథాగతుని పరిషత్తు 'ఏ విధంగా కూర్చుండేదో' అని చూసి, 'అది అర్ధచంద్రాకారంలో కూర్చుని ఉండేద'ని తెలుసుకున్నాడు. అప్పుడు 'తథాగతుడు ఏ విధంగా ధర్మదేశనం చేసేవాడో' అని చూసి, క్రమాన్ని అనుసరించి ధర్మాన్ని బోధించి సత్యాన్ని ప్రకాశింపజేసేవాడని తెలుసుకున్నాడు. అతడు కూడా క్రమానుగతంగా ధర్మాన్ని బోధించి సత్యాన్ని తెలియజేయసాగాడు.

అప్పుడు మారుడు ఆ పరిషత్తులో ముత్యాలవర్షాన్ని కురిపించి, శిక్షణపొందుతున్నవారి మనస్సులను వ్యాకులపరిచాడు. ఒక్కరు కూడా సత్యదర్శనాన్ని పొందలేదు.

అప్పుడు ఉపగుప్తస్థవిరుడు 'ఎవరు ఈ విఘ్నాన్ని కల్గించారని' చూడగా మారుడు కనిపించాడు.

రెండవదినం 'ఉపగుప్తుడు బోధిస్తుంటే ముత్యాలవర్షం కురుస్తుందని' అనేకమంది ప్రజలు వచ్చారు. రెండవదినం కూడా ఉపగుప్తస్థవిరుడు క్రమానుగతంగా బోధించి, సత్యాన్ని తెలియజేయటం మొదలుపెట్టగానే మారుడు సువర్ణవర్షాన్ని కురిపించాడు. శిక్షితులవుతూన్నవారి మనస్సులు కల్లోలమైనాయి. ఒక్కరు కూడా సత్యదర్శనాన్ని పొందలేదు.

అప్పుడు ఉపగుప్తస్థవిరుడు 'ఎవరు ఈ విఘ్నాన్ని కలిగించారని' చూడగా పాపిమారుడు కనిపించాడు.

మూడవదినం కూడా 'ఉపగుప్తుడు ధర్మాన్ని బోధిస్తుంటే ముత్యాలవాన, బంగారువాన కురుస్తుందని' అనేకమంది ప్రజలు వచ్చారు. మూడవనాడు కూడా ఉపగుప్తస్థవిరుడు క్రమానుగతంగా బోధించి, తెలియజేయటం మొదలుపెట్టగానే మారుడు కొంతదూరంలో నాటకాన్ని ఆరంభించాడు. దివ్యమైనవాద్యాలు మ్రోగింపబడినాయి. దివ్యాప్సరసలు నాట్యమాడసాగారు. వీతరాగజనులు కూడా మారుడు ప్రదర్శించే దివ్వరూపాలను చూడటానికి, దివ్యశబ్దాలను వినటానికి ఆకర్షితులయ్యారు.

అలా ఉపగుప్తుని పరిషత్తును ఆకర్షించిన మారుడు ప్రీతితో ఉపగుప్తస్థవిరుని శిరస్సుకు మాలను కట్టాడు. ఉపగుప్తస్థవిరుడు ధ్యానసమాపన్నుడై 'ఎవరీపని చేశార'ని చూడగా మారుడు కనిపించాడు. అతనికి 'ఈ మారుడు భగవానుని శాసనానికి గొప్ప విఘ్నకారి. అతన్ని భగవానుడు ఎందుకు లొంగదీయలేదు?' అనిపించింది. అప్పుడతనికి 'అతన్ని తానే లొంగదీయవలసి ఉంద'ని తెలిసింది. "అన్ని ప్రాణులకు మేలు చేకూరేట్టుగా అతన్ని లొంగదీస్తాననే భగవానుడు నన్ను 'అలక్షణిక బుద్ధుడు' అన్నాడు" అని గుర్తించాడు.

'మారుని లొంగదీసే సమయం వచ్చిందా?' అని ఉపగుప్తుడు ధ్యానసమాపన్నుడై చూసి 'ఆ సమయం వచ్చింద'ని తెలుసుకున్నాడు. అప్పుడు ఉపగుప్తస్థవిరుడు మూడు శవాలను తీసుకున్నాడు. పాముశవం, కుక్కశవం, మానవశవం. ఋద్ధిశక్తితో వాటిని పుష్పమాలలుగా మార్చి మారునివద్దకు పోయాడు. అతన్ని చూసి 'ఉపగుప్తుడు నాచే ఆకర్షింపబడినాడ'ని మారునికి ప్రీతి కలిగింది.

అప్పుడు ఉపగుప్తుడు తనకు స్వయంగా పూలమాలలు వేస్తాడని మారుడు శరీరంతో కనిపించాడు. ఉపగుప్తస్థవిరుడు పాము శవాన్ని మారుని తలకు కట్టాడు. కుక్కశవాన్ని మెడలో, మానవశవాన్ని చెవులకు కట్టాడు. వాటిని పట్టుకొని అతడు ఇలా అన్నాడు.

"భిక్షుజనులకు ప్రతికూలమైన మాలను
నీవు నాకు కట్టినట్లే,
కాముకజన ప్రతికూలమైన శవాలను
నేను నీకు కట్టాను.
నీకున్న బలాన్నంతా చూపించు.
నేడు నీకు బుద్ధపుత్రునితో సమాగమం కలిగింది.
సాగరతరంగాలను భిన్నం చేసి, ఇంకిపోయేట్టు చేసే అనిలుడు కూడా
మలయపర్వతకుక్షిలో తన శక్తిని కోల్పోతాడు."

అప్పుడు మారుడు ఆ శవాలను తొలగించుకోవటానికి ప్రయత్నించాడు. కాని ఒక చీమ పర్వతాన్ని ఎత్తజాలనట్లే మారుడు వాటిని తొలగించుకోలేకపోయాడు. అతడు ఆకాశంలోనికి ఎగిరి ఇలా అన్నాడు –

"కంఠంలో వేసిన కుక్కశవాన్ని

స్వయంగా నేను తొలగించుకోలేకపోతే
నాకన్నా తేజోవంతులైన దేవతలు తొలగిస్తారు.”
స్థవిరుడు ఇలా అన్నాడు
“బ్రహ్మ వద్దకు పో! ఇంద్రుని శరణు పొందు!
అగ్నిలో ప్రవేశించు! సముద్రంలో మునుగు!
నీ కంఠంలోని ఈ శవం
ఎండదు, తడువదు, విడిపోదు.”

మహేంద్ర, రుద్ర, ఉపేంద్ర, ఈశ్వర, యమ, కుబేర, వాసవాదుల వద్దకు, ఇతరదేవతల వద్దకు పోయినా అతడు తన లక్ష్యాన్ని సాధించలేకపోయాడు. చివరకు అతడు బ్రహ్మవద్దకు పోయాడు. బ్రహ్మ

“వత్సా! –

దశబలుని శిష్యుడు స్వయంగా
తన బుద్ధిశక్తితో వేసిన ఈ బంధాన్ని
ఎవరు తొలగించగలరు?
అది సాగరం వలె అపరిమితమైనది.
నరుడు హిమాలయాన్ని కమలనాళంతో
బంధించి పెకిలించవచ్చును కాని,
నీ కంఠంలో వేయబడిన ఈ కుక్కశవాన్ని
తొలగించటం సాధ్యంకాదు.
నా శక్తి గొప్పదే. కాని నేను కూడా
తథాగతపుత్రునితో సరిపోలను.
నక్షత్రాల్లో శక్తి ఉన్నమాట నిజమే కాని
అది ప్రచండసూర్యబింబం ముందు ఎందుకూ కొరగాదు” అన్నాడు.

అప్పుడు మారుడు ‘‘ఇప్పుడు నాకేమి ఆజ్ఞ? నన్ను ఎవరిని శరణు పొందమంటారు?” అన్నాడు.

బ్రహ్మ బదులు పలికాడు.

"భూమిపై పడినవాడు లేవటానికి
భూమినే ఊతగా తీసుకొనునట్లుగా,
నీవా ఉపగుప్తునే శరణు పొందు.
అతన్ని ఎదుర్కోవటం వల్లనే నీ వైభవం, కీర్తి, సుఖం అన్నీ పోయాయి."

తథాగతుని శిష్యుడు ఎంత శక్తివంతుడో తెలిసిన తర్వాత మారుడు ఇలా చింతించాడు.

"ఎవరి శిష్యుని శాసనబలాన్ని బ్రహ్మకూడా పూజిస్తాడో
అట్టి బుద్ధుని సామర్థ్యాన్ని కొలవటం ఎవరితరం?"
ఆ సువ్రతుడు తలచుకుంటే నన్ను శిక్షించేవాడే.
కాని క్షమాశీలుడైన అతడు
అలా చేయకుండా నన్ను వదిలివేశాడు.
అధికంగా మాట్లాడటం ఎందుకు?
నేడు నేను మునియొక్క మహాకారుణికతను,
అతని అపారమైత్రిని తెలుసుకున్నాను.
అతని మనస్సు అన్ని ఉపద్రవాలనుండి ముక్తమైనది.
అతని తేజస్సు సువర్ణపర్వతం వంటిది.
మోహాంధకారం వలన నేను అతన్ని మళ్లీ మళ్లీ ఖేదింపజేశాను.
అయినా ఆ మహాబలుడు నన్ను అప్రియమైన
ఒక్కమాట కూడా అనలేదు.

అప్పుడు కామధాతువుకు అధిపతియైన మారుడు 'ఉపగుప్తుడు తప్ప ఇంకొక గతిలేద'ని తెలిసికొని అన్నింటినీ విడిచి స్థవిర ఉపగుప్తుని సమీపించి, పాదాలపైపడి ఇలా అన్నాడు –

"భదంతా! భగవానుడు బోధిమూలం వద్ద ఉన్నప్పటినుండి నేను చేసిన వందలకొలది అప్రియాలను వినండి.

సాలా అనే బ్రాహ్మణగ్రామంలో ఆయనకు
ఆహారం దొరుకకుండా చేశాను. అయినా ఆయన

నాకేమీ అప్రియం చేయలేదు.
శకటరూపాన్ని ధరించినపుడు, వృషభరూపాన్ని ధరించినపుడు,
పాముగా పైకి లేచినపుడు భగవానుని హింసించాను.
కాని ఆయన ఎన్నడూ నాకు హాని చేయలేదు. కాని
మీరు ఓ మహాత్మా! మీ అపారమైన దయను వదలివేశారు.
సురాసురనరలోకాలలో నన్ను చిన్నబుచ్చారు."

స్థవిరుడు ఇలా అన్నాడు –

"పాపీ! పరిశీలించకుండా తథాగతుని గొప్పతనాన్ని శ్రావకులతో ఎలా పోలుస్తావు?
ఆవగింజ మేరువును పోలుతుందా?
మిణుగురు పురుగు సూర్యుని పోలుతుందా?
దోసిలిలోని నీరు సముద్రంతో సరిపోలుతుందా?
ప్రాణులపట్ల బుద్ధునికిగల కరుణ అంతులేనిది.
శ్రావకుడు అంతటి కరుణను కలిగి ఉండజాలడు. ఇంకా

ఇన్ని తప్పులు నీవు చేసినా తథాగతుడు నిన్ను
ఎందుకు వదలివేశాడో నాకిప్పుడు స్పష్టంగా తెలుస్తూ ఉంది."

మారుడిలా అన్నాడు –

"సంగాన్ని నరికి ఓర్పునే వ్రతంగా కలిగిన
ఆ భగవానుని భావాన్ని నాకు చెప్పండి.
నేను మోహం వలన ఆయనను
నిరంతరం బాధించాను. అయినా
ఆయన ఎప్పుడూ మైత్రిభావంతోనే నన్ను చూశాడు."

స్థవిరుడిలా అన్నాడు –

"సౌమ్యా! విను. నీవు భగవానునిపట్ల అనేక అపరాధాలు చేశావు. నీవా అకుశలాలను కడిగివేసుకోవటానికి ఒకే మార్గం ఉంది. అదే తథాగతునియందు విశ్వాసం. ఆయన అనుగ్రహమే వాటిని తొలగిస్తుంది."

"అదే కారణం. దీన్ని చూసే ఆ దీర్ఘదర్శి నిన్నేమీ అనలేదు. న్యాయంగా నీ హృదయంలో ఆయనపట్ల జనించిన కొంచెం భక్తి అయినా నిర్వాణఫలాన్ని ఇస్తుంది. రెండుమాటల్లో చెప్పాలంటే  అజ్ఞానపు చీకటిలో నీవు ఆ మునిపట్ల చేసిన తప్పులన్నీ నీ హృదయంలోనుండి వర్షించే, శ్రద్ధామేఘాల వలన కడుగబడుతాయి."

అప్పుడు మారుడు కదంబపూలమొగ్గల్లాగా రోమాలు వణకుతూండగా స్థవిరుని ముందు సాష్టాంగపడి –

"అతడు సిద్ధిపొందటానికి ముందు నేను
ఈ భూమిపై విజయం పొందాలనే కోరికతో
అనేకవిధాలుగా అతన్ని ఖేదింపజేశాను.
ఆ ఋషిప్రవరుడు అనునయంతో
తండ్రి కొడుకు తప్పులను పట్టించుకోనట్లుగా
వాటిని పట్టించుకోలేదు."

అతడు  చాలాసేపు బుద్ధుని గుణాలను స్మరించుకొని స్థవిరుని పాదాలపై పడి –

"నాపై అనుగ్రహం చూపి నాలో
బుద్ధునిపట్ల గౌరవాన్ని కలిగించారు.
ఇక నా కంఠంలో వ్రేలాడుతున్న
ఈ మహర్షి కోపాభరణాన్ని తొలగించండి" అన్నాడు.

స్థవిరుడు "ఒక నిబంధనతో నిన్ను విడిపిస్తాను" అన్నాడు.

మారుడు  "ఏమి నిబంధన?" అన్నాడు.  స్థవిరుడు  "నేటినుండి భిక్షువులను వేధింపకూడదు" అన్నాడు. మారుడు "వేధించను. ఇంకా ఏమి ఆజ్ఞ?" అన్నాడు. "ఇది వరకు నిన్ను శాసనకార్యాన్ని గురించి ఆజ్ఞాపించాను. ఇప్పుడు నా కార్యాన్ని గురించి నీకు విజ్ఞప్తి చేస్తున్నాను" అన్నాడు స్థవిరుడు. మారుడు తత్తరపాటుతో  "సెలవివ్వండి" అన్నాడు. స్థవిరుడు  'భగవానుడు పరినిర్వాణాన్ని పొందిన వందసంవత్సరాలకు నేను ప్రవ్రజితుడనయ్యాను.'  అందువలన

"నేనాత్రైలోక్యనాథుని ధర్మకాయాన్నే చూశాను కాని
కాంచనాద్రిసన్నిభమైన రూపకాయాన్ని చూడలేదు.
ఆ అనుపమ అనుగ్రహానికి మారుగా
నీవే నాకు బుద్ధుని రూపాన్ని చూపించాలి.
దశబలరూపదర్శన కుతూహలుడనైన నాకు
ఇంతకన్న ప్రియమైనదేమీ లేదు" అన్నాడు.

మారుడు "అలా అయితే నా నిబంధనను వినండి" –

"బుద్ధరూపాన్ని ధరించినవెంటనే మీరు సర్వజ్ఞునిపట్ల గల గుణగౌరవంతో నాకు ప్రణామం చేయగూడదు. బుద్ధానుస్మృతిలో చేరిన మనస్సుతో ఒకవేళ మీరు నన్ను ఏ కొంచెం పూజించినా నేను దగ్ధమైపోతాను. ఓ ప్రభూ! వీతరాగులైన మీ ప్రణామాన్ని భరించే శక్తి నాకు లేదు. మీ చేతి కదలికే నన్ను కాల్చగలదు. ఏనుగు తొండం శక్తిని ఆముదపు మొలక తట్టుకోగలదా? అన్నాడు."

స్థవిరుడు "అలాగే నేను నీకు ప్రణామం చేయను" అన్నాడు. మారుడు "అలా అయితే ముహూర్తకాలం ఆగండి. నేను అడవిలో ప్రవేశిస్తాను. పూర్వం నేను సూరుని వంచించటానికి అచింత్యబుద్ధవైభవంనుండి బంగారు కాంతులతో ప్రజ్వలించే బుద్ధరూపాన్ని ధరించాను. ఇప్పుడు స్వచ్ఛమైన సూర్యకిరణజాలం వంటి ప్రభామండలాన్ని కల్గిన నయనానందకరమైన అదే రూపాన్ని ధరిస్తాను" అన్నాడు.

అప్పుడు స్థవిరుడు 'అలాగే' అని పలికి ఆ శవాన్ని తొలగించి తథాగతుని రూపాన్ని దర్శించాలని ఎదురుచూడసాగాడు. మారుడు అడవిలోనికి పోయి బుద్ధరూపాన్ని ధరించి, నటుడు తెరవెనుకనుండి వచ్చినట్లుగా అడవినుండి వచ్చాడు.

నిజంగా అది అలాగే చెప్పబడింది.

"ఉత్తమ లక్షణాలను కలిగిన, చూపరులకు నయనానందకరమైన తథాగతరూపాన్ని ధరించి చిత్రపటంతో రంగస్థలాన్ని అలంకరించునట్లుగా అతడు ఆ అడవిని అలంకరింపజేశాడు. కాంతిపరివేషంతో భగవానుని, భగవానునకు కుడిప్రక్కన సారిపుత్రస్థవిరుని, ఎడమప్రక్కన మౌద్గల్యాయన స్థవిరుని, బుద్ధుని పాత్రను చేతిలో

పట్టుకొని వెనుక ప్రక్కన ఆయుష్మంతుడైన ఆనందుని, మహాకాశ్యపస్థవిరుని, అనిరుద్ధ, సుభూతి మొదలైన మహాశ్రావకుల రూపాలను కూడా కల్పించి, పదమూడు వందల భిక్షువులు అర్ధచంద్రాకారంలో భగవానుని పరివేష్టించి ఉన్న దృశ్యాన్ని చూపిస్తూ మారుడు ఉపగుప్తస్థవిరుని వద్దకు వచ్చాడు. ఉపగుప్తునకు భగవానుని రూపం ఈ విధంగా ఇలా ఉంటుందని తెలిసి అపరిమితమైన సంతోషం కలిగింది."

ఆ సంతోషంతో అతడు ఆసనం నుండి లేచి చూస్తూ –

"కరుణలేకుండా ఇలాంటి రూపాలను
ధ్వంసం చేసిన అనిత్యతకు ధిక్కారం.
అంతటి మహాముని శరీరం కూడా
అనిత్యత వలన వినాశనాన్ని పొందింది." అన్నాడు.

బుద్ధావలంబనలో ఉన్న స్మృతితో అతడు తథాగతుని రూపాన్ని చూస్తున్నట్లుగానే తలంచి ఆ రూపానికి దగ్గరగా జరిగి, ముకుళితపద్మంలా చేతులు జోడించి – " ఆహా! ఏమి భగవానుని రూపశోభ! ఏమని చెప్పాలి!

"కమలం వంటి ముఖం, నీలికలువల వంటి కన్నులు
వనపుష్పాలవంటి కాంతి, పూర్ణచంద్రునివంటి చల్లని మనస్సు.
సాగరం వంటి గంభీరత, మేరుపర్వతం వంటి స్థిరత్వం.
సూర్యునివంటి తేజస్సు, సింహం వంటి నడక,
వృషభం వంటి చూపులు, బంగారం వంటి మేనిఛాయ." అన్నాడు.

ఉపగుప్తస్థవిరుని హృదయం ఆనందంతో నిండిపోగా –

"అహెూ! ఏమి భావవిశుద్ధిని కలిగించే కర్మల మధురఫలం!
ఇది ఐశ్వర్యం వలన కాని యాదృచ్ఛికంగా కాని కలిగినది కాదు.
సహస్రకోటి కల్పాలనుండి
వాక్కాయ, చిత్తాలను నిగ్రహించుకొని చేసిన
దానం వలన, ఓర్పు వలన,
ధ్యానం వలన, జ్ఞానం వలన

ఈ అర్హతులు
తమను తాము శోధించుకున్నారు.
ఆ విధంగానే శాస్త నయనానందకరమైన
ఇటువంటి రూపాన్ని పొందాడు.
ఇది శత్రువులకు కూడా సంతోషాన్ని కలిగించేది కాగా ఇక
నావంటివాని గురించి చెప్పేదేముంది?" అని

సంబుద్ధుని ఆలంబనంలో తనను తాను మరచి, బుద్ధుడనే ఎరుకతో మొదలు పడిపోయిన చెట్టులా మారుని పాదాలమీద పడిపోయాడు. మారుడు తత్తరపాటుతో ఇలా అన్నాడు. "భదంతా! మీరు మన ఒప్పందాన్ని ఉల్లంఘించగూడదు." "ఏ ఒప్పందం?" "భదంతులు నాకు ప్రణామం చేయగూడదని నేను ముందే ప్రతిన చేయించాను."

అప్పుడు ఉపగుప్తస్థవిరుడు భూమిపైనుండి లేచి ఇలా అన్నాడు –

పాపీ!

"నీటితో చల్లారిన అగ్నిలా ఆ వాదిప్రముఖుడు
ఉపశమించాడని నాకు తెలుసు.
అయినా నయనానందకరమైన ఆ రూపాన్ని చూచి,
నేను ఆ ఋషిముందు మోకరిల్లాను.
అంతేగాని నిన్ను పూజించలేదు."

మారుడు ఇలా అన్నాడు "అదెలా? నా ముందు నమస్కరించినపుడు నేను పూజింపబడలేదా?"

స్థవిరుడు "నేను నీకెలా నమస్కరించలేదో, ఒప్పందాన్ని ఎలా ఉల్లంఘించలేదో విను!

మృణ్మయ దేవతాప్రతిమలకు నమస్కరిస్తున్న మనుష్యులు
మట్టి భావనగాక దేవతాభావాన్ని కలిగి ఉన్నట్లుగా,
నేను లోకనాథుని రూపాన్ని ధరించిన నిన్ను చూచి
సుగతభావనతోనే సమస్కరించాను కాని
మారభావనతో కాదు" అన్నాడు.

అప్పుడు మారుడు బుద్ధునిరూపాన్ని అదృశ్యం చేసి, ఉపగుప్తస్థవిరునికి ప్రణామం చేసి వెళ్లిపోయాడు. నాల్గవనాడు అతడు స్వయంగా మథురలో గంటను మ్రోగిస్తూ "స్వర్గాపవర్గ సుఖాలను కోరేవారు ఉపగుప్తస్థవిరుని వద్ద ధర్మాన్ని వినండి! తథాగతుని చూడని ఆయుష్మంతులు ఉపగుప్తస్థవిరుని చూడండి!" అని చాటించాడు.

"కష్టాలకు మూలమైన దారిద్ర్యాన్ని వదలదలచుకున్నవారు,
ఇక్కడే వెలుగును, సంపదలను పొందదలచుకున్నవారు,
స్వర్గాపవర్గ సుఖాలను ఆశించేవారు శ్రద్ధతో అతని ధర్మాన్ని వినండి!
మానవశ్రేష్ఠుడు, శాస్త, మహాకారుణికుడు, స్వయంభువు అయిన
బుద్ధుని చూడనివారు శాస్తవంటివాడు, మూడు లోకాలకు దీపంవంటివాడు అయిన
ఉపగుప్తుని చూడండి"

"ఉపగుప్తస్థవిరుడు మారుని లొంగదీశాడు" అనే మాట మథుర అంతటా ప్రచారమైంది. పెద్దసంఖ్యలో మథురనివాసులు ఉపగుప్తస్థవిరుని వద్దకు పోయారు. అక్కడ ఉపగుప్తస్థవిరుడు ఎన్నో వందల వేల బ్రాహ్మణుల ఎదుట నిర్భయంగా సింహాసనం మీద కూర్చున్నాడు."

ఇలా చెప్పబడింది–

"అతనిలా సింహాసనం ఎక్కటం మూఢులకు సాధ్యం కాదు.
మూఢుడుగా ఆ సింహాసనాన్ని ఎక్కినవాడు లేడిలా కుంచించుకపోతాడు.
పరవాదుల దర్పాన్ని నశింపజేయటానికి సింహంలా గర్జించేవాడు,
వక్తలలో సింహసదృశుడు అయిన అతడు
ఆ సింహాసనాన్ని ఎక్కటానికి తగినవాడు."

అప్పుడు ఉపగుప్తస్థవిరుడు క్రమానుగతంగా ధర్మాన్ని బోధించి సత్యాన్ని తెలియజేశాడు. అది విన్న అనేక వందలవేల ప్రాణులు మోక్షసాధనకు ఉపకరించే కుశలమూలాలను పొందారు. కొందరు అనాగామి ఫలాన్ని పొందారు. కొందరు సకృదాగామి ఫలాన్ని పొందారు. కొందరు స్రోతాపత్తి ఫలాన్ని పొందారు. పద్దెనిమిదివేలమంది ప్రవ్రజించారు. వారందరూ తమను తాము నిగ్రహించుకొని అచిరకాలంలోనే అర్హత్వాన్ని పొందారు.

ఉరుముండ పర్వతంలో పద్దెనిమిది చేతుల పొడవు, పన్నెండు చేతుల వెడల్పుగల గుహ ఉన్నది. కృతకృత్యులైన వారందరితో ఉపగుప్తస్థవిరుడు "నా శిక్షణలో క్లేశముక్తులై అర్హత్వాన్ని పొందినవారందరూ నాలుగు అంగుళాల పొడవుగల కర్రపుల్లలను అందులో వేయండి" అన్నాడు. అదేరోజు ఆ పద్దెనిమిదివేలమంది అర్హతులు అందులో కర్రపుల్లలను వేయగా వాటితో అది నిండిపోయింది. "మధురలో ఉపగుప్తుడనే పేరుగలవాడు బోధకులందరిలో శ్రేష్ఠుడౌతాడని" బుద్ధుడు చెప్పినట్లుగా సముద్రపర్యంతం ప్రచారమైంది. అది అలాగే జరిగింది.

కామధాతు అధిపతిని లొంగదీసినవాడు, శాస్త్రవంటివాడు అయిన ఉపగుప్తుని పాదాలను సురలు, మునులు, మహానాగులు, అసురులు, గరుడులు, యక్షులు, గంధర్వులు, విద్యాధరులు పూజించారు. పూర్వబుద్ధులచే నాటబడిన కుశలబీజ సంతతిగల అనేక వందలవేల ప్రాణులపై సద్ధర్మసలిలధారలు కురియగా ఈ ఉరుముండపర్వతంపై వారిలో మోక్షాంకురాలు పెరిగాయి.

# పాంశుప్రదాన అవదానం

(మట్టిని దానం చేసిన కథ)

భగవానుడు రాజగృహంలో వేణువనంలో ఉడతలకు ఆహారం వేసేచోట విహరిస్తున్నాడు. అప్పుడు భగవానుడు పూర్వాహ్నసమయంలో పాత్ర, చీవరాలను తీసుకొని, భిక్షుగణపరివృతుడై, భిక్షుసంఘం గౌరవిస్తూండగా భిక్షకోసం రాజగృహంలో ప్రవేశించాడు. చెప్పబడినట్లుగానే

నిండుజాబిల్లి వంటి సౌమ్యమైన ముఖంతో,
బంగారుపర్వతం వంటి ఉత్తమ దేహంతో,
గజేంద్రునిలా లీలగా నడుస్తూ,
భగవానుడు భిక్షుగణపరివృతుడై కదిలాడు.

భగవానుడు దృఢచిత్తంతో నగరద్వారంలో పాదాన్ని మోపాడు. బుద్ధభగవానుడు ధర్మంలో దృఢంగా నిలిచిన చిత్తంతో నగరద్వారంలో కాలుమోపినపుడు అద్భుతమైన అనేక విచిత్రాలు జరుగటం పరిపాటి. గ్రుడ్డివారికి చూపు వస్తుంది. చెవిటివారు శబ్దాలను వినగలుగుతారు. కుంటివారు నడువగలుగుతారు. సంకెళ్లతో బంధింపబడినవారి బంధనాలు తొలగిపోతాయి. జన్మ జన్మలుగా వైరంతో ఉన్నవారు మైత్రీచిత్తాన్ని పొందుతారు. త్రాళ్లతో బంధింపబడిన దూడలు, బంధనం నుండి విడివడి ఆర్తితో తల్లులను కలుసుకుంటాయి. ఏనుగులు ఘీంకరిస్తాయి. గుర్రాలు సకిలిస్తాయి. జీవంజీవపక్షులు, నెమళ్లు మధురంగా కూస్తాయి. పెట్టెల్లో భద్రపరుచబడిన నగలు మధురంగా (కిణీ కిణీ) శబ్దం చేస్తాయి. మ్రోగింపబడకుండానే వాద్యసామాగ్రి మధురమైన శబ్దాలను వెలువరిస్తుంది. ఎత్తైన భూప్రదేశాలు క్రిందికి పోతాయి. పల్లపు ప్రదేశాలు పైకి లేస్తాయి. త్రోవలో రాళ్లు, గులక, కుండపెంకులు లేకుండా పోతాయి.

ఆ సమయంలో భూమి ఆరువిధాలుగా కంపిస్తుంది. తూర్పుదిక్కు భూభాగం పైకి లేస్తుంది. పశ్చిమభూభాగం క్రిందికి పోతుంది. మధ్యభాగం పైకి లేస్తుంది. చలనాలు,

ప్రచలనాలు, కదిలిపోవటం, అదిరిపోవటం ఇంకా ఇటువంటి ఇతర అనేక అద్భుత ధర్మాలు కలుగుతాయి. అందువల్లనే భగవానుని నగరప్రవేశసమయంలో –

“సముద్రంలో స్థితమై,
నగర, నిగమ, పర్వతాలతో అలంకరింపబడిన భూమి,
గాలివేగానికి వణికిన పాత్రలా
ముని చరణఘట్టనతో కదిలిపోయింది” అని చెప్పబడింది.

బుద్ధుని నగరప్రవేశ సమయంలో అనేక ప్రాతిహార్యాలు (అద్భుతాలు) కలిగాయి. అనిలబలానికి చలించి, సంక్షుభితమైన మహాసాగర తరంగాల్లా స్త్రీపురుషులు బిగ్గరగా విముక్త నాదాన్ని చేశారు. భగవానుని నగరప్రవేశం వంటి అద్భుతం మరొకటి కనిపించదు. పురప్రవేశసమయంలోనే అద్భుతమైన విచిత్రాలు కనిపిస్తాయి కనుకనే

“క్రిందిభాగాలు పైకి లేస్తాయి.
పైభాగాలు క్రిందికి పోతాయి.
బుద్ధుని మహిమ వలన త్రోవ
రాళ్లు, కంకర, ముండ్లు లేనిదై
దోషరహితంగా ఉంటుంది.
గ్రుడ్డివారు, మూగవారు, ఇంద్రియజడత్వం కలవారు,
అదే క్షణంలో ఇంద్రియాలు కలవారు అవుతారు.
నగరంలో మ్రోగించబడకుండానే వాద్యాలు
తూర్యనాదాలను వినిపిస్తాయి” అని చెప్పబడింది.

వేయి సూర్యులను మించిన బుద్ధుని బంగారు కిరణాల కాంతితో ఆ నగరమంతా వెలిగిపోయింది. ఇలా చెప్పబడింది.

అరణ్యాలతోపాటుగా సకలధరిత్రిపై
వ్యాపించిన అతనికాంతి
సూర్యుని కిరణాలను మందగింపజేసింది.
సురాసురనరలోకులకు తగినట్లుగా
ఉత్తమధర్మబోధను అందించింది.

భగవానుడు రాజమార్గంమీద నడుస్తుండగా అక్కడ త్రోవప్రక్కన జయుడు, విజయుడు అనే ఇద్దరు బాలకులు మట్టితో ఇళ్లను నిర్మిస్తూ ఆడుకుంటున్నారు. జయుడు అగ్రకులీనుడు. విజయుడు కులీనుడు. వారు ముప్పదిరెండు మహాపురుష లక్షణాలుగల భగవానుని చూశారు. అప్పుడు జయుడనే బాలుడు 'యథాశక్తితో ఇస్తాను' అని పిండి అనే భావనతో దోసిలిలో మట్టిని తీసుకొని భగవానుని పాత్రలో వేశాడు. విజయుడు చేతులు జోడించి దానిని ఆమోదించాడు. ఇలా చెప్పబడింది –

"మహాకారుణికుని, స్వయంభువును,
సర్వశరీరంనుండి ప్రకాశాన్ని వెలువరించే
భగవానుని చూసి, ధీరప్రసన్నమైన ముఖభంగిమతో
అతడు ఆ జాతిజరాంతకునికి
దుమ్మును దానం చేశాడు."

అతడు భగవానునికి దానం ఇచ్చి 'నేటి ఈ కుశలమూలం వలన పృథ్వికి ఏకచ్ఛత్రాధిపతియైన రాజునై, బుద్ధభగవానుని కార్యాన్ని నెరవేర్చెదనుగాక!' అని ప్రణిధానం (సంకల్పం) చేశాడు.

అప్పుడు ముని ఆ బాలుని హృదయపూర్వకమైన సమ్యక్ ప్రణిధానాన్ని చూచి, పుణ్యక్షేత్రం కారణంగా అతనికి ఇష్టఫలం సమకూరుతుందని తెలిసి, కరుణామానసుడై ఆ దుమ్మును గ్రహించాడు. రాజ్యఫలాన్ని ఇచ్చే కుశలమూలబీజం ఆ విధంగా వేయబడింది. దానిని భగవానుడు మందస్మితం ద్వారా దర్శింపజేశాడు.

బుద్ధపురుషులు మందస్మితం చేసినపుడు ప్రాణులకు ఈ విధంగా ఓదార్పు కలుగుతుంది. ఆ సమయంలో నీలం, పసుపు, ఎరుపు, తెలుపు, మంజిష్ఠ, స్ఫటిక, రజత కాంతులు వారి ముఖం నుండి వెలువడుతాయి. కొన్ని పైకి పోతాయి. కొన్ని క్రిందకు పోతాయి. క్రిందికి పోయినవి సంజీవ, కాలసూత్ర, సంఘాత, రౌరవ, మహారౌరవ, తపన, ప్రతాపన, అవీచీపర్యంతం పోయి శీతనరకాలను వెచ్చబరుస్తూ ప్రసరిస్తాయి. ఉష్ణనరకాలను చల్లబరుస్తూ ప్రసరిస్తాయి.

ఇలా వివిధ నరకాలలోని ప్రాణుల యాతనలు శాంతించగా, ఆ ప్రాణులు "మనం ఇప్పుడు ఎందుకు బాధపడటం లేదు? మనం ఇక్కడినుండి జారి, ఇంకొక చోట పుట్టామా

ఏమి?” అనుకొంటారు. అప్పుడు ఆ వివిధ నరకాలలో ఉన్నవారిలో శ్రద్ధను కలుగజేయటానికి భగవానుడు తన నిర్మితరూపాన్ని[7] చూపిస్తాడు. వారికిలా అనిపిస్తుంది – “మనం ఇక్కడనుండి పోలేదు. ఇంకొకచోట పుట్టలేదు. ఇంతకుముందు కనిపించిన ఈతని అనుగ్రహం వలన మన బాధలన్నీ తొలగిపోయాయి.” వారు నిర్మితచిత్తాలను పొంది నరకాల్లో అనుభవింపవలసిన కర్మలను నశింపజేసి, దేవ మానవ జన్మలను పొందుతారు. అక్కడ వారు సత్యనిష్ఠులై ఉంటారు. పైకిపోయిన కిరణాలు చాతుర్మహారాజిక దేవతలు, త్రయస్త్రింశ దేవతలు, యామ దేవతలు, తుషిత దేవతలు, నిర్మాణరతి దేవతలు, పరనిర్మితవశవర్తి దేవతలు, బ్రహ్మకాయిక దేవతలు, బ్రహ్మపురోహిత దేవతలు, మహాబ్రహ్మలు, పరిత్తాభులు, అప్రమాణాభులు, ఆభాస్వర దేవతలు, పరిత్తశుభ దేవతలు, అప్రమాణశుభ దేవతలు, శుభకృత్స్న దేవతలు, అనభ్రక దేవతలు, పుణ్యప్రసవ దేవతలు, బృహత్ఫల దేవతలు, అబ్రుహ, ఆతప, సుదృశ, సుదర్శన, అకనిష్ఠ పర్యంతం గల దేవతల వరకు పోయి ‘ఇది అంతా అనిత్యం, దుఃఖం, శూన్యం, అనాత్మ’ అని ఘోషిస్తాయి.

“ఆరంభించండి! ఇళ్లను వదలి
బయటకు రండి! బుద్ధశాసనంలో చేరిపోండి!
ఏనుగు వెదురుకుటీరాన్ని ధ్వంసం చేయునట్లుగా
మృత్యుసైన్యాన్ని ధ్వంసం చేయండి!
ఈ ధర్మవినయాల్లో అప్రమత్తులై చరించినవారు
సంసారంలో పుట్టుక నుండి ముక్తులై
దుఃఖాన్ని అంతం చేస్తారు” అని ప్రకటిస్తాయి.

త్రిసహస్ర, మహాసహస్రధాతువులందు సంచరించి ఆ కిరణాలు మరలా బుద్ధునిశరీరంలో ప్రవేశిస్తాయి. ఒకవేళ బుద్ధుడు (ప్రాణియొక్క) గతాన్ని గురించి చెప్పాలనుకుంటే ఆ కిరణాలు వెనుకభాగంనుండి అతనిలో అదృశ్యమౌతాయి. భవిష్యత్తును గురించి చెప్పాలనుకుంటే ముందునుండి అతనిలో అదృశ్యమౌతాయి. నరకాన్ని పొందటం గురించి చెప్పాలనుకుంటే పాదతలంలో అదృశ్యమౌతాయి. జంతుజన్మను పొందటం గురించి చెప్పాలనుకుంటే ప్రక్కభాగంలో అదృశ్యమౌతాయి. ప్రేతజన్మను పొందటం

7. భౌతిక దేహం కాదు. ఇద్ధిశక్తి ద్వారా కల్పించబడిన రూపం.

గురించి చెప్పాలనుకుంటే కాలిబొటనవ్రేలులో అదృశ్యమౌతాయి. మానవజన్మను పొందటం గురించి చెప్పాలనుకుంటే మోకాలిలో అదృశ్యమౌతాయి. బలచక్రవర్తి రాజ్యాన్ని గురించి చెప్పాలనుకుంటే ఎడమ అరచేతిలో అదృశ్యమౌతాయి. చక్రవర్తిరాజ్యాన్ని గురించి చెప్పాలనుకుంటే కుడి అరచేతిలో అదృశ్యమౌతాయి. దేవతాజన్మను పొందటం గురించి చెప్పాలనుకుంటే నాభిలో అదృశ్యమౌతాయి. శ్రావకబోధిని పొందటం గురించి చెప్పాలనుకొంటే నోటిలో అదృశ్యమౌతాయి. ప్రత్యేకబోధిని పొందటం గురించి చెప్పాలనుకొంటే ఊర్ణం (కనుబొమల మధ్యలో ఉండే సుడి) లో అదృశ్యమౌతాయి. అనుత్తరసమ్యక్సంబోధిని పొందటం గురించి చెప్పాలనుకుంటే ఉష్ణీషం (తలపాగా) లో అదృశ్యమౌతాయి.

అప్పుడు ఆ కిరణాలు భగవానునకు మూడుసార్లు ప్రదక్షిణం చేసి భగవానుని ఎడమ అరచేతిలో అదృశ్యమైనాయి.

ఆయుష్మంతుడు ఆనందుడు కారణం లేకుండా భగవానుడు నవ్వడు అనుకొని చేతులు జోడించి ఈ గాథలను పలికాడు.

“ఔద్ధత్య, మద, దైన్యాలు నశించిన బుద్ధులు,
జగతిలో హేతుపూర్వకంగా ప్రవర్తిస్తారు.
తథాగతుడు కారణం లేకుండా,
ఊరకే చిరునవ్వు నవ్వడు.
శత్రువులను జయించిన జినులు,
శంఖంలా, పద్మంలా నవ్వే స్వచ్ఛమైన
ఆ చిరునవ్వుకు కారణం ఉండే ఉంటుంది.
శ్రోతలసంశయాలను వెంటనే శమింపజేసే ఓ జినేంద్రా!
ధీరా! మునిశ్రేష్ఠా! వాగ్విద్వరిష్ఠా!
నా ఈ సంశయాన్ని తొలగించు!
మేఘగర్జన వంటి స్వరం, గోవృషభేంద్రునివంటి చూపులుగల
నరోత్తమా! ఆ దుమ్మును దానం చేసినందుకు
కలిగే ఫలాన్ని చెప్పు!”

భగవానుడు "ఆనందా! నీవన్నది నిజమే. తథాగతుడు, అర్హంతుడు, సమ్యక్సంబుద్ధుడు అకారణంగా చిరునవ్వు నవ్వడు. సకారణంగానే తథాగతుడు, అర్హంతుడు, సమ్యక్సంబుద్ధుడు చిరునవ్వు నవ్వుతాడు."

"ఆనందా! తథాగతుని పాత్రలో దోసిలితో దుమ్మును పోసిన ఆ బాలుని చూడు." "అలాగే భదంతా!" "ఆనందా! ఆ బాలుడు ఆ కుశలమూలం వలన తథాగతుడు పరినిర్వాణం చెందిన నూరేండ్లకు పాటలీపుత్రనగరంలో అశోకరాజుగా పుడతాడు. అతడు చతుర్భాగచక్రవర్తియై, ధార్మికుడై, ధర్మరాజుగా గుర్తింపబడతాడు. అతడు నా శరీరధాతువులను విస్తరింపజేసి, ఎనుబదినాలుగువేల ధర్మరాజికలను (స్తూపాలను) ప్రతిష్ఠింపజేస్తాడు. బహుజనుల హితం కోసం పాటుపడతాడు." అది అలాగే చెప్పబడింది–

"నేను అస్తమించిన నూరేండ్లకు
అశోకుడనే రాజు పుట్టి,
విశాలమైన కీర్తి కలవాడై
నా ధాతువులతో జంబూద్వీపాన్ని అలంకరించి
వాటిని నరులు, సురలు పూజించేట్లు చేస్తాడు.
అతడు తథాగతుని పాత్రలో
దోసిలితో దుమ్మును సమర్పించాడు."

భగవానుడు ఆ దుమ్మును ఆనందునికి ఇచ్చి, దానిని ఆవుపేడలో కలిపి, తథాగతుని చంక్రమణస్థలంలో (వ్యాయామం కోసం నడిచేచోట) చల్లమని చెప్పాడు. ఆనందుడు దానిని ఆవుపేడలో కలిపి భగవానుడు చంక్రమణం చేసేచోట చల్లాడు.

# అశోకుని జననం

ఆ సమయంలో రాజగృహనగరంలో బింబిసారుడనే రాజు రాజ్యం చేస్తున్నాడు. బింబిసారుని కొడుకు అజాతశత్రువు. అజాతశత్రువు కొడుకు ఉదాయి, ఉదాయి కొడుకు ముండుడు. ముండుని కొడుకు కాకవర్ణి, కాకవర్ణి కొడుకు సహలీ, సహలీ కొడుకు ఉలకుచి, ఉలకుచి కొడుకు మహాముండుడు, మహాముండుని కొడుకు ప్రసేనజిత్తు, ప్రసేనజిత్తు కొడుకు నందుడు, నందుని కొడుకు బిందుసారుడు. ఇప్పుడు పాటలీపుత్రనగరంలో బిందుసారుడనే రాజు రాజ్యం చేస్తున్నాడు. ఆ రాజుకు కొడుకు పుట్టాడు. అతనికి సుసీముడని పేరు పెట్టారు.

ఆ సమయంలో చంపానగరంలో ఒకానొక బ్రాహ్మణుడు ఉండేవాడు. అతనికి కూతురు పుట్టింది. ఆమె రూపవతి. చూడచక్కనిది. సంతోషాన్ని కలిగించేది. జనపదకల్యాణి. ఆమెను గురించి జ్యోతిష్కులు 'ఈ బాలికకు రాజు భర్తగా లభిస్తాడు. ఈమె ఇద్దరు పుత్రరత్నాలకు జన్మనిస్తుంది. అందులో ఒకడు చతుర్భాగచక్రవర్తి అవుతాడు. రెండవవాడు ప్రవ్రజితుడై వ్రతసిద్ధిని పొందుతాడు' అన్నారు. అది విన్న బ్రాహ్మణునికి ఒళ్లు పులకరించింది. లోకులు సంపత్తికాములు కదా!

అతడు ఆ కూతురుని తీసుకొని పాటలీపుత్రాన్ని చేరుకున్నాడు. అక్కడ ఆమెను సర్వాభరణాలతో అలంకరింపజేసి, 'ఈమె దేవకన్య వంటిది, ప్రశస్తమైనది, ఈమెను భార్యగా స్వీకరించమ'ని చెప్పి రాజు బిందుసారునికి అప్పగించాడు.

రాజు బిందుసారుడు ఆమెను అంతఃపురంలో ప్రవేశింపజేశాడు. అంతఃపురంలోని స్త్రీలకు 'ఈమె రూపవతి, సంతోషాన్ని కలిగించేది, జనపదకల్యాణి. ఒకవేళ ఈమె రాజుకు ప్రేమతో పరిచర్యలు చేస్తే రాజు మావైపు కన్నెత్తి కూడా చూడడు' అనిపించింది. అందువలన వారు ఆమెకు క్షురకర్మలో శిక్షణ ఇప్పించారు. ఆమె రాజుకు వెంట్రుకలు, గడ్డం తీసేది. ఆమె ఎంత సున్నితంగా ఆ పని చేసేదంటే, ఆమె క్షురకర్మ చేస్తున్నపుడు

ప్రతిసారీ రాజుకు నిద్ర వచ్చేది. రాజు చాలా సంతోషించి ఏదైనా వరం ఇవ్వాలనుకొని 'నీకు ఏ వరం కావాలి?' అని అడిగాడు. ఆమె 'నాకు దేవరవారితో కలయిక కావాల'ని అడిగింది. రాజు 'నీవు మంగలి స్త్రీవి. నేను మూర్ధాభిషక్తుడనైన క్షత్రియరాజును. నాతో నీ కలయిక ఎలా సాధ్యమౌతుంది?' అన్నాడు. ఆమె 'నేను మంగలిస్త్రీని కాను. బ్రాహ్మణుని కూతురును. మా తండ్రి నన్ను భార్యగా స్వీకరించమని మీకు అప్పగించాడు' అన్నది. రాజు 'అయితే నీకు మంగలిపని ఎవరు నేర్పించారు?' అన్నాడు. ఆమె 'అంతఃపురస్త్రీలు' అన్నది. రాజు 'ఇక నీవు మంగలిపని చేయగూడదు' అన్నాడు.

ఆమె పట్టపురాణిగా చేయబడింది. వారు ప్రేమతో ఆనందంగా గడిపారు. ఆమె గర్భవతియై ఎనిమిది, తొమ్మిది నెలలకు పుత్రుని ప్రసవించింది.

అతనికి గొప్పగా జాతకకర్మలు చేసి 'ఏం పేరు పెట్టాలి' అని అడిగారు. ఆమె 'బాలుని జననం వలన నేను శోకం లేనిదాననైనాను కనుక ఇతనికి అశోకుడని పేరు పెట్టండి' అన్నది.

తర్వాత రెండవపుత్రుడు పుట్టాడు. శోకం పోయిన తర్వాత పుట్టాడు కనుక అతనికి వీతశోకుడని పేరు పెట్టారు.

అశోకుని చర్మం గరుకుగా ఉండటం వలన అతడు రాజుకు ప్రేమాస్పదుడు కాలేకపోయాడు.

రాజు బిందుసారుడు, పింగళవత్సుడనే ఆజీవక పరివ్రాజకుని ఆహ్వానించి, 'నా తర్వాత రాజ్యాన్ని పాలించటానికి తగినవాడెవరో నిశ్చయించటానికి కుమారులను పరీక్షించాలి' అన్నాడు. పింగళవత్స ఆజీవక పరివ్రాజకుడు 'అయితే కుమారులందరితో సువర్ణమండప ఉద్యానానికి పోవాలి. అక్కడే వారిని పరీక్షిస్తాను' అన్నాడు. రాజు కుమారులందరినీ 'సువర్ణమండప ఉద్యానానికి వెళ్లాల'ని ఆదేశించాడు.

కుమారుడు అశోకునితో తల్లి "వత్సా! రాజు కుమారులను పరీక్షింపజేయటానికి ఉద్యానానికి వెళ్లాడు. నీవు కూడా అక్కడికి వెళ్లాలి" అన్నది. అశోకుడు "రాజుకు నా దర్శనమే గిట్టదు. నేను అక్కడికి ఎందుకు పోవాలి" అన్నాడు. ఆమె "అయినా నీవు వెళ్లాలి" అన్నది. అశోకుడు "నాకు ఆహారాన్ని పంపించు" అన్నాడు.

అశోకుడు పాటలీపుత్రం నుండి బయలుదేరేటపుడు ప్రధానామాత్యుడు రాధాగుప్తుని కొడుకు "అశోకా! ఎక్కడికి వెళుతున్నావు" అని అడిగాడు. అశోకుడు "రాజు నేడు సువర్ణమంటప ఉద్యానంలో కుమారులను పరీక్షింపజేస్తాడు. అక్కడికి వెళుతున్నాను" అన్నాడు. రాధాగుప్తుడు అది విని తాను ఎక్కిన శ్రేష్ఠమైన వృద్ధహస్తిని అశోకునికి ఇచ్చి, దానిపై కూర్చుండి వెళ్ళమన్నాడు. అది అంతకుముందు రాచ ఏనుగుగా ఉన్నటువంటిది. ఆ ఏనుగును ఎక్కి అశోకుడు సువర్ణమంటప ఉద్యానానికి పోయి కుమారుల మధ్య భూమిపై కూర్చున్నాడు.

కుమారులందరికీ ఆహారం ఇవ్వబడింది. అశోకుని ఆహారం పెరుగు కలిపిన వరి అన్నం. అప్పుడు రాజు పింగళవత్స ఆజీవక పరివ్రాజకునితో "ఆచార్యా! కుమారులను పరీక్షించి, నా తర్వాత రాజ్యం చేయటానికి తగినవారెవరో చెప్పండి!" అన్నాడు. పరిశీలించి చూసి పింగళవత్స పరివ్రాజకుడు 'అశోకుడు రాజవుతాడు, కాని అది రాజుకు ఇష్టం ఉండదు. కనుక అశోకుడు రాజవుతాడని చెపితే నా ప్రాణాలు దక్కవు' అని చింతించి "దేవా! భేదం కలుగకుండా చెపుతాను" అన్నాడు. రాజు "అలాగే చెప్పండి" అన్నాడు. పింగళవత్స పరివ్రాజకుడు "సుందరమైన వాహనంపై వచ్చినవాడు రాజవుతాడు" అన్నాడు.

అప్పుడు కుమారులందరికీ 'నా వాహనమే సుందరమైనది. నేనే రాజునవుతాను' అనిపించింది. అశోకుడు 'నేను ఏనుగుపై వచ్చాను. నా వాహనం సుందరమైనది. నేనే రాజునవుతాను' అనుకున్నాడు. రాజు "ఆచార్యా! మరోసారి పరీక్షించండి" అన్నాడు. అప్పుడు పింగళవత్స ఆజీవక పరివ్రాజకుడు "దేవా! ఎవరి ఆసనం శ్రేష్ఠమైనదో అతడు రాజవుతాడు" అన్నాడు. అందరికీ ఒకేవిధంగా 'నా ఆసనమే శ్రేష్ఠమైనది' అనిపించింది. అశోకుడు 'నా ఆసనం భూమి. నేనే రాజునవుతాను' అనుకున్నాడు. ఇలా వారి పాత్రలను, ఆహారాన్ని, పానీయాలను అనుసరించి కుమారులు విపులంగా పరీక్షింపబడ్డారు. అప్పుడు వారంతా పాటలీపుత్రానికి తిరిగి వెళ్లారు.

అశోకుని తల్లి అశోకుని "ఎవరు రాజవుతారని చెప్పారు?" అని అడిగింది. అశోకుడు "భేదం కలుగకుండా, 'ఎవరి వాహనం, ఆసనం, పాత్ర, భోజనం, పానీయం శ్రేష్ఠమో' అతడు రాజవుతాడని చెప్పారు. నా యానం ఏనుగు, నా ఆసనం భూమి, నా పాత్ర మట్టిపాత్ర, నా భోజనం పెరుగు కలిపిన వరి అన్నం, నా పానీయం నీరు. నాకు తెలిసినంతవరకు ఇవన్నీ శ్రేష్ఠమైనవే కనుక నేనే రాజునవుతాను" అన్నాడు.

అశోకుడు రాజవుతాడని తెలిసిన పింగళవత్స ఆజీవక పరివ్రాజకుడు అశోకుని తల్లిని రాజమాతగా గౌరవించసాగాడు. ఆమె "ఆచార్యా! బిందుసారమహారాజు తర్వాత ఎవరు రాజవుతారు?" అని పింగళవత్స ఆజీవకుని అడిగింది. ఆయన "అశోకుడు" అన్నాడు. ఆమె "మీరిక్కడ ఉంటే రాజు ఎప్పుడైనా మీపై ఒత్తిడితెచ్చి 'ఎవరు రాజవుతారని' అడుగవచ్చును. కనుక మీరు సరిహద్దుల్లోని రాజ్యానికి వెళ్లండి. అశోకుడు రాజయినాడని విన్న తర్వాత రావచ్చును" అన్నది. అతడు సరిహద్దు రాజ్యానికి వెళ్లాడు.

రాజు బిందుసారునికి వ్యతిరేకంగా తక్షశిలా నగరంలో తిరుగుబాటు చెలరేగింది. రాజు బిందుసారుడు అశోకుని పిలిచి "కుమారా! తక్షశిలా నగరాన్ని అదుపుచేయి" అని చెప్పి చతురంగబలాలనిచ్చాడు, కాని వాహనాలను, ఆయుధాలను ఇవ్వలేదు. అశోకుడు పాటలీపుత్రం నుండి బయలుదేరుతుండగా సైనికులు "మన సైన్యానికి ఆయుధాలు ఇవ్వబడలేదు. మనం వేటితో, ఎలా యుద్ధం చేయాలి?" అన్నారు. అశోకుడు వారితో 'నేను రాజునయ్యే కుశలకర్మను చేసినవాడనైతే ఆయుధాలు వచ్చుగాక!' అన్నవెంటనే భూమి తెరుచుకుని దేవతలు సైన్యానికి ఆయుధాలను ఇచ్చారు. కుమారుడు చతురంగబలాలతో తక్షశిలకు వెళ్లాడు.

అశోకుడు చతురంగబలాలతో వస్తున్నాడని విన్న తక్షశిలావాసులైన పౌరులు మూడున్నరయోజనాల వరకు మార్గాన్ని అలంకరించి, పూర్ణకుంభాలతో స్వాగతం పలికి "మేము కుమారునికి గాని, బిందుసారరాజుకుగాని వ్యతిరేకులం కాదు. కాని దుష్టులైన అమాత్యులు మమ్ములను అవమానించారు" అన్నారు. వారు అశోకుని గొప్ప సత్కారంతో తక్షశిలలో ప్రవేశింపజేశారు.

మరికొంతకాలం తర్వాత ఇదేవిధంగా ఖశరాజ్యంలో తిరుగుబాటు చెలరేగినపుడు కూడా రాజు అశోకుని అక్కడికి పంపించాడు. అక్కడ ఇద్దరు మహాయోధులు అశోకుని ఆశ్రయించారు. అశోకుడు వారికి జీవనభృతిని ఏర్పాటు చేశాడు. వారు అతని ముందు నడుస్తూ పర్వతాలగుండా మార్గాన్ని ఏర్పరచేవారు. సముద్రపర్యంతంగల భూమండలమంతటా 'అశోకుడు రాజవుతాడు. ఎవరూ అతనిని వ్యతిరేకించగూడదు' అని దేవతలు అందరినీ ఆజ్ఞాపించారు.

ఒకనాడు సుసీమకుమారుడు రాజోద్యానం నుండి తిరిగివస్తూ, పాటలీపుత్రంలో ప్రవేశిస్తూన్న సమయంలో బట్టతలగల ప్రధాన అమాత్యుడు నగరంనుండి బయటకు

పోతున్నాడు. అతన్ని చూసి సుసీమకుమారుడు సరదాగా అతని తలపై చిటిక వేశాడు. అమాత్యుడు 'నేడు ఇతడు నన్ను తలపై చేతితో చిటిక వేశాడు. కాని రేపు రాజయితే నా తలపై కత్తినుంచుతాడు. అశోకుడు చతుర్భాగ చక్రవర్తిగా నిర్దేశింపబడ్డాడు. అతన్నే రాజుగా అభిషేకించాలి. ఇతడు రాజు కాకుండా చూడాలి' అనుకున్నాడు. అతడు అయిదువందల అమాత్యులలో సుసీముని పట్ల భేదాన్ని కలుగజేశాడు.

తక్షశిలలో మళ్లీ తిరుగుబాటు లేచింది. దానిని అణచిరమ్మని రాజు సుసీమకుమారుని పంపించాడు. సుసీముడు దానిని అణచలేకపోయాడు. ఇక్కడ రాజు ఆరోగ్యం చెడిపోయింది. అప్పుడు రాజు 'అశోకుని తక్షశిలకు పంపించి, సుసీమకుమారుని ఇక్కడికి పిలిపించండి. అతన్ని రాజుగా అభిషేకించాలి' అని ఆదేశించాడు.

అశోకునికి అమాత్యులు పసుపును పూశారు. లక్కను కరిగించి, కరిగిన రసాన్ని లోహపాత్రకు పూసి రాజువద్దకు కొనిపోయి 'అశోకుడు రోగగ్రస్తుడై ఉన్నాడని, తక్షశిలకు వెళ్లటం సాధ్యంకాదని' చెప్పారు. రాజు బిందుసారుడు కొనప్రాణంతో ఉన్నపుడు అమాత్యులు అశోకుని సర్వాభరణాలతో అలంకరించి అతని వద్దకు తీసుకొనిపోయి 'ఇప్పటికి ఇతన్ని రాజుగా నిలుపండి. సుసీమకుమారుడు వచ్చిన తర్వాత అతన్ని రాజుగా నిలుపుతాము' అన్నారు.

రాజుకు కోపం వచ్చింది. అశోకుడు 'నేను ధర్మబద్ధంగా రాజునయ్యేది ఉంటే దేవతలే నాకు పట్టం కడతారు' అన్నాడు. అప్పుడు దేవతలు పట్టం కట్టారు. అది చూచి రాజు బిందుసారుడు నోటినుండి వేడిరక్తం కక్కుకొని చనిపోయాడు.

అశోకుడు రాజు కాగానే పైన యోజన పర్యంతం యక్షులు, క్రింద యోజనపర్యంతం నాగులు అతని ఆదేశాలను వినసాగారు. అతడు రాధాగుప్తుని ప్రధాన అమాత్యుడుగా నియమించాడు.

రాజు బిందుసారుడు చనిపోయాడని, అశోకుడు రాజుగా నియమించబడినాడని విన్న సుసీమకుమారుడు రోషంతో, వెంటనే పాటలీపుత్రానికి తిరిగి వచ్చాడు.

అశోకుడు పాటలీపుత్రంయొక్క రెండు ద్వారాల వద్ద తన ఇద్దరు మహాయోధులను, మూడవద్వారం వద్ద రాధాగుప్తుని నియమించి, తూర్పుద్వారం వద్ద తాను స్వయంగా నిలబడ్డాడు. రాధాగుప్తుడు పూర్వద్వారం వద్ద యంత్రమయమైన ఏనుగును నిలిపి, దానిపై

అశోకుని ప్రతిమను ఉంచాడు. దాని ముందర పెద్దగోతిని త్రవ్వించి, అందులో చంద్రనిప్పులను పోసి, పైన గడ్డిని పరిపించి, దానిపై మట్టిని వెదజల్లాడు. అప్పుడు అతడు సుసీముని వద్దకుపోయి 'అశోకుని చంపగలిగితే నీవే రాజువు అవుతావు' అని రెచ్చగొట్టాడు.

'అశోకునితో యుద్ధం చేస్తాను' అనుకొని అతడు వేగంగా తూర్పుద్వారం వద్దకు పోయి, చంద్రనిప్పులుగల గోతిలోపడి, బాధాకరమైన అకాలమృత్యువును పొందాడు. అతడు చనిపోయిన వెంటనే అతని ముఖ్యయోధుడు భద్రాయుధుడు తన వేలమంది అనుచరులతో బుద్ధశాసనంలో ప్రవ్రజించి, అర్హత్వాన్ని పొందాడు.

అశోకుడు రాజైన తర్వాత అనేకమంది మంత్రులు అతని పట్ల అవిధేయతతో ఉన్నారు. వారి విధేయతను పరీక్షించటానికి అశోకుడు వారిని 'పుష్ప, ఫల వృక్షాలను నరికి, ముండ్లవృక్షాలను పెంచండి!' అని ఆజ్ఞాపించాడు. వారు 'దేవరవారు పొరపడుతున్నారు? పుష్ప, ఫలవృక్షాలను పెంచి, ముండ్ల వృక్షాలను నరికివేయాలి' అన్నారు. రాజు మూడు సార్లు ఆజ్ఞాపించాడు. కాని వారు ప్రతిసారీ అదేమాట అన్నారు. రాజు కోపంతో ఒరనుండి ఖడ్గాన్ని తీసి ఆ అయిదువందల మంత్రుల తలలను నరికివేశాడు.

ఒకసారి రాజు అశోకుడు వసంతకాలంలో అంతఃపురజనంతో నగరంలోని తూర్పుభాగంలోని ఉద్యానానికి పోయాడు. వనంలోని చెట్లు ఫలపుష్పాలతో అందంగా ఉన్నాయి. అక్కడ తిరుగుతూ పుష్పాలతో శోభిస్తున్న అశోకవృక్షాన్ని చూసి, 'ఇది నాపేరుగలది' అని దానిని ఎంతో ఇష్టపడ్డాడు. అతడు గరుకు చర్మం కలవాడు కావటం వలన యువతులు అతని స్పర్శను ఇష్టపడేవారు కాదు. రాజు నిద్రపోగానే ఆ అంతఃపురకాంతలు (రాజుమీది) కోపంతో నిండా పూలుగల ఆ అశోకవృక్షపు కొమ్మలను నరికివేశారు.

నిద్ర మేల్కొన్న రాజు ఆ అశోకవృక్షాన్ని చూసి 'వాటిని ఎవరు నరికారని' దగ్గరగల పరిచారకులను అడిగాడు. వారు 'దేవా! అంతఃపురస్త్రీలు' అన్నారు. ఒళ్లుతెలియని కోపంతో రాజు ఆ అయిదువందల స్త్రీలను దహనగృహంలో ప్రవేశింపజేసి కాల్చివేశాడు. ఇటువంటి క్రూరకర్మల వలన అతనికి 'చండరాజు', 'చండాశోకుడు' అనే పేరు స్థిరపడిపోయింది.

ప్రధాన అమాత్యుడు రాధాగుప్తుడు “దేవా! మీరు స్వయంగా ఇటువంటి క్రూరకర్మలను చేయకూడదు. దేవరవారు చంపాలనుకున్నవారిని చంపేటందుకు వధకుని నియమించాలి” అన్నాడు. అప్పుడు రాజు ‘వధకుని వెదకండి’ అని ఆజ్ఞాపించాడు.

పాటలీపుత్రానికి కొంతదూరంలో కొండమొదట ఒక పల్లెటూరు ఉంది. అక్కడ ఒక సాలె నివసిస్తున్నాడు. అతనికి పుత్రుడు కలిగాడు. వానికి వారు గిరికుడని పేరుపెట్టారు.

వాడు క్రూరుడు, దుష్టాత్ముడు, తలిదండ్రులను తిట్టేవాడు. మగపిల్లలు, ఆడపిల్లలను కొట్టేవాడు. చీమలను, ఈగలను, ఎలుకలను చంపేవాడు. నీటిలోని చేపలను బడిశకర్రతో కొట్టి చంపేవాడు. వాడు చండుడు (క్రూరుడు) కనుక అందరూ వానిని చండగిరికుడు అనేవారు.

అతని పాపచరితం రాజపురుషుల దృష్టికి వచ్చింది. వారు అతనితో “నీవు రాజు అశోకునికై వధ్యకర్మలను చేయగలవా?” అన్నారు. అతడు “నేనీ మొత్తం జంబూద్వీపాన్ని చంపగలను” అన్నాడు.

వారు ఆ విషయాన్ని రాజుకు తెలియజేశారు. రాజు “పోయి అతన్ని తీసుకురండి” అన్నాడు. రాజపురుషులు చండగిరికునితో “రాజు రమ్మంటున్నాడు. పద” అన్నారు. అతడు “నా తలిదండ్రులను అడగాలి” అని, తలిదండ్రుల వద్దకు పోయి “అమ్మా! నాన్నా! నేను రాజు అశోకుని వద్ద వధకుడుగా చేరటానికి అనుమతించండి” అన్నాడు. వారు వద్దన్నారు. అతడు వారి ప్రాణాలు తీసి రాజపురుషుల వద్దకు పోయాడు. వారు “ఆలస్యంగా వచ్చావెందుకు?” అని అడిగితే విషయాన్ని వివరించి చెప్పాడు.

వారు అతన్ని రాజు అశోకుని వద్దకు తీసుకొనిపోయారు. రాజుతో అతడు “నాకు ఒక ఇంటిని నిర్మించి ఇవ్వండి!” అన్నాడు. రాజు ద్వారం మాత్రం రమణీయంగా ఉండి, లోపల పరమదారుణంగా ఉండే ఇంటిని నిర్మింపజేశాడు. దానికి రమణీయకబంధనమనే పేరు స్థిరపడింది. గిరికుడు “దేవా! నాకు ఒక వరమివ్వాలి. ఈ ఇంటి లోపల ప్రవేశించినవారు మరల బయటకు పోకూడదు” అన్నాడు. రాజు “అలాగే కానీ” అన్నాడు.

ఒకనాడు చండగిరికుడు కుక్కుటారామానికి[7] వెళ్లాడు. అక్కడ భిక్షువులు

7. పాటలీపుత్రంలోని ప్రధాన బౌద్ధవిహారం

బాలపండితసూత్రాన్ని చదువుతున్నారు. “ప్రాణులు నరకంలో పుడతారు. నరకపాలకులు వారిని పట్టుకొని కాలుతున్న, వెలుగుతూన్న, మంటలు గ్రక్కుతున్న ఇనుపనేలమీద వెల్లకిలా పరుండబెట్టి, ఇనుపకమ్మితో వారి నోళ్లను తెరిచి, కాలుతున్న, వెలుగుతున్న, మంటలు గ్రక్కుతూన్న ఇనుపగుండ్లను వారి నోటిలో వేస్తారు. అవి వారి పెదవులను కాలుస్తాయి. నాలుకను కాలుస్తాయి. కంఠాన్ని కాలుస్తాయి. కంఠనాళాన్ని, హృదయాన్ని, హృదయసమీపాన్ని, చిన్నప్రేవులను, పెద్దప్రేవులనూ కాల్చి క్రిందికి వెళ్లిపోతాయి. భిక్షువులారా! నరకబాధలు ఇలా ఉంటాయి.”

“ప్రాణులు నరకంలో పుడతారు. నరకపాలకులు వారిని పట్టుకొని కాలుతున్న, వెలుగుతూన్న, మంటలుగ్రక్కుతున్న ఇనుపనేలమీద వెల్లకిలా పరుండబెట్టి, ఇనుపకమ్మితో వారి నోళ్లను తెరిచి, వాటిలో మరుగుతూన్న రాగి ద్రవాన్ని పోస్తారు. అది వారి పెదవులను కాలుస్తుంది. నాలుకను కాలుస్తుంది. కంఠాన్ని కాలుస్తుంది. కంఠనాళాన్ని, హృదయాన్ని, హృదయసమీపాన్ని, చిన్నప్రేవులను, పెద్దప్రేవులనూ కాల్చి క్రిందికి వెళ్లిపోతుంది. భిక్షువులారా! నరకదుఃఖాలు ఇలా ఉంటాయి.”

“ప్రాణులు నరకంలో పుడతారు. నరకపాలకులు వారిని పట్టుకొని కాలుతున్న, వెలుగుతూన్న, మంటలుగ్రక్కుతున్న ఇనుపనేలమీద తలక్రిందులుగా నిలబెడతారు. కాలుతున్న ఇనుపతీగతో వారి శరీరాలమీద గుర్తులు పెడుతారు. కాలుతున్న, వెలుగుతున్న, మంటలుగ్రక్కుతున్న భీకరమైన ఇనుపగొడ్డలితో బలమైన దెబ్బలుకొడుతూ, సున్నితంగా తొలుస్తూ వారిని పైనుండి క్రిందికి, క్రిందినుండి పైకి ఎనిమిదవ భాగంగా, ఆరవభాగంగా, నాల్గవభాగంగా, వృత్తాలుగా, మండలాలుగా ముక్కలు ముక్కలు చేస్తారు. భిక్షువులారా! నరకబాధలు ఇలా ఉంటాయి.”

“ప్రాణులు నరకంలో పుడతారు. నరకపాలకులు వారిని పట్టుకొని కాలుతున్న, వెలుగుతూన్న, మంటలుగ్రక్కుతున్న ఇనుపనేలమీద తలక్రిందులుగా నిలబెడతారు. కాలుతున్న ఇనుపతీగతో వారి శరీరాలమీద గుర్తులు పెడుతారు. అప్పుడు వారు కాలుతున్న, మంటలులేని ఇనుపనేలపై వారిని నరుకుతూ, ముక్కలు చేస్తూ తొలుస్తూ పైనుండి క్రిందికి, క్రిందినుండి పైకి ఎనిమిదవ భాగంగా, ఆరవభాగంగా, నాల్గవభాగంగా, వృత్తాలుగా, మండలాలుగా ముక్కలు ముక్కలు చేస్తారు. భిక్షువులారా! నరకబాధలు ఇలా ఉంటాయి.”

"ప్రాణులు నరకంలో పుడతారు. నరకపాలకులు వారిని పట్టుకొని కాలుతున్న, వెలుగుతూన్న, మంటలుగ్రక్కుతున్న ఇనుపనేలమీద వెల్లకిలా పడుకోబెడతారు. అప్పుడు వారు అయిదురకాల బంధనాలను వేస్తారు. రెండు చేతులలో ఇనుపమేకులను కొడుతారు. రెండు పాదాలలో ఇనుపమేకులను కొడతారు. నడుములో, హృదయంలో ఇనుపమేకులు కొడతారు. భిక్షువులారా! నరకంలోని తీవ్ర బాధలు ఇలా ఉంటాయి."

అది విని 'అయిదు వేదనలు ఇలా ఉంటాయి' అనుకున్నాడు చండగిరికుడు. వాటిని తన భవనంలో అమలు చేయసాగాడు.

శ్రావస్తిలో ఒకానొక సార్థవాహుడు భార్యతో సహా వ్యాపారానికై మహాసముద్రంపై బయలుదేరాడు. అక్కడ ఆమె కుమారుని ప్రసవించింది. సముద్రంపై పుట్టాడు కనుక వానికి సముద్రుడు అని పేరుపెట్టారు. పన్నెండు సంవత్సరాలు సముద్రవ్యాపారం చేసి తిరిగివస్తూండగా అయిదువందల దొంగలముఠా ఆయనను దోచుకొని చంపివేసింది. ఆయన కొడుకు సముద్రుడు భగవానుని శాసనంలో ప్రవ్రజించాడు. అతడు జనపదంలో చారిక చేస్తూ (పర్యటిస్తూ) పాటలీపుత్రాన్ని చేరుకున్నాడు.

అప్పుడు పూర్వాహ్నసమయంలో అతడు పాత్ర, చీవరాలను తీసుకొని, బయట రమణీయంగా ఉన్న ఆ భవనంలో తెలియక ప్రవేశించాడు. కాని లోపల నరకంలా ఉండటం చూసి బయటకు పోవాలనుకున్నపుడు చండగిరికుడు చూసి, అతన్ని పట్టుకొని "నీకు చావు మూడింది. నీ పని అయిపోయింది" అన్నాడు.

భిక్షువు దుఃఖంతో ఏడ్చాడు. గిరికుడు "చిన్నపిల్లవానిలా ఎందుకు ఏడుస్తున్నావు?" అన్నాడు. అప్పుడు భిక్షువు –

"ఓ భద్రా!
ఈ దేహం నశిస్తుందని నేను
ఏడ్వటం లేదు.
మోక్షధర్మానికి అంతరాయం కలుగుతుందని
ఏడుస్తున్నాను.
దుర్లభమైన నరజన్మను ఎత్తి, సుఖదమైన ప్రవ్రజ్యను తీసుకొని,
శాక్యసింహుని గురువుగా పొంది,
ఇప్పుడు వాటన్నిటినీ కోల్పోతున్నానే! అని ఏడుస్తున్నాను" అన్నాడు.

చండగిరికుడు "లోపలికి వచ్చినవారినందరినీ చంపటానికి రాజు నాకు అనుమతినిచ్చాడు. ఇక్కడనుండి బయటపడే అవకాశం లేదు కనుక ధైర్యం వహించు" అన్నాడు. "దయచూపు! ఒక నెల గడువు ఇవ్వు" అన్నాడు భిక్షువు. గిరికుడు ఏడు రాత్రుల సమయం ఇచ్చాడు.

'ఏడు రాత్రుల తర్వాత నేను ఉండను' అని అతడు మరణభయోద్విగ్న హృదయంతో మోక్షానికై ప్రయత్నం చేయసాగాడు.

ఏడవనాడు రాజు అశోకుని అంతఃపురంలో ఒక స్త్రీ ఒక యువకుని అనురక్తితో చూస్తూ, మాట్లాడుతూ కనిపించింది. రాజు కోపంతో వారిద్దరినీ వధ్యశాలకు పంపించాడు. అక్కడ వారు ఇనుపరోలులో రోకండ్లతో దంచబడినారు. వారి ఎముకలు మాత్రమే మిగిలాయి. దానిని చూసి భిక్షువు ఉద్విగ్నుడై ఇలా అనుకున్నాడు –

"కారుణికుడైన మహాముని, శాస్త్ర<br>
చక్కగా చెప్పాడు.<br>
నురుగుముద్ద వంటి ఈ రూపం,<br>
అసారం, అనిత్యం.<br>
ఏదీ ఆ వదనకాంతి? ఏదీ ఆ దేహశోభ?<br>
ఎక్కడికి పోయింది?<br>
మూఢులు రమించే ఈ అన్యాయ సంసారానికి ధిక్కారం.<br>
వధ్యశాలలో ఈ ఆలంబనం దొరికింది. దీనిని ఆశ్రయించి<br>
నేడు భవసాగరాన్ని దాటిపోతాను."<br>
అనుకొని ఆ రాత్రంతా అతడు బుద్ధశాసనంలో మనుస్సును నిలిపి,<br>
అన్ని బంధనాలనూ త్రెంచి అర్హంతుడైనాడు.

ఆ రాత్రి గడిచిన తర్వాత చండగిరికుడు ఆ భిక్షువుతో "భిక్షూ! రాత్రి గడిచింది. నీకు మృత్యుకారణమైన సూర్యుడు ఉదయించాడు" అన్నాడు. భిక్షువు "నా రాత్రి గడిచిపోయింది. ఉత్తమానుగ్రహంతో సూర్యుడు ఉదయించాడు. ఓ దీర్ఘాయూ! నీవు చేయాలనుకున్నది చేయి!" అన్నాడు. చండగిరికుడు "నీ మాటలను నేను అర్థం చేసుకోలేకపోతున్నాను, వివరించి చెప్పు" అన్నాడు.

"పంచనీవరణాలచే ఆవరింపబడి, క్లేశతస్కరులచే సేవించబడిన

నా హృదయంలోని ఘోర మోహరాత్రి గడిచిపోయింది.
నా మానసాకాశంలో జ్ఞానసూర్యుడు ఉదయించాడు.
శాస్త ఉపదేశాన్ని అనుసరించిన నేను
ఆ వెలుగులో మూడు లోకాలను స్పష్టంగా
చూడగలుగుతున్నాను. ఇది పరమ అనుగ్రహకాలం.
ఓ దీర్ఘాయూ! నీవు చేయాలనుకున్నది చేయి!" అన్నాడు భిక్షువు.

అప్పుడు ఆ జాలిలేని దారుణహృదయుడు, పరలోక నిరపేక్షి కోపంతో నీరు, మానవరక్తం, క్రొవ్వు, మలమూత్రాలతో నిండిన పెద్ద లోహపాత్రలో సముద్రుని పడవేసి, క్రింద పొయ్యిలో చాలా కట్టెలు వేసి అంటించాడు. ఎన్ని కట్టెలు కాలినా అది వేడి కాలేదు. మళ్లీ అంటించాలని చూశాడు. అంటుకోలేదు. అప్పుడు 'ఏమైంద'ని లోహపాత్రలోనికి చూశాడు. ఆ భిక్షువు తామర పూవుపై కూర్చుని ఉండటం కనిపించింది. ఆ విషయాన్ని అతడు రాజుకు నివేదించాడు. రాజు వచ్చాడు. వేలాది ప్రజలు గుమిగూడారు.

ఆ భిక్షువు అశోకుడు మార్పుచెందే సమయం వచ్చిందని గ్రహించి,
లోహపాత్రలోనుంచి తడిసిన శరీరంతో
ఎగిరాడు ఆకాశంలోకి ఋద్ధిశక్తితో హంసలా.
శరీరంలోని సగభాగం నుండి నీటిని కురిపిస్తూ,
మరి సగభాగం నుండి మంటలను ప్రజ్వలింపజేస్తూ,
నీటితో, జ్వాలలతో, ఓషధుల పర్వతంలా
వెలిగిపోతూ అనేక విచిత్ర ప్రాతిహార్యాలను (అద్భుతాలను) చూపసాగాడు.

అతడు ఆకాశానికి ఎగరటం చూసిన రాజు అంజలిబద్ధుడై పులకిత శరీరంతో–

"సౌమ్యా! చూడటానికి మీరు మనిషిలా ఉన్నా
మీ ఇద్ధిశక్తులు మానవాతీతంగా ఉన్నాయి.
ఓ ధీరా! మీరెవరు? మీ పేరేమి? శుద్ధస్వభావా!
మిమ్ములను ఏమని పిలవాలి? నేను మీ శిష్యుడను.
మీ ప్రభావాన్ని తెలుసుకోనివ్వండి" అన్నాడు.

'ఈతడు ధర్మాన్ని గ్రహించి, మహాజనుల మేలుకోసం భగవద్ధాతువులను విస్తరింపజేస్తాడు' అని తెలుసుకొని ఆ భిక్షువు అతనికి తన గుణాలను వివరిస్తూ –

"రాజా!
సర్వాస్రవబంధనాలు క్షీణించిన,
మహాకారుణికుడైన
బుద్ధుని పుత్రుడను.
సాంసారిక విషయాలలో అనాసక్తుడనై,
ధర్మాన్ని అనుసరించినవాడను.
తన్ను నిగ్రహించుకున్నవానిచే
నిగ్రహింపబడినవాడను.
ప్రశాంతుడైన వానిచే శాంతిని పొందినవాడను.
ఆ మానవోత్తమునిచే, సంసారమహాభయం నుండి ముక్తుడైనవానిచే
జన్మబంధనాలనుండి విడిపింపబడినవాడను" అన్నాడు.

మహారాజా! మీ గురించి భగవానుడు – "నా పరినిర్వాణానికి నూరేండ్ల తర్వాత పాటలీపుత్రంలో అశోకుడనే రాజు పుడతాడు. అతడు చతుర్భాగచక్రవర్తియై, ధర్మరాజై నా శరీరధాతువులను విస్తరింపజేస్తాడు. ఎనుబదినాలుగువేల ధర్మరాజికలను (స్తూపాలను) నిర్మింపజేస్తాడు" అని చెప్పాడు. "దేవా! నరకసదృశమైన ఈ భవనాన్ని నిర్మించి వేలాది ప్రాణులను చంపించారు. ఇక సమస్త ప్రాణులకు అభయమిచ్చి భగవానుని కోరికను పూర్తిచేయండి"

"ఓ నరేంద్రా! కరుణామయుడవై
అన్ని ప్రాణులకు అభయం ఇవ్వు!
ధర్మధరాలను (స్తూపాలను) విస్తరింపజేసి,
బుద్ధుని మనోరథాన్ని
పూర్తిచేయి! అన్నాడు."

అప్పుడు రాజు బుద్ధునిపట్ల ప్రసన్నతను పొంది, చేతులు జోడించి భిక్షువును క్షమాయాచన చేస్తూ –

"ఓ దశబలసుతా! మీపట్ల నేను చేసిన ఈ
అపరాధాన్ని మన్నించండి.
మిమ్ములను, బుద్ధుని, ఆర్యగణశ్రేష్ఠుడైన
ఆ బుద్ధునిచే ప్రవచింపబడిన ధర్మాన్ని
శరణుపొందుతున్నాను.
అతనిపట్ల శ్రద్ధతో, గౌరవంతో నేను
శంఖంలా, చంద్రునిలా, హంసలా
స్వచ్ఛధవళమైన చైత్యాలను నిర్మించి అందులో
జినధాతువులను ప్రతిష్ఠిస్తాను" అన్నాడు.

ఆ భిక్షువు ఇద్ధిశక్తితో అక్కడే అదృశ్యమైనాడు. రాజు బయటకు పోతూండగా చండగిరికుడు చేతులు జోడించి "దేవా! ఇక్కడ ప్రవేశించినవారు బయటకు పోగూడదని మీరు నాకు వరమిచ్చారు" అన్నాడు.

"నేను కూడా పోగూడదా? నన్ను కూడా చంపాలనుకుంటున్నావా?"

"అవును"

"సరే! కాని నువ్వా! నేనా? ఇందులో ఎవరు ముందు ప్రవేశించారో చెప్పు!"

"నేనే"

అప్పుడు రాజు "ఎవరక్కడ?" అన్నాడు.

భటులు ముందుకు వచ్చి వానిని పట్టుకొని యంత్రగృహంలో పడవేసి, కాల్చివేశారు. తర్వాత రాజు ఆ రమణీయక బంధనగృహాన్ని కూల్చివేయించి, సకలప్రాణులకు అభయప్రదానం చేశాడు.

ఆ తర్వాత రాజు 'భగవానుని శారీరకధాతువులను విస్తరింపజేస్తాను' అని చతురంగబలాలతో బయలుదేరాడు. మొదట అజాతశత్రురాజుచే ప్రతిష్ఠింపబడిన ద్రోణస్తూపాన్ని తెరిచి, అందులోని శరీరధాతువులను తీసుకొని, వానిలోని ఒక్కొక్క భాగం మీద స్తూపాన్ని నిర్మించాడు. అలాగే రెండవస్తూపాన్ని విస్తరించాడు. భక్తితో ఏడు ద్రోణస్తూపాలనుండి ధాతువులను తీసుకొని రామగ్రామం వెళ్లాడు.

అక్కడ నాగులు అతన్ని నాగలోకానికి తీసుకుపోయి, 'మేము ఈ శరీరధాతువులను పూజిస్తాము' అని విజ్ఞప్తి చేశారు. రాజు అందుకు అంగీకరించాడు.

నాగులు అతన్ని నాగలోకం నుండి పైకి తెచ్చారు. ఇలా అంటారు –

"నాడు నాగులు రక్షించటం వల్లనే
నేడు ఆ ఎనిమిదవస్తూపం నిలబడి ఉంది.
అక్కడి ధాతువులను తీసుకోకుండానే
రాజు నిష్క్రమించాడు."

అప్పుడు రాజు 84 వేల బంగారు, వెండి, స్ఫటిక, వైడూర్యమయమైన ధాతుపేటికలను తయారుచేయించి, వాటిలో ధాతువులను ఉంచాడు. అలాగే ఎనుబదినాలుగువేల కుండలను, పట్టికలను తయారు చేయించి వాటిని యక్షులకు ఇచ్చి సముద్రపర్యంతం వరకు కనీసం కోటిజనాభా గల పెద్ద, మధ్యమ, చిన్న పట్టణాలలో ప్రతిష్ఠింపజేశాడు.

అప్పుడు తక్షశిలలో ముప్పదిఆరుకోట్ల జనం ఉండేవారు. వారు తమకు ముప్పదిఆరు పేటికలు కావాలన్నారు. 'అలా అయితే విస్తరింపజేయటానికి ధాతువులుండవు' అని రాజు చింతించాడు. అతడు ఉపాయశాలి కనుక 'ముప్పదిఅయిదుకోట్ల మందిని చంపి, మిగిలిన కోటిమందికి ఒక పేటికను ఇస్తాను' అన్నాడు. వారు 'ఒక పేటికే చాల'న్నారు. అప్పుడు రాజు 'కోటిమందికన్నా ఎక్కువ ఉన్న నగరాలకు కూడా ఒక పేటికే ఇవ్వబడుతుందని, తక్కువ ఉన్న నగరాలకు అసలు ఇవ్వబడద'ని ప్రకటించాడు.

అప్పుడు రాజు కుక్కుటారామానికి పోయి యశస్థవిరుని కలిసి – "ఒకే నాడు, ఒకే ముహూర్తంలో ఎనుబదినాలుగువేల ధర్మరాజికలను ప్రతిష్ఠింపజేయాలని నా కోరిక" అన్నాడు. యశస్థవిరుడు "అలాగే జరుగుతుంది. ఆ సమయంలో నేను నా అరచేతితో సూర్యమండలాన్ని కప్పివేస్తాను." అన్నాడు.

ఆనాడు యశస్థవిరుడు తన అరచేతితో సూర్యమండలాన్ని కప్పివేశాడు. ఒకేనాడు, ఒకే ముహూర్తంలో ఎనుబదినాలుగువేల ధర్మరాజికలు ప్రతిష్ఠింపబడినాయి. ఇలా చెప్పబడింది –

"పూర్వులచే నిర్మింపబడిన ఏడు
స్తూపాలనుండి మౌర్యుడు
ధాతువులను తీసుకొని
శరత్కాలమేఘం వంటి ఎనుబదినాలుగువేల
స్తూపాలలో నిక్షిప్తం చేశాడు."

అశోకరాజు ఇలా ఎనుబదినాలుగువేల ధర్మరాజికలను ప్రతిష్ఠింపజేసి, 'ధార్మికుడు', 'ధర్మరాజు', 'ధర్మాశోకుడు' అని పేరుపొందాడు. ఇలా చెప్పబడింది –

"ఆర్యమౌర్యశ్రీ ప్రజలహితం కోసం
స్తూపాలను నిర్మించి, తన కర్మలవలన
కౄరత్వంనుండి ధర్మత్వానికి మార్పుచెంది
ధర్మాశోకుడుగా పిలువబడినాడు."

ఇది మట్టిని దానం చేసిన కథ

# వీతశోకావదానం

(వీతశోకుని కథ)

రాజు అశోకుడు భగవానుని శాసనంలో శ్రద్ధ కలిగినవాడై ఎనుబదినాలుగువేల ధర్మరాజికలను (స్తూపాలను) నిర్మించాడు. పంచవార్షికాలు చేశాడు. మూడు లక్షల భిక్షువులకు భోజనం ఇచ్చాడు. వారిలో ఒకలక్షమంది అర్హతులు. రెండు లక్షలమంది శిక్షణ పొందుతున్న కల్యాణకరులైన పృథగ్జనులు. సముద్రపర్యంతంగల జనసమూహమంతా భగవానుని శాసనంలో ప్రసన్నులై ఉన్నారు.

అతని తమ్ముడు వీతశోకుడు తైర్థికులందు శ్రద్ధగలవాడు. వారు వీతశోకునితో "శాక్యపుత్రశ్రమణులకు మోక్షం లేదు. వారు కష్టపడి సాధన చేయరు. సుఖాలలో ఆనందిస్తూ ఉంటారు" అని చెప్పి బుద్ధశాసనం పట్ల అతని మనస్సును విరిచివేశారు.

రాజు అశోకుడు "వీతశోకా! నీవు ఆ హీనాయతనాలలో శ్రద్ధను కలిగి ఉండకూడదు. బుద్ధధర్మసంఘాలపట్ల శ్రద్ధను కలిగి ఉండాలి" అనేవాడు.

ఒకసమయంలో రాజు అశోకుడు వేటకు వెళ్లాడు. ఆయనతోపాటు వెళ్లిన వీతశోకునికి అరణ్యంలో ఒక ఋషి కనిపించాడు. అతడు తపస్సుల గురించి తెలిసినవాడు. పంచాగ్నిమధ్యంలో తపస్సు చేస్తున్నాడు. అతని వద్దకు పోయి పాదాలకు వందనం చేసి ఆ ఋషిని "భగవాన్! మీరు ఎన్నిసంవత్సరాలనుండి ఈ అరణ్యంలో ఉంటున్నారు?" అని అడిగాడు.

"పన్నెండు సంవత్సరాలనుండి"

"ఏం ఆహారం తీసుకుంటున్నారు?

"దుంపలు, పండ్లు"

"ఏం కప్పుకుంటున్నారు?"

"దర్భచీవరాలు"

"దేనిపై పడుకుంటున్నారు?"

"గడ్డి శయ్యపై"

"భగవాన్! మీకెప్పుడైనా బాధ కలుగుతుందా?"

"ఋతుకాలంలో ఈ మృగాలు జతకడతాయి. ఆ సమయంలో వాటిని చూసినపుడు రాగంతో దహించుకుపోతాను."

వీతశోకుడు "ఇంత కష్టపడి తపస్సుచేసే ఋషి రాగంతో బాధపడుతున్నాడు. చక్కని శయనాసనాలలో సుఖంగా ఉండే శాక్యపుత్రీయ శ్రమణులకు రాగం ఎలా పోతుంది?" అనుకున్నాడు.

అతడు ఇలా అన్నాడు–

"ఈ ఋషి ఒంటరిగా అడవిలో ఉంటూ
గాలి, నీరు, దుంపలను మాత్రమే తీసుకుంటూ,
చిరకాలం ప్రయత్నించి కూడా
రాగాన్ని గెలువలేకపోయాడు.
నేయి, పెరుగు, మాంసాలతో కమ్మని భోజనాలు చేసే
శాక్యులు ఇంద్రియనిగ్రహాన్ని కలిగి ఉండటమంటే
వింధ్యపర్వతం సముద్రంలో తేలియాడినట్లే.
ఆ శాక్యపుత్రీయశ్రమణులను అనుసరించి
రాజు అన్నివిధాలా మోసపోయాడు."

ఆ మాటలను విని రాజు ఉపాయాలు తెలిసిన మంత్రితో "ఈ వీతశోకుడు తైర్థికులందు శ్రద్ధగలవాడు. ఉపాయంతో అతనికి భగవానుని శాసనంలో శ్రద్ధను కలిగించాలి" అన్నాడు.

"దేవా! ఏమి ఆజ్ఞ?" అన్నాడు అమాత్యుడు.

"నేను రాజాలంకారాలను, కిరీటాన్ని తీసి, స్నానశాలకు పోయినపుడు మీరు ఉపాయంతో వీతశోకునికి ఆ కిరీటాన్ని ధరింపజేసి సింహాసనంపై కూర్చుండబెట్టాలి."

"అలాగే" అన్నాడు మంత్రి.

రాజు రాజాలంకారాలను, కిరీటాన్ని తీసి, స్నానశాలలో ప్రవేశించగానే, మంత్రి వీతశోకునితో "రాజు అశోకుని తర్వాత మీరే రాజవుతారు. ఈ రాజాలంకారాలను, కిరీటాన్ని ధరింపజేసి మిమ్ములను సింహాసనంలో కూర్చోబెడతాను. అవి మీకు ఎలా ఉంటాయో చూడాలి" అన్నాడు.

అతడు ఆ వీతశోకునికి ఆభరణాలను, కిరీటాన్ని ధరింపజేసి సింహాసనంలో కూర్చోబెట్టి రాజుకు తెలియజేశాడు.

అప్పుడు రాజు అశోకుడు రాజాభరణాలను, కిరీటాన్ని ధరించి సింహాసనంలో కూర్చున్న వీతశోకుని చూచి "నేను బ్రతికియుండగానే నీవు రాజువైనావా?" అని, "ఎవరక్కడ?" అన్నాడు.

అప్పుడు నల్లని వస్త్రాలను ధరించిన, వెంట్రుకలను విరబోసుకున్న తలారులు ఘంటాశబ్దాలను చేస్తూ వచ్చి, రాజు పాదాలపై పడి "దేవా! ఏమి ఆజ్ఞ" అన్నారు.

రాజు "నేను వీతశోకుని వదిలివేశాను" అన్నాడు.

అప్పుడు వీతశోకుడు "శస్త్రధారులైన తలారులు నన్ను చుట్టుముట్టి ఉన్నారు" అన్నాడు. అప్పుడు మంత్రి రాజు పాదాలపైపడి "దేవా! వీతశోకుని క్షమించండి. అతడు మీ తమ్ముడు" అన్నాడు.

రాజు "వారం రోజులవరకు క్షమిస్తున్నాను. ఇతడు నా తమ్ముడు కనుక తమ్మునిమీది ప్రేమతో వారం రోజులు సింహాసనాన్ని ఇస్తున్నాను" అన్నాడు.

వందలకొలది మంగళవాద్యాలు మ్రోగింపబడ్డాయి. జయ, జయకారాలు చేయబడినాయి. వందలవేల ప్రాణులు చేతులు జోడించి నిలబడ్డారు. వందలస్త్రీలు అతన్ని ఆవరించుకొని ఉన్నారు.

తలారులు ద్వారంలో నిలబడి ఉన్నారు. ఒకదినం గడువగానే వీతశోకుని ముందుకుపోయి "వీతశోకా! ఒకదినం గడిచిపోయింది. ఇంక ఆరుదినాలే ఉన్నాయి" అన్నారు. రెండవదినం కూడా అలాగే అన్నారు. అలా ఆరుదినాలు గడిచిన తర్వాత ఏడవనాడు వీతశోకుని రాజాలంకారాలతో అలంకరించి, రాజువద్దకు తీసుకొనిపోయారు.

రాజు అశోకుడు “వీతశోకా! చక్కని గీతాలు, చక్కని నృత్యాలు, చక్కని సంగీతాలు ఎలా ఉన్నాయి?” అన్నాడు.

వీతశోకుడు “నేను వాటిని చూడలేదు, వినలేదు.

గీత, నృత్యాలను చూసినవారు, రసాన్ని ఆస్వాదించినవారు

వారు మీకు వాటి గురించి చెపుతారు” అన్నాడు.

రాజు “వీతశోకా! నా ఈ రాజ్యం నీకు వారంరోజులపాటు ఇవ్వబడింది. వందలవాద్యాలు ప్రయోగింపబడినాయి. జయశబ్దాలు చేయబడినాయి. వందలచేతులు జోడింపబడినాయి. వందలస్త్రీలు సేవించారు. అయినా ‘నేను వాటిని చూడలేదు, వినలేద’ని ఎలా అంటున్నావు?” అన్నాడు. వీతశోకుడు

“నేను నృత్యాన్ని చూడలేదు, గీతశబ్దాలను వినలేదు.
సుగంధాలను ఆఘ్రాణించలేదు. చక్కని రుచులను ఆస్వాదించలేదు.
మరణచింతతో ఆవరింపబడిన నేను నారీజన
కనకమణిహారాంగ జనిత శబ్దాలను వినలేదు. వారిని స్పర్శించలేదు.
ఉత్తమమైన శయ్యపై పరుండి, ద్వారంలో నీలివస్త్రధారులైన
తలారులను చూస్తున్న నాకు
నృత్య, గీత, శయనాది విధులతో
సేవించే వయోరూపవతులైన స్త్రీలు
వివిధరత్నాలతో కూడి లక్ష్మీకరమైన వసుధ,
నిరానందంగా, శూన్యంగా కనిపించాయి.
నీలాంబరధారులు చేస్తున్న
ఆ ఘోరఘంటారవాన్ని విని,
ఓ రాజేంద్రా! నాకు దారుణమైన
మరణభయం కలిగింది.
మృత్యువనే బాణం గురిపెట్టబడిన
నేను ఉత్తమగీతాలను వినలేదు.
నృత్యాలను చూడలేదు. మనసారా భుజించలేదు.

మృత్యుజ్వరంతో పట్టుబడిన నేను
కలలో కూడా వాటిని చూడలేదు.
మృత్యువును చింతిస్తూనే రాత్రులను గడిపాను."

రాజు "వీతశోకా! ఒక జన్మలోని మరణభయమే నీకు రాజ్యం లభించినా సుఖాన్ని ఇవ్వలేకపోయింది గదా! మరి భిక్షువులు వందలకొలది జన్మల మరణ భయాలను, ఆయా జన్మలలోని దుఃఖాలను చూనస్తూ, ఏ విధంగా సుఖంగా ఉండగలరు! నరకంలో శరీరమంతా అగ్నిలో కాలిపోయే దుఃఖం, జంతుజన్మలో ఒకటి ఇంకొకదానితో తినబడే దుఃఖం, ప్రేతజన్మలో ఆకలి దప్పుల దుఃఖం, మానవజన్మలో కోరికలకోసం తాపత్రయపడే దుఃఖం, 'పుణ్యం క్షయించి ఈ దేవలోకం నుండి ఎప్పుడు పడిపోతామో' అని దేవతలదుఃఖం. మూడు లోకాలు ఈ అయిదు దుఃఖాలతో ఆవరింపబడి ఉన్నాయి. అందువలన భిక్షువులు స్కంధాలను (=రూపం, వేదన, సంజ్ఞ, సంస్కారం, విజ్ఞానం ఈ అయిదు స్కంధాలు) శారీరక, మానసికదుఃఖాలను కలిగించే తలారులుగా చూస్తారు. ఆరు ఆయతనాలను పాడుబడిన ఊరులా చూస్తారు. విషయాలను దొంగలుగా చూస్తారు. మూడులోకాలనూ అనిత్యాగ్నిలో కాలిపోతున్నట్లుగా చూస్తారు. అవి వారికి రాగాన్ని ఎలా కలిగిస్తాయి?" ఇంకా

"ఒక జన్మ మరణభయమే సతతం నిన్ను ఉడికిస్తూండగా
నీ మనస్సు మనోజ్ఞమైన విషయాలలో
నిలువలేకపోయింది.
ఇక రానున్న వందలజన్మల మరణభయాలను
స్మరిస్తూన్న భిక్షువులకు భోజనాదులమీద మనస్సు
ఎలా మగ్నమౌతుంది?
వారు మోక్షంలో మనస్సును నిలిపి, వస్త్ర, శయన, ఆసన,
భోజనాదులలో అసంగంతో ఉంటారు. వారు శరీరాన్ని తలారిలాగా,
జీవితాన్ని కాలిపోతున్న ఇల్లులాగా చూస్తారు.
జన్మనుండి వెనుదిరిగి మోక్షాన్ని గమ్యంగా చేసుకున్నవారు
విముక్తిని పొందకుండా ఎలా ఉండగలరు?
తామరాకు నీటిని అంటనట్లుగా

వారి మనస్సులు విషయసుఖాలను అంటవు” అన్నాడు.

రాజు ఇలా చెప్పగా వీతశోకునికి భగవంతుని శాసనం మీద శ్రద్ధ కలిగింది. అతడు చేతులు జోడించి ఇలా అన్నాడు “దేవా! నేను ఇప్పటినుండి తథాగతుడు, అర్హతుడు, సమ్యక్సంబుద్ధుడు అయిన భగవానుని శరణు పొందుతున్నాను. ధర్మాన్ని, భిక్షుసంఘాన్ని కూడా.”

“మునులచే, జ్ఞానులచే, సామాన్యులచే పూజింపబడే
వికసిత నవకమల విమలదళనేత్రుడైన బుద్ధుని,
జినుని, విరాగియైన సంఘాన్ని
శరణు పొందుతున్నాను.”

అప్పుడు రాజు అశోకుడు వీతశోకుని కంఠాన్ని కౌగలించుకొని “నేను నిన్ను వదలిపెట్టలేదు. బుద్ధశాసనం పట్ల నీకు శ్రద్ధను కలిగించటానికి ఈ ఉపాయం ఆలోచించవలసి వచ్చింది” అన్నాడు.

అప్పుడు వీతశోకుడు గంధమాల్యాదులతో వాద్యాలతో భగవానుని చైత్యాలను పూజిస్తూ, సద్ధర్మాన్ని విన్నాడు. సంఘాన్ని సేవించాడు.

కుక్కుటారామంలో అర్హతుడు, షడభిజ్ఞుడూ[7] అయిన యశస్థవిరుడు ఉండేవాడు. ఒకనాడు వీతశోకుడు ధర్మాన్ని వినటానికి కుక్కుటారామానికి పోయి, అతని ముందు కూర్చున్నాడు. వీతశోకుని పరిశీలించిన స్థవిరుడు అతనికి ‘ఇదే అంతిమజన్మ అని, ఈ జన్మలోనే అతడు అర్హత్వాన్ని పొందుతాడ’ని గుర్తించి, అతనితో పరివ్రాజకజీవితాన్ని పొగడుతూ మాట్లాడాడు. వీతశోకుడు అది విని భగవానుని శాసనంలో ప్రవ్రజ్యను పొందాలనుకుని, లేచి దోసిలిపట్టుకొని స్థవిరునితో “నాకు ఈ స్వాఖ్యాత ధర్మవినయంలో

i. అనేక రూపాలను ధరించటం వంటి ఇద్ధిశక్తులు.
ii. దివ్యశ్రోత్రం
iii. పరచిత్తజ్ఞానం
iv. దివ్యచక్షువు
v. పూర్వజన్మలజ్ఞానం
vi. ఆస్రవాలు నశించటం. ఇవి ఆరు అభిజ్ఞలు.

ఉపసంపద, ప్రవ్రజ్య లభించుగాక! మీవద్ద భిక్షుభావంతో చరిస్తూ, బ్రహ్మచర్యాన్ని పాలింతును గాక!” అన్నాడు.

స్థవిరుడు “వత్సా! రాజు అశోకుని అనుమతిని సంపాదించు” అన్నాడు.

అప్పుడు వీతశోకుడు రాజు అశోకుని వద్దకు పోయి దోసిలిపట్టి “దేవా! నేను ఇంటిని వదలి, స్వాఖ్యాతమైన ధర్మవినయంలో శ్రద్ధతో భిక్షువుగా ప్రవ్రజిస్తాను.”

“నేను విభ్రమంతో అదుపుతప్పిన
ఏనుగులా వ్యవహరించాను.
కాని నేడు మీ ప్రభావశాలియైన
బుద్ధోపదేశ అంకుశం వలన
అశాంతిని వదలివేశాను.
ఓ రాజేంద్రా! నేను మిమ్ములను ఒక వరం అడుగుతున్నాను.
లోకాలోకాలలో శ్రేష్ఠమైన శుభశాసన చిహ్నాలను ధరిస్తాను” అన్నాడు.

విని రాజు కన్నులలో నీరు నిండగా వీతశోకుని కంఠాన్ని కౌగలించుకొని “వీతశోకా! అటువంటి ప్రయత్నం మానుకో! ప్రవ్రజ్య తీసుకుంటే దుమ్ములో పారవేయబడిన చినిగిన పేలికలను కుట్టుకొని కట్టుకోవాలి. అది మనిషి అందాన్ని చెడగొడుతుంది. సేవకులు ఇచ్చినవాటిని కప్పుకోవాలి. ఇతరుల ఇండ్లలో ఇవ్వబడిన భిక్షాన్నాన్ని తినాలి. చెట్టుమొదట నివసించాలి. గడ్డి, ఆకుల పడకమీద పడుకోవాలి. వ్యాధులకు మందు సులభంగా దొరకదు. గోమూత్రాన్నే ఔషధంగా తీసుకోవాలి. నీవు సుకుమారుడవు. ఎండ, చలి, ఆకలి, దప్పికలను ఓర్వలేవు. వెళ్లిపోవాలనే ఉద్దేశాన్ని మానుకో!” అన్నాడు.

వీతశోకుడు “దేవా!
విషయతృష్ణ నాకు లేదు. ఆయసాన్నీ పొందను.
ప్రవ్రజ్యను పొందాలనుకొన్న నేను
అంతఃశత్రువులచే బలహీనపడను. సుఖాలకోసం దీనుడను కాను.
ఈ జగుత్తునంతా దుఃఖార్తంగా, వ్యసనాలచే
పట్టువడినదానిగా చూసి, జన్మభీరువునై,

శివం, అభయం అయిన మార్గాన్ని
అనుసరించాలనుకుంటున్నాను" అన్నాడు.

విని రాజు అశోకుడు పెద్దగా ఏడ్వసాగాడు. అప్పుడు వీతశోకుడు రాజును ఓదారుస్తూ "మనం సంసారమనే ఊయల ఊపుతో నియతజనుల మధ్య పడతాము. వియోగం తప్పనిసరియైనచోట చోట విలపించటం ఎందుకు?" అన్నాడు.

రాజు "వీతశోకా! భిక్ష అలవాటయ్యేంతవరకు రాజోద్యానంలో నీకు గడ్డిశయ్య ఏర్పాటు చేయబడుతుంది. అంతఃపురంలో పర్యటిస్తే భోజనం దొరుకుతుంది" అన్నాడు.

రాజు అంతఃపురస్త్రీలతో వీతశోకునికి "ప్రవ్రజితులకు తగిన ఆహారం ఇవ్వండి" అన్నాడు. అప్పుడతనికి వారు పాసిపోయిన మినపపప్పును భిక్షగా ఇవ్వగా ఒకచోట కూర్చుని దానిని తినసాగాడు. అతని పట్టుదలను చూసి రాజు అశోకుడు అతన్ని నివారించి, "ప్రవ్రజ్యకు అనుమతించాను, ప్రవ్రజించిన తర్వాత అప్పుడప్పుడు కనిపించాలి" అన్నాడు. అతడు కుక్కుటారామానికి వెళ్లాడు కాని 'ఇక్కడ ప్రవ్రజిస్తే గుంపుల మధ్య ఉండవలసి ఉంటుంది' అనిపించి విదేహ జనపదంలోకి పోయి ప్రవ్రజించాడు. అక్కడే అర్హత్వాన్ని పొందాడు.

అప్పుడు ఆయుష్మంతుడు వీతశోకుడు అర్హతుడై, విముక్తి వలన కలిగిన ప్రీతిసుఖసంవేదనలను పొంది, "అన్నగారు నన్ను చూడాలనుకుంటున్నారు" అనుకొని పాటలీపుత్రానికి పయనమైనాడు. రాజు అశోకుని ఇంటి తూర్పుద్వారాన్ని చేరుకుని, అక్కడి ద్వారపాలకులతో "వీతశోకుడు మిమ్మలను చూచే కోరికతో ద్వారంవద్ద నిలబడి ఉన్నాడు" అని రాజు అశోకునివద్దకు పోయి చెప్పండి" అన్నాడు.

అప్పుడు ద్వారపాలకులు రాజు అశోకునివద్దకుపోయి "దేవా! మిమ్ములను చూడాలనే కోరికతో వీతశోకుడు ద్వారంవద్ద నిలబడిఉన్నాడు" అన్నారు. రాజు "వెళ్లండి! త్వరగా ప్రవేశపెట్టండి!" అన్నాడు.

వీతశోకుడు లోపల ప్రవేశించటం చూడగానే రాజు అశోకుడు సింహాసనం నుండి లేచి వ్రేళ్లనుండి పడిపోయిన చెట్టులా సర్వశరీరంతో నేలపై సాగిలపడి, ఆయుష్మంతుడు వీతశోకుని చూచి ఏడుస్తూ

"నీవు నన్ను చూచి కూడా
చాలాకాలానికి బంధుజనులను
చూచినవారిలా ప్రవర్తించలేదు.
వివేకవేగంతో శంకలను పారద్రోలి,
ప్రజ్ఞారసంలో తృప్తుడవై ఉన్నావు" అన్నాడు.

అప్పుడు ప్రధానమంత్రి రాధాగుప్తుడు ఆయుష్మంతుడు వీతశోకుని పాంశుకూల చీవరాలను, మట్టిపాత్రను, అందులోని ఎండిన అన్నాన్ని చూచి రాజుముందు సాష్టాంగపడి "దేవా! ఇంతటి అల్పేచ్ఛ, ఇటువంటి సంతుష్టి కలవారు తప్పకుండా కృతకృత్యులై ఉంటారు. కనుక మీరు సంతోషంగా ఉండాలి."

"భిక్షాన్నభోజనం, పాంశుకూలచీవరం,
వృక్షమూలనివాసం కలవాని గురించి,
అతని మనస్సు ఆస్రవరహితమైందనీ,
అతని శరీరం నిరామయమైందనీ,
జీవితంలో అతడు పొందదగినదానిని పొందాడనీ,
లోకులు అతన్ని చూచి నిత్యమూ పండుగ చేసుకుంటారు" అన్నాడు.

విని రాజు ప్రీతికలిగిన మనస్సుతో ఇలా అన్నాడు –

"మౌర్యవంశాన్ని, మగధపురాన్ని, సర్వరత్నసంచయాన్నీ వదలి,
మాన, మద, మోహాలను విడిచిన నిన్ను చూచి,
పురం, ఇల్లూ ధన్యమైనట్లు భావిస్తున్నాయి.
నీవు ఉత్తమమైన దశబలధరుని శాసనాన్ని ప్రతిపాదించు!"

రాజు అశోకుడు తమ్ముని కౌగలించుకొని, అక్కడ పరువబడిన ఆసనంలో కూర్చోబెట్టి, ఉత్తమ ఆహారాన్ని తన చేతులతో వడ్డించాడు. అతడు భుజించి చేతిని కడుగుకొని పాత్రనుండి వెనుకకు తీసుకున్నతర్వాత, ధర్మశ్రవణం కోసం అతని ఎదుట కూర్చున్నాడు.

ఆయుష్మంతుడు వీతశోకుడు రాజు అశోకునికి ధర్మోపదేశం చేస్తూ –

"ఓ రాజా! ఐశ్వర్యంలో అప్రమత్తుడవై ఉండు!
దుర్లభమైన త్రిరత్నాలను నిత్యమూ పూజించు!"

అని చెప్పి తన ధర్మోపదేశంతో అతనికి హర్షాన్ని కలిగించి వెళ్లిపోయాడు. అయిదువందల అమాత్యులు, అనేకవేల పౌరులు తన వెంటరాగా రాజు అశోకుడు వీతశోకుని అనుసరించాడు. ఇలా చెప్పబడింది –

"రాజైన అన్న గౌరవంతో తమ్ముని అనుసరించటం
ప్రవ్రజ్యఫలానికి ప్రత్యక్షనిదర్శనం."

అప్పుడు ఆయుష్మంతుడు వీతశోకుడు తన ఇద్ధిశక్తులవలన అందరూ శ్రద్ధతో చూస్తూండగా ఆకాశంలోకి ఎగిరాడు. వేలప్రాణులు పరివేష్ఠించి ఉండగా రాజు అశోకుడు ఆకాశంలో అనాసక్తదృష్టితో ఉన్న వీతశోకుని గౌరవిస్తూ ఇలా అన్నాడు –

"స్వజనులపట్ల అసంగుడవై,
సంపదల సంకెళ్లలో బంధింపబడిన మమ్ములను వదలి
విహంగంలా ఆకాశంలో ఎగిరిపోయావు.
నీవంటి శాంతుని, ఇచ్ఛాగమనశక్తికలవాని ధ్యానఫలాన్ని
రాగాంధులైనవారు ఎలా చూడగలరు!"

ఇంకా

"నీ బుద్ధిశక్తిముందు మా సంపదల గర్వం
అణగిపోయింది. తెలివిపరులమనుకున్న
మా శిరస్సులు వంగిపోయాయి.
కోరికలపట్ల అంధబుద్ధి కలిగిన మమ్ములను
కృతకృత్యుడవైన నీవు పూర్తిగా కదిలించావు.
ఇప్పుడు మేము నిలబడి ఉన్నాము.
ముక్తుడవైన నీ ముందు
కన్నీటిముఖాలతో."

అప్పుడు ఆయుష్మంతుడు వీతశోకుడు సరిహద్దు ప్రాంతంలోని తన నివాసానికి వెళ్లాడు. అక్కడ అతనికి గొప్పవ్యాధి కలిగింది. దాని గురించి విన్న రాజు అశోకుడు వైద్యులను, సేవకులను పంపించాడు. అతనికి ఆ వ్యాధివలన తలమీది వెంట్రుకలన్నీ రాలిపోయి, వ్యాధి తగ్గిన తర్వాత పెద్దగా పెరిగాయి. అతడు వైద్యులను, సేవకులను వెనుకకు పంపించి, ఆవులమందవద్ద గోరసాలను అడుక్కొని వాటినే ఆహారంగా సేవిస్తూ ఉన్నాడు.

ఆ సమయంలో పుండవర్ధన నగరంలో ఒక నిర్గ్రంథ ఉపాసకుడు, బుద్ధుని విగ్రహం నిర్గ్రంథ జ్ఞాతృపుత్రుని పాదాలను పట్టుకున్నట్లుగా ఒక చిత్రాన్ని వేశాడు. ఉపాసకులు రాజు అశోకునికి ఆ విషయాన్ని తెలిపారు. రాజు "ఎవరక్కడ?" అన్నాడు. పైన యోజనపర్యంతం యక్షులు, క్రింద యోజనపర్యంతం నాగులూ విని వెంటనే అతనికి ముందుకు వచ్చారు. వారిని చూచి రాజు కోపంతో "పుండవర్ధన నగరంలోని ఆజీవకులందరినీ చంపివేయండి" అన్నాడు. ఒక్కదినంలో పద్దెనిమిదివేలమంది ఆజీవకులు చంపబడినారు.

మరల పాటలీపుత్రంలో ఇంకొక నిర్గ్రంథ ఉపాసకుడు బుద్ధుని విగ్రహం నిర్గ్రంథు (జ్ఞాతృపుత్రుని) ని పాదాలమీద పడినట్లుగా చిత్రాన్ని వేశాడు. విన్న రాజు ఆ నిర్గ్రంథ ఉపాసకుని బంధువర్గంతోపాటు ఇంటిలో బంధించి కాల్చివేశాడు. నిర్గ్రంథుని తలను తెచ్చిఇచ్చే ప్రతివానికి దీనారం ఇవ్వబడుతుందని ప్రకటించాడు.

అప్పుడు ఆయుష్మంతుడైన వీతశోకుడు రాత్రినివాసానికై ఒక గొల్లవాని ఇంటికి వెళ్లాడు. వ్యాధివలన అతని చీవరాలు మురికిగా ఉన్నాయి. గోళ్లు, వెంట్రుకలు, గడ్డం బాగా పెరిగాయి. అతన్ని చూచి గొల్లవనిత 'నిర్గ్రంథుడు రాత్రి నివాసానికి మా ఇంటికి వచ్చాడు' అనుకొన్నది. ఆమె భర్తతో "ఆర్యపుత్రా! ఈ నిర్గ్రంథుని చంపి, అతని తలను రాజు అశోకునికి చూపిస్తే మనకు ఒక దీనారం దొరుకుతుంది" అన్నది.

అప్పుడు ఆ గొల్లవాడు ఒరనుండి ఖడ్గాన్ని తీసి ఆయుష్మంతుడు వీతశోకునివద్దకు పోయాడు. ఆయుష్మంతుడు వీతశోకునికి పూర్వజన్మజ్ఞానం ఉన్నది. తాను చేసిన కర్మఫలం ఎదురుగా నిలబడి ఉందని గుర్తించాడు. అతడు కర్మనే శరణుపొందినవాడై నిశ్చలంగా

ఉన్నాడు. ఆ గొల్లవాడు అతని శిరస్సును నరికి రాజు అశోకుని వద్దకు తీసుకొనిపోయి దీనారాన్ని అడిగాడు. బాగా వెంట్రుకలు పెరిగి ఉన్న ఆ తల వీతశోకుని తలలా అనిపించింది కాని స్పష్టంగా గుర్తించలేకపోయాడు. అతనికి సేవచేసిన వైద్యులను, సేవకులను పిలిపించి "ఇది ఎవరి తల?" అన్నాడు. వారు "దేవా! ఇది వీతశోకుని తల" అన్నారు. విన్నవెంటనే రాజు మూర్ఛితుడై నేలమీద పడిపోయి, చన్నీరు చల్లినతర్వాత తేరుకున్నాడు. అమాత్యులు "దేవా! రాగాన్ని వదలినవారి మరణం కూడా ఇంతటి దుఃఖాన్ని కలిగించింది కదా! సర్వప్రాణులకు అభయాన్ని ఇవ్వండి" అన్నారు.

ఇకనుండి ఎవరినీ చంపగూడదని రాజు అందరికీ అభయాన్ని ప్రకటించాడు.

అప్పుడు భిక్షువులకు ఒక సంశయం కలిగింది. అన్ని సంశయాలను ఛేదించే ఆయుష్మంతుడు ఉపగుప్తుని "ఏ కర్మఫలంగా ఆయుష్మంతుడు వీతశోకుడు ఖడ్గంతో చంపబడినాడు?" అని అడిగారు. స్థవిరుడు "ఆ ఆయుష్మంతుడు పూర్వజన్మలో చేసిన కర్మలను వినండి" అంటూ చెప్పసాగాడు.

"భిక్షువులారా! పూర్వం అడవిలోని నీటిచెలిమవద్ద ఒకానొక వేటగాడు మృగాలను వేటాడి జీవించేవాడు. అతడు ఆ నీటిచెలిమవద్ద వలను పన్ని, యంత్రాలను పెట్టి మృగాలను చంపేవాడు."

బుద్ధుడు పుట్టకముందు ప్రత్యేకబుద్ధులు లోకంలో జన్మించేవారు. అప్పుడు ఒకానొక ప్రత్యేకబుద్ధుడు ఆ నీటిచెలిమవద్ద ఆహారాన్ని తిని, చెలిమనుండి బయటకు వచ్చి చెట్టుమొదట కూర్చున్నాడు. అతని వాసనవలన మృగాలు ఆ చెలిమవద్దకు రాలేదు. వేటగాడు మృగాలు నీటివద్దకు రాలేదని చూసి, అడుగులను అనుసరించి పోయి ఆ ప్రత్యేబుద్ధుని వద్దకు చేరుకున్నాడు. ప్రత్యేకబుద్ధుని చూసి "ఇతని వల్లనే మృగాలు ఇక్కడికి రాలేదు" అని ఒరనుండి ఖడ్గాన్ని తీసి, ఆ ప్రత్యేకబుద్ధుని చంపివేశాడు.

"భిక్షువులారా! ఆ వేటగాడే ఈ వీతశోకుడు. మృగాలను చంపిన కర్మఫలితంగానే అతడు గొప్పవ్యాధిని పొందాడు. ఆ ప్రత్యేకబుద్ధుని చంపిన కర్మఫలితంగా అనేకవేల సంవత్సరాలు నరకంలో దుఃఖాన్ని అనుభవించాడు. అయిదువందలసార్లు మానవజన్మ ఎత్తి ప్రతిసారీ ఖడ్గంతో చంపబడ్డాడు" అన్నాడు.

"ఏ కర్మఫలంగా అతడు ఉన్నతవంశంలో జన్మించాడు? అర్హత్వాన్ని పొందాడు?" అని భిక్షువులు అడుగగా స్థవిరుడు "పూర్వం కశ్యపసంబుద్ధుని కాలంలో ఈ వీతశోకుడు పదానరుచి అనేవాడుగా జన్మించి, భిక్షువులలో ప్రవ్రజించాడు. అతడు సంఘానికి ఆహారాన్ని, యవాగును ఇచ్చేట్టుగా దానపతులను ప్రోత్సహించాడు. స్తూపాలపై గొడుగులను ప్రతిష్ఠింపజేశాడు. ధ్వజ, పతాక, గంధ, మాల్య, పుష్ప, వాదిత్రసముదాయాలచే పూజలు జరిపించాడు. ఆ కర్మఫలంగా ఉన్నతవంశంలో జన్మించాడు. పదివేల ఏండ్లు బ్రహ్మచర్యాన్ని పాటించి, సమ్యక్ప్రణిధానం చేసి, అర్హత్వాన్ని పొందాడు" అన్నాడు.

ఇది దివ్యావదానంలో వీతశోకావదానం.

# అమాత్యుడు యశుడు

ఈ విధంగా రాజు బుద్ధశాసనంలో ప్రసన్నతను కలిగి, ఏకాంతంలోగాని, జనంలోగాని ఎక్కడ భిక్షువు కనిపించినా వారి పాదాలపైబడి శిరస్సాష్టాంగవందనం చేసేవాడు.

అతని అమాత్యుడు యశుడు భగవానునిపట్ల పరమశ్రద్ధ కలవాడైనప్పటికీ రాజుతో "దేవా! అన్ని వర్ణాల ప్రవ్రజితులకు సాష్టాంగపడగూడదు. శాక్యపుత్రీయశ్రమణులలో అన్ని వర్ణాలనుండీ ప్రవ్రజించినవారు ఉంటారు" అన్నాడు. రాజు మారు పలుకలేదు.

కొంతకాలం తర్వాత రాజు తన అమాత్యులందరిని సమావేశపరచి "నాకు అన్ని ప్రాణుల శిరస్సులూ కావాలి. కనుక మీరు ఒక్కొక్కరు ఒక్కొక్క రకమైన శిరస్సును తేవాలి. అమాత్యుడు యశుడు మానవశిరస్సును తెస్తాడు" అన్నాడు. అందరూ ఆయా శిరస్సులను తెచ్చారు. "పోయి ఆ శిరస్సులన్నిటినీ అమ్ముకొని రండి" అన్నాడు రాజు.

అన్ని తలలూ అమ్ముడు పోయాయి కాని మానవునితల మాత్రం అమ్ముడు పోలేదు. అప్పుడు రాజు "ఈ మనిషితలను ధరకు కాదు, ఊరకనే ఇచ్చిరండి!" అన్నాడు. అప్పుడు కూడా ఎవరూ తీసుకోలేదు. అప్పుడు అమాత్యుడు యశుడు తలను తీసుకొనేవారెవరూ లేనందున రాజు వద్దకు వచ్చి

"ఓ రాజా! ఆవుల, గాడిదల, గొర్రెల,  
జింకల, పక్షుల తలలను వెలయిచ్చి కొన్నారు.  
నిరర్థకమైన మానవుని తలను మాత్రం  
ఊరక యిచ్చినా తీసుకోలేదు" అన్నాడు.

రాజు ఆ అమాత్యునితో "ఎందుకు? ఈ మానవశరీరాన్ని ఎందుకు తీసుకోలేదు?" అన్నాడు.

అమాత్యుడు "ఇది జుగుప్స కలిగించటం వలన" అన్నాడు.

"మానవుల తలలన్నీ జుగుప్ప కలిగించేవేనా?"

"ఔను! మానవుల తలలన్నీ జుగుప్సను కలిగించేవే"

"నా తల కూడానా?"

నిజం చెప్పటానికి అతడు భయపడ్డాడు. రాజు "అమాత్యా! సత్యం చెప్పండి" అన్నాడు.

"ఔను"

అమాత్యునితో విషయాన్ని చెప్పించిన తర్వాత తాను ఎందుకు అలా చేయవలసివచ్చిందో చెపుతూ రాజు "భో! మనం రూప, ఐశ్వర్యాలవలన కలిగిన మదంతో ఉంటాము. దానిని తొలగించుకోవటానికి నేను ఆ భిక్షువుల చరణాలకు ప్రణామం చేస్తున్నాను."

వెల ఇవ్వనవసరం లేకున్నా జుగుప్సతో
దేనిని తీసుకోవటానికి లోకంలో
ఎవరూ ఇష్టపడలేదో, అట్టి శిరస్సును వంచి
నేను పుణ్యాన్ని ఆర్జించుకుంటున్నాను.
ఇందులో విపరీతం ఏముంది? అన్నాడు. ఇంకా

మీరు జాతిని చూస్తున్నారు కాని శాక్యభిక్షువులలోని గుణాలను చూడటం లేదు. జాతి మదం అంటుకున్న మీరు, మోహం వలన మీకూ నష్టాన్ని కలిగించుకుంటున్నారు, ఇతరులకు నష్టాన్ని కలిగిస్తున్నారు. జాతిని ఆవాహ (కొడుకుపెండ్లి) సమయంలో, వివాహ (కూతురుపెండ్లి) సమయంలో చూడాలి కాని ధర్మసమయంలో కాదు. ధర్మక్రియలకు గుణాలే కారణం. గుణాలున్న చోట జాతిని విచారించగూడదు. దోషాలున్న ఉన్నతకులీనుడు కూడా లోకంలో నిందింపబడతాడు. అయినపుడు నీచకులంవానిలోని ఉత్తమగుణాలను ఎందుకు గౌరవించగూడదు? చిత్తాలనుబట్టే శరీరాలు గౌరవింపబడతాయి. శాక్యశ్రమణుల మనస్సులు శుద్ధమైనవికావటం వల్లనే నేను వారిని గౌరవిస్తాను. ద్విజాతివాడు కూడా మంచిగుణాలను వదలి పతితుడైనపుడు నిర్లక్ష్యానికి

గురియౌతున్నాడు కదా! మరి తక్కువ కులంలో పుట్టినవాడు శుభగుణాలను కలిగియున్నపుడు ఎందుకు సత్కరింపబడ కూడదు?

ఇంకా

‘ఈ అసార యంత్రాలనుండి ప్రజ్ఞావంతులే
సారాన్ని గ్రహించగలరు’ అని
కారుణికుడైన శాక్యవృషభుడు చెప్పిన మాటలను
మీరు వినలేదా! అతడు చెప్పినది నిజం.
మీరు దానిని అనుసరించాలని నేను కోరుకుంటాను. ఇక
మీరు నన్ను నిరోధించటం మిత్రలక్షణం కాదు.
చెరుకుపిప్పిలా వదలివేయబడి, నా శరీరం భూమిపై పడిపోయినపుడు,
ఎదురు లేవటానికి, నమస్కరించటానికి, దోసిలి పట్టటానికి దేనికీ పనికిరాదు.
అందువలన ఇప్పుడే నా శరీరాన్ని కుశలకర్మలతో శిక్షింపజేయాలి.
శ్మశానంలో పడినతర్వాత ఇది సారాన్ని గ్రహించలేదు.
కాలిపోతున్న ఇంటినుండి, మునిగిపోతున్న పడవనుండి
రత్ననిధులను కాపాడుకోలేనివానిలా
శరీరాన్ని సరిగా ఉపయోగించనివాడు
సారాన్ని పొందలేడు.
సారాసార వివేచనతో సారాన్ని చూడనివారు
మరణమనే మొసలినోటిలో
పడినపుడు దుఃఖిస్తారు.
పెరుగు, నేయి, నవనీతం, పాలు, చల్లలను
ఉపయోగించుకోవటంద్వారా సారాన్ని గ్రహించినవాడు
కుండపగిలినా పెద్దగా దుఃఖించడు. అదేవిధంగా
సౌశీల్యంతో సారాన్ని పొందినవారు అంత్యకాలంలో
శోకించరు.
సుచరితవిముఖులు, గర్వితులైనవారి కుండవంటి శరీరాలను
సారాన్ని గ్రహించకముందే పెరుగుకుండ

పగులగొట్టబడినట్లుగా, మృత్యువు
పగులగొట్టినపుడు, వారి హృదయాలు
దుఃఖాగ్నిలో కాలిపోతాయి.
నేను శరీరంతో భిక్షువులకు నమస్కరిస్తున్నపుడు
మీరు ఆటంకపరచగూడదు. మీరు విషయాన్ని పరీక్షించకుండానే
మోహాంధకారంతో ఆవరింపబడి “నేను ఉత్తముడను” అనుకున్నారు.
దశబలుని మాటలవెలుగులో శరీరాన్ని పరీక్షించిన విజ్ఞులు
రాజు, సేవకుల శరీరాలలో ఏ భేదాన్నీ చూడరు.
చర్మం, మాంసం, ఎముకలు, నరాలు మొదలైనవాటిచే
రాజు శరీరం కూడా అందరివంటిదే.
వస్త్రాభరణాలవల్లనే శరీరానికి ఆధిక్యత కలుగుతుంది.
సారాన్ని కోరిన విజ్ఞులు ఇలా ఎదురులేవటం, నమస్కరించటం
మొదలైనవానిచే ఈ నీచశరీరాన్ని
కుశలసంపాదనలో ప్రవేశపెడతారు.

# అశోకరాజోపాఖ్యానం

(అశోకరాజు కథ)

'ఈ శరీరం ఇసుకముద్దలా, ఆముదపుకర్రలా సారహీనమైనప్పటికీ, దానిని ప్రణామాది పూజాకార్యాలలో ప్రవేశపెట్టటం వలన కలిగే ప్రయోజనం మేరు పర్వతమంతటిది, సముద్రం వరకుగల భూమండల రాజ్యమంతటికన్నా గొప్పది' అని రాజు అశోకుడు తెలుసుకున్నాడు.

అందువలన అతడు తథాగతుని స్తూపాలను ఇంతకు ముందరికన్న ఎక్కువగా పూజించాలనుకున్నాడు. తన అమాత్యబృందంతో కుక్కుటారామానికి పోయి, స్థవిరులముందు నిలబడి దోసిలిపట్టి –

"నేను ధూళిని దానం చేసినప్పుడు
నా గురించి చెప్పినట్లుగా,
సర్వదర్శియైన బుద్ధుడు చెప్పాడా?
ఇంకెవరి భవిష్యత్తు గురించి అయినా " అని అడిగాడు.

అప్పుడు యశుడనే పేరుగల సంఘస్థవిరుడు ఇలా అన్నాడు – "మహారాజా! చెప్పాడు. భగవానుడు తన పరినిర్వాణకాలానికి ముందు అపలాల నాగరాజును, కుమ్మరి స్త్రీని, చండాలస్త్రీని, గోపాలకస్త్రీని, సర్పాన్ని శిక్షణలోకి తెచ్చి మథురను చేరుకున్నాడు."

అక్కడ భగవానుడు ఆయుష్మంతుడు ఆనందుని సంబోధించి "ఆనందా! తథాగతుని పరినిర్వాణానికి నూరేండ్ల తర్వాత మథురలో గుప్తుడనే సౌగంధికుడు పుడతాడు. అతని పుత్రుడు ఉపగుప్తుడు బోధకులందరిలో ఉత్తముడై, అలక్షణికబుద్ధుడుగా నా పరినిర్వాణానికి నూరేండ్ల తర్వాత బుద్ధకార్యాన్ని నిర్వర్తిస్తాడు.

"ఆనందా! దూరంగా ఆకాశంలో కనిపించే ఆ నీలిరేఖను చూడు."

"అలాగే భదంతా!"

“ఆనందా! నా పరినిర్వాణానికి నూరు సంవత్సరాల తర్వాత అక్కడ ఉరుముండ పర్వతం మీద చిత్తశాంతికి అనుకూలమైన, శయ్యాసనాలతో నటభటిక అరణ్యాయతనం ఏర్పడుతుంది.” అక్కడ

“బోధకశ్రేష్ఠుడు, మహాయశస్వి
ఉపగుప్తుడు బుద్ధకార్యాన్ని చేస్తాడని
లోకనాథుడు ప్రకటించాడు” అన్నాడు.
రాజు మరి ఆ శుద్ధసత్త్వుడు “జన్మించాడా? లేదా?” అన్నాడు.

స్థవిరుడు “జన్మించాడు. ఆ మహాత్ముడు ఉరుముండ పర్వతంపై క్లేశాలను జయించి, అర్హతగణంతో లోకానుగ్రహంకోసం నివసిస్తున్నాడు. దేవా!

“సర్వజ్ఞలీలతో ఆ శుద్ధసత్త్వుడు భిక్షుగణాలకు
ఉత్తమధర్మాన్ని బోధిస్తున్నాడు.
వేలకొలది దేవతలు, అసురులు, నాగులు,
మానవులకు మోక్షపురానికి దారి చూపుతున్నాడు” అన్నాడు.

ఆయన చెప్పినట్లే ఆ సమయంలో ఆయుష్మంతుడు ఉపగుప్తస్థవిరుడు పద్దెనిమిదివేల అర్హతగణంతోపాటు నటభటిక అరణ్యాయతనంలో నివసిస్తున్నాడు. రాజు విని అమాత్యగణాన్ని ఆదేశిస్తూ ఇలా అన్నాడు –

“ఏనుగులను, గుర్రాలను, రథాలను సిద్ధం చేయండి!
వెంటనే ఉరుముండ పర్వతానికి పోయి,
సర్వాస్రవ విముక్తుడు, అర్హతుడూ అయిన
ఆర్య ఉపగుప్తుని నేను చూడాలి.”

అమాత్యులు ఇలా అన్నారు – “దేవా! మీరు స్వయంగా పోకుండా ఉపగుప్తస్థవిరునే మీవద్దకు వచ్చి దర్శనమిమ్మని, వార్తాహరునితో చెప్పి పంపండి!” అప్పుడు రాజు –

“అతడు మన వద్దకు రావలసినవాడు కాదు.
మనమే అతనివద్దకు పోవాలి. పైగా
ఉపగుప్తుని శరీరం రాయికన్న బలమైన వజ్రశరీరం అని నేను అనుకుంటున్నాను.

శాస్తవంటి అతడు నా ఆజ్ఞను ఉపేక్షించవచ్చును” అన్నాడు.

అప్పుడు రాజు ఉపగుప్తస్థవిరుని వద్దకు తాను ఆయన దర్శనం కోసం వస్తున్నట్లుగా చెప్పి దూతను పంపించాడు. ఉపగుప్తస్థవిరుడు ‘రాజు ఇక్కడికి వస్తే ప్రజలకు చాలా బాధ కలుగుతుంది’ అని తెలుసుకొని తానే అక్కడికి వస్తానని చెప్పి పంపాడు. అప్పుడు రాజు ‘ఉపగుప్తస్థవిరుడు నౌకపై వస్తాడ’ని మథురనుండి పాటలీపుత్రం వరకు నౌకను ఏర్పాటు చేశాడు. రాజుపై అనుగ్రహంతో ఉపగుప్తస్థవిరుడు పద్దెనిమిదివేలమంది అర్హతులతో పాటు నౌకను ఎక్కి పాటలీపుత్రాన్ని చేరుకున్నాడు.’

రాజపురుషులు రాజుతో “దేవా! సంతోషవార్త. మీపై అనుగ్రహంతో చిత్తేశ్వరుడు, శాసనకర్ణధారి, భవసాగరాన్ని తరించిన ఉపగుప్తస్థవిరుడు తన అనుచరులతోపాటు వచ్చాడు” అని చెప్పారు.

విన్న రాజు ప్రసన్నచిత్తంతో లక్షవిలువైన ముత్యాలహారాన్ని తన మెడనుండి తీసి ప్రియవార్తను తెచ్చిన ఆ సేవకులకు ఇచ్చాడు. ఘంటికలను మ్రోగిస్తూ నగరంలో సందేశాన్ని వినిపించేవారిని పిలిపించి, “పాటలీపుత్ర నగరమంతటా గంటలను మ్రోగిస్తూ ఉపగుప్తస్థవిరుని ఆగమనవార్తను ప్రకటించండి” అని ఆదేశించాడు.

కష్టాలకు కారణమైన దారిద్ర్యాన్ని విడిచి
శుభకరమైన సంపదలను కోరేవారు,
స్వర్గమోక్షాలకు కారణమైన
కరుణామూర్తి ఉపగుప్తుని దర్శించండి.
“మానవశ్రేష్ఠుడు, స్వయంభూ, మహాకారుణికుడూ అయిన శాస్తను చూడనివారు,
ఉదారుడు, మూడులోకాలను వెలిగించేవాడూ అయిన
ఉపగుప్తస్థవిరుని చూడండి!”

ఇలా రాజు నగరమంతటా చాటింపు వేయించి, నగరాన్ని అలంకరింపజేసి, మూడున్నరయోజనాలు ముందుకుపోయి సకల వాద్యాలను, సర్వ పుష్ప, గంధ, మాల్యాలను తీసుకుని, పౌరులు, అమాత్యులూ అందరూ వెంటరాగా ఉపగుప్తస్థవిరునికి ఎదురుపోయాడు. పద్దెనిమిదివేల అర్హతభిక్షువులు తన వెనుక అర్ధచంద్రాకారంలో నిలబడియుండగా ముందున్న ఉపగుప్తస్థవిరుని రాజు చూశాడు. ఏనుగుపైనుండి దిగి,

స్థవిరునివద్దకు కాలినడకతోపోయి, నదీతీరాన్ని చేరుకొని ఒక పాదాన్ని నదీతీరంలో నిలిపి, ఇంకొక పాదాన్ని నావపలకపైవేసి, స్థవిరుని శరీరాన్ని పట్టుకొని నౌకనుండి దించాడు. దించిన తర్వాత వేరునుండి పడిపోయిన చెట్టులా ఉపగుప్తస్థవిరుని పాదాలపైబడి, ముఖంతో పాదాలని తుడిచి, మళ్లీ వీరాసనంలో కూర్చుండి, దోసిలిపట్టి ఉపగుప్తస్థవిరునితో ఇలా అన్నాడు –

“శత్రుగణాలను చంపి, సముద్రాన్ని ఆభరణంగాగల
పర్వతసహితభూమిని
ఏకపాత్రగా పొందినపుడు కూడా నాకు
స్థవిరుని చూచినపుడు కలిగినంత ప్రీతి కలుగలేదు.
ఈ ఉత్తమశాసనంలో మిమ్ములను చూచి నా ఆనందం ద్విగుణీకృతమైంది.
మీలో నేడు శుద్ధుడు, అనుత్తరుడు, స్వయంభూ అయిన
బుద్ధుని నేను చూశాను.”

ఇంకా –

“ఇప్పుడు కారుణికుడైన జినేంద్రుడు లేడు.
మూడు లోకాల్లో ఆయన కార్యాన్ని
మీరు నిర్వర్తిస్తున్నారు.
ఇప్పుడు ఆ జగన్మోహన నిమీలితాక్షుడు అస్తమించాడు
మీరే సూర్యునిలా జ్ఞానబోధను చేస్తున్నారు.
ఆ లోకచక్షువుయొక్క బోధకులందరిలో
శ్రేష్ఠులు, శాస్తవంటి వారు అయిన మిమ్ములను
శరణు పొందుతున్నాను.
ఓ ప్రభూ! నేను ఏం చెయ్యాలో
శీఘ్రంగా ఆజ్ఞాపించండి!
ఓ శుద్ధసత్వా! దానిని నేను ఆచరిస్తాను.”

అప్పుడు ఉపగుప్తస్థవిరుడు కుడిచేయిని రాజు శిరస్సుపై ఉంచి ఆశీర్వదిస్తూ –

“అప్రమత్తుడవై రాజ్యాన్ని పరిపాలిస్తూ

ఓ రాజేంద్రా! దుర్లభమైన త్రిరత్నాలను
నిత్యమూ పూజించు!"

ఇంకా మహారాజా! భగవానుడు, తథాగతుడు, అర్హతుడు, సమ్యక్సంబుద్ధుడు మిమ్ములను, నన్ను తన శాసనాన్ని కాపాడటానికే నియమించాడు. దానిని మనం అతని సంఘగణ మధ్యంలో చక్కగా నిర్వర్తించాలి.

రాజు స్థవిరోత్తమా! భగవానుడు ముందుగా చెప్పిన విధంగానే నేను అంతా నిర్వర్తించాను. నిర్వర్తిస్తాను –

"గిరిశృంగాలవంటి విచిత్రస్తూపాలను నిర్మించి,
ఛత్రాలను, ధ్వజాలను నిలిపి
రత్నాలతో అలంకరింపజేశాను.
ధాతువులను విస్తరింపజేయటంద్వారా
భూమండలశోభను ఇనుమడింపజేశాను. ఇంకా
సంబుద్ధుని శాసనం కోసం
పుత్రుడు, ఇల్లు, భార్య, భూమండలం, కోశాగారం
దేనినైనా పరిత్యజించవలసిందే" అన్నాడు.

ఉపగుప్తస్థవిరుడు "సాధు! సాధు! మహారాజా! ధర్మాన్ని అలాగే అనుష్ఠించాలి."

"శరీరాన్ని, సంపదలను, ప్రాణాన్ని
ధర్మంకోసం వినియోగించేవారు,
కాలగతులైనపుడు దుఃఖించరు,
కోరుకున్న సురలోకాన్ని పొందుతారు" అన్నాడు.

రాజు గొప్ప వైభవంతో ఉపగుప్తస్థవిరుని రాజగృహంలో ప్రవేశింపజేసి, అతని శరీరాన్ని పట్టుకొని ఆసనంపై కూర్చుండబెట్టాడు. ఉపగుప్తుని శరీరం మృదువుగా, అతిమృదువుగా దూదిలా, పట్టులా ఉంది.

రాజు ఉపగుప్తస్థవిరుని శరీరస్పర్శను తెలుసుకొని

"ఓ ఉదారసత్త్వా! మీ శరీరం దూదిలా, పట్టులా మృదువుగా ఉంది.

కాని నా శరీరం కర్కశంగా, గరుకుగా, పరుషంగా, స్పర్శకు అననుకూలంగా ఉంది” అన్నాడు.

స్థవిరుడు–

“నేను ఆ సాటిలేని మానవోత్తమునకు
ఉత్తమమైన, శుభకరమైన దానాన్ని ఇచ్చాను.
మీలాగా తథాగతునకు దుమ్మును దానంగా ఇవ్వలేదు” అన్నాడు.

రాజు –

“స్థవిరోత్తమా! నేను అనుత్తరమైన
పుణ్యక్షేత్రాన్ని పొందినప్పటికీ
బాలున్ని కావటం వలన దుమ్మును
దానంగా ఇచ్చి, ఈ విధమైన ఫలాన్ని పొందాను” అన్నాడు.

అప్పుడు స్థవిరుడు రాజుకు సంతోషాన్ని కలిగిస్తూ

“మహారాజా! దుమ్మును దానంగా తీసుకొని
రాజ్యసంపదలను, సాటిలేని ధరాధిపత్యాన్ని
ఇచ్చిన ఆ క్షేత్రమాహాత్మ్యాన్ని చూడు!” అన్నాడు.

విని రాజు విస్మయంతో, సంతోషంతో కన్నులు వికసించగా అమాత్యులతో –

“దుమ్మును దానం చేసినంతమాత్రాన
బలచక్రవర్తి రాజ్యాన్ని పొందాను.
మీరు భగవానుని చక్కగా పూజించండి” అన్నాడు.

అప్పుడు రాజు ఉపగుప్తస్థవిరుని పాదాలపైబడి “స్థవిరోత్తమా! భగవానుడు బుద్ధుడు సంచరించిన ప్రదేశాలను దర్శించి, పూజించాలని కోరికగా ఉంది. రానున్నతరాలు గుర్తించటానికి వీలుగా అక్కడ చిహ్నాలను స్థాపించాలని ఉంది” అన్నాడు.

స్థవిరుడు “సాధు! సాధు! మహారాజా! మీ ఆలోచన శుభకరమైనది. నేను వాటిని నేడే దర్శింపజేస్తాను”

"భగవానుడు జీవించిన స్థలాన్ని మనం
చేతులు జోడించి గౌరవించాలి.
సంశయం కలుగకుండా అక్కడ
చిహ్నాలను స్థాపించాలి" అన్నాడు.

అప్పుడు రాజు చతురంగబలాలను సిద్ధంచేసి, గంధమాల్య పుష్పసముదాయాలను తీసుకొని ఉపగుప్తస్థవిరునితో బయలుదేరాడు. ఉపగుప్తస్థవిరుడు మొట్టమొదట అశోకరాజును లుంబినీవనంలో ప్రవేశింపజేసి కుడిచేతిని ఎత్తి చూపుతూ ఇలా అన్నాడు–

"మహారాజా! ఇది భగవానుడు పుట్టినస్థలం.
ఉత్తమచక్షువైన బుద్ధుని మొదటి చైత్యమిది.
ఇక్కడ పుట్టినవెంటనే ఆ ముని ఏడడుగులు నడిచి,
నాలుగుదిక్కులనూ పరికించి 'ఇది అంతిమజన్మ,
మరలా నాకు లేదు గర్భవాసం' అన్నాడు."

రాజు అతని పాదాలపైపడి, లేచి దోసిలిపట్టి –

"మహాముని పుట్టుకను చూచి, మనస్సుకు
ఆనందం కలిగించే అతని మాటలను
విన్నవారు ధన్యులు. కృతపుణ్యులు" అన్నాడు.

రాజు సంతోషాన్ని పెంచటానికి స్థవిరుడు –

"వాదిశ్రేష్ఠుని జన్మను, అతడు ఏడడుగులు వేయటాన్ని చూచి,
అతని మాటలను విన్న దేవతను చూడాలనుకుంటున్నారా?" అన్నాడు

అశోకుడు "చూడాలనుకుంటున్నాను" అన్నాడు. ఉపగుప్తుడు సిద్ధార్థునికి జన్మనిచ్చేటపుడు మహామాయాదేవి ఏ చెట్టు కొమ్మను పట్టుకొన్నదో ఆ చెట్టుకొమ్మవైపు కుడిచేతిని చాచి,

"ఈ అశోకవృక్షంలో నివసిస్తూ
బుద్ధుని జన్మను చూచిన దేవకన్య
రాజు అశోకుని శ్రద్ధను పెంచటానికి

తన నిజరూపంతో కనిపించుగాక!" అన్నాడు.

వెంటనే ఆ దేవత ఉపగుప్తస్థవిరుని ముందు తన నిజరూపంతో నిలబడి, దోసిలిపట్టి ఇలా అన్నది – "స్థవిరోత్తమా! ఏమి ఆజ్ఞ."

అప్పుడు స్థవిరుడు రాజు అశోకునితో "మహారాజా! భగవానుడు పుట్టినపుడు చూచిన దేవత ఈమె" అన్నాడు.

రాజు దోసిలిపట్టుకొని దేవతతో ఇలా అన్నాడు –

"ఆ లక్షణభూషితాంగుని, ఆ కమలాయతనేత్రుని
పుట్టుకను చూశావా? ఈ వనంలో
ఆ నరశ్రేష్ఠుని మనోజ్ఞమైన
మొదటిమాటలను విన్నావా?"

దేవత అన్నది–

"బంగారువంటి మేనిఛాయగల ఆ మానవశ్రేష్ఠుని
పుట్టుకను నేను చూశాను. ఏడడుగులు వేసి
ఆ శాస్త పలికిన మాటలను విన్నాను."

రాజు "ఓ దేవతా! భగవానుడు జన్మించినప్పటి వైభవాన్ని వర్ణించు" అన్నాడు. దేవత – దానిని వర్ణించటం నాకు శక్యం కాదు. అయినా రెండుమాటల్లో చెపుతాను విను –

"ఇంద్రుని మూడులోకాలలోనూ గొప్ప అతిమానుషమైన
వెలుతురు ప్రసరించింది.
సాగరపరివృతమైన భూమండలం తనపై గల పర్వతాలతో పాటుగా,
తుఫానులో చిక్కిన నౌకలా కంపించింది."

రాజు బుద్ధుని జన్మస్థలానికి లక్ష బంగారునాణాలను సమర్పించుకొని, అక్కడ ఒక స్తూపాన్ని నిర్మించి వెళ్లిపోయాడు. అప్పుడు ఉపగుప్తస్థవిరుడు రాజును కపిలవస్తులో ప్రవేశింపజేసి కుడిచేతిని చాపి ఇలా అన్నాడు – మహారాజా! ఈ ప్రదేశంలో బోధిసత్త్వుడు

రాజు శుద్ధోదనుని ముందుకు తేబడినాడు. ఆ శరీరం ముప్పదిరెండు మహాపురుషలక్షణాలతో అలంకృతమై ఉండటం చూచి శుద్ధోదనుడు బోధిసత్త్వుని పాదాలకు సాష్టాంగ నమస్కరించాడు.

“మహారాజా! ఇది శాక్యవర్ధం అనబడే శాక్యుల దేవాలయం. పుట్టినతర్వాత దేవతను పూజించటానికి బోధిసత్త్వుని ఇక్కడికి తీసుకొని వచ్చారు. అప్పుడు దేవతలందరూ బోధిసత్త్వుని పాదాలపైబడి నమస్కరించారు. ఇది చూచి శుద్ధోదనుడు తన కొడుకు దేవతలకే దేవుడు కనుక దేవాదిదేవుడని అతనికి పేరుపెట్టాడు. మహారాజా! ఈ ప్రదేశంలో బ్రాహ్మణులు బోధిసత్త్వుని లక్షణాలను చూచి అతని భవిష్యత్తును చెప్పారు. ఈ ప్రదేశంలో అసిత ఋషి ఇతడు బుద్ధుడౌతాడని ప్రకటించాడు.”

ఈ ప్రదేశంలో మహరాజా! మహాప్రజాపతిచే పెంచబడినాడు. ఈ ప్రదేశంలో లిపిజ్ఞానాన్ని నేర్చుకున్నాడు. ఈ ప్రదేశంలో గుఱ్ఱంపై కూర్చుండి, విల్లమ్ములను పట్టుకొని, తోమరాన్ని పట్టుకొని, అంకుశాన్ని పట్టుకొని కులవిద్యలలో నైపుణ్యాన్ని సంపాదించాడు. ఇక్కడ బోధిసత్త్వుని వ్యాయామశాల ఉండేది. ఈ ప్రదేశంలో మహారాజా! బోధిసత్త్వుడు నూరువేల దేవతలు చుట్టూ ఉండగా, ఆరువేలమంది స్త్రీలతో సుఖాన్ని అనుభవించాడు.

ఈ ప్రదేశంలో బోధిసత్త్వుడు వనానికి వెళుతూ వృద్ధుని, రోగిని, శవాన్నీ చూశాడు. ఈ ప్రదేశంలో నేరేడు చెట్టు నీడలో కూర్చుండి ఏకాంతంలో పాపకారులైన అకుశలధర్మాలకు వేరుగా సవిచార, సవితర్కవివేకం వలన కలిగిన ప్రీతితో కూడిన మనస్సుతో అనాస్రవసుఖంవంటి ప్రథమధ్యానాన్ని పొందాడు. అప్పుడు మధ్యాహ్నం గడిచి, అన్ని చెట్ల నీడలు తూర్పుకు తిరిగినా, బోధిసత్త్వుడు కూర్చున్న చెట్టునీడమాత్రం తూర్పుకు తిరుగలేదు. అది చూచి శుద్ధోదనుడు మరలా బోధిసత్త్వుని ముందు సాష్టాంగపడ్డాడు. ఈ ద్వారంనుండే బోధిసత్త్వుడు వేలకొలది దేవతలతో పరివేష్టింపబడి అర్ధరాత్రి కపిలవస్తునుండి బయటకు పోయాడు.

ఈ ప్రదేశంలో ఛందకునికి గుఱ్ఱాన్ని, ఆభరణాలనూ ఇచ్చి, వెనుకకు పంపించాడు.

గుఱ్ఱాన్నీ, ఆభరణాలనూ ఛందకునికి ఇచ్చి ఇక్కడే వెనుకకు పంపి,

ఆ వీరుడు సేవకులు లేకుండా ఉపవనంలో ప్రవేశించాడు.

ఈ ప్రదేశంలో బోధిసత్త్వుడు వేటగానికి తన పట్టువస్త్రాలను ఇచ్చి, అతని కాషాయవస్త్రాలను తీసుకొని ప్రవ్రజించాడు. ఈ ప్రదేశంలో భార్గవుని ఆశ్రమంలోనికి ఆహ్వానింపబడ్డాడు. ఈ ప్రదేశంలో బోధిసత్త్వునికి రాజు బింబిసారుడు అర్ధరాజ్యాన్ని ఇస్తానన్నాడు. ఈ ప్రదేశంలో ఉద్రక, ఆరాడులను కలుసుకున్నాడు. ఇంకా అన్నాడు –

"తపోవనంలో ఉద్రక, ఆరాడక ఋషులను చేరుకొని
ఆర్యసత్త్వుడు పౌరుషంతో ప్రయత్నించాడు.
ఈ ప్రదేశంలో బోధిసత్త్వుడు ఆరేండ్లు దుష్కరమైన తపస్సు చేశాడు.
ఆరు సంవత్సరాలు కఠినమైన తపస్సుచేసి మహాముని,
ఇది మార్గం కాదని తెలుసుకొని వదలివేశాడు" అన్నాడు.

ఈ ప్రదేశంలో గ్రామికుని కూతుళ్లు నంద, నందబల అనేవారు ఆరుసార్లు వండి, చిక్కపరిచిన మధుపాయసాన్ని బోధిసత్త్వునికి అర్పించారు. ఇంకా –

"ఈ ప్రదేశంలో నంద ఇచ్చిన పాయసాన్ని తిని
ఆ వాక్శ్రేష్ఠుడు మహావీరుడు బోధివృక్షం క్రిందకు పోయాడు."

ఈ ప్రదేశంలో బోధివృక్షం క్రిందకు పోతూ ఉన్న బోధిసత్త్వుని కాలికుడనే నాగరాజు స్తుతించాడు.

"కాలికభుజగేంద్రునిచే స్తుతింపబడిన వాక్శ్రేష్ఠుడు
ఈ మార్గం వెంట నడిచి అమృతాన్ని కోరి
బోధిమండపానికి చేరుకున్నాడు." అన్నాడు.

అప్పుడు రాజు స్థవిరుని పాదాలపైబడి దోసిలిపట్టి –

"ఈ మార్గంలో పోయిన మత్తనాగేంద్రవిక్రముని,
తథాగతుని దర్శించిన ఆ కాలిక నాగేంద్రుని
నేను చూడాలనుకుంటున్నాను." అన్నాడు.

అప్పుడు కాలిక నాగరాజు స్థవిరుని సమీపంలో నిలబడి దోసిలిపట్టి "స్థవిరోత్తమా! ఏమి ఆజ్ఞ?" అన్నాడు. అప్పుడు స్థవిరుడు రాజుతో "మహారాజా! భగవానుడు బోధివృక్షం

క్రిందకు పోతున్నపుడు స్తుతించిన కాలికనాగరాజు ఇతడే" అన్నాడు. అప్పుడు రాజు దోసిలి పట్టి కాలికనాగరాజుతో –

"తప్తకాంచనవర్ణంతో, శరత్కాలచంద్రునిలా వెలిగే
వదనంతో మెరిసే శాస్తను చూసిన నీవు
నా కోసం ఆయన గుణాలను వివరించు!
సుగతుని ప్రకాశం ఎలా ఉండేదో తెలుపు!" అన్నాడు.

"దానిని మాటల్లో వర్ణించటానికి నేను అశక్తుడను. అయినా రెండుమాటల్లో చెపుతాను విను!" అన్నాడు కాలికుడు.

"అతని పాదాలక్రింద ఈ భూమండలమంతా
దానిపైగల పర్వతాలతో సహా
ఆరు విధాలుగా కంపించింది.
సుగతుడు ఎన్నడూ తరగని చంద్రునిలా
సూర్యుని మించిన కాంతితో కనిపించాడు."

రాజు ఆ చోట స్తూపాన్ని నిర్మించాడు. తర్వాత ఉపగుప్తస్థవిరుడు బోధివృక్షమూలం వద్దకు రాజును కొనిపోయి తన కుడిచేతిని చాచి "మహారాజా! ఇక్కడ బోధిసత్త్వుడు మొదట తన మైత్రీబలంతో మారసైన్యాన్ని ఓడించి, అనుత్తర సమ్యక్సంబోధిని పొందాడు." ఇంకా –

"ఇక్కడే ఈ బోధిమూలంలో మునిశ్రేష్ఠుడు
నముచిబలాన్ని నిరస్తం చేసి,
ఆ అసమాన మానవుడు అమృతం,
ఉదారం అయిన అగ్రబోధిని పొందాడు" అన్నాడు.

ఇది విన్నతర్వాత రాజు బోధివృక్షానికి నూరువేల బంగారు నాణాలను సమర్పించి, చైత్యాన్ని నిర్మించాడు. వారు ముందుకు పోయారు. కొంతసేపటి తర్వాత ఉపగుప్తస్థవిరుడు రాజు అశోకునితో ఇలా అన్నాడు – "ఇక్కడే భగవానుడు చతుర్మహారాజిక దేవతల వలన నాలుగు శిలాపాత్రలను పొంది వాటిని ఒక్కటిగా మార్చాడు." ఈ ప్రదేశంలో

త్రపుష భల్లికులనుండి పిండపాతాన్ని గ్రహించాడు. ఈ ప్రదేశంలో భగవానుడు వారాణసికి వెళుతూ ఉపక ఆజీవకునితో స్తుతింపబడినాడు. స్థవిరుడు రాజును ఋషిపతనానికి కొనిపోయి కుడిచేతిని చాచి "ఈ ప్రదేశంలో మహారాజా! మూడు వర్తులాలు, పన్నెండు ఆరెలూగల ధర్మచక్రాన్ని ప్రవర్తింపజేశాడు." ఇంకా –

"సంసారాన్ని నివర్తింపజేసే శుభ అనుత్తరధర్మ చక్రాన్ని
నాథుడు ఈ ప్రదేశంలోనే ప్రవర్తింపజేశాడు" అన్నాడు.

ఈ ప్రదేశంలో వేయిమంది జటిలతాపసులు ప్రవ్రజించారు. ఈ ప్రదేశంలో రాజు బింబిసారునికి ధర్మాన్ని ఉపదేశించాడు. రాజు బింబిసారుడు ఎనుబదినాలుగువేల దేవతలు, మాగధులైన అనేక బ్రాహ్మణ గృహపతులు సత్యాలను దర్శించారు. "ఈ ప్రదేశంలో దేవరాజు శక్రునికి ధర్మాన్ని ఉపదేశించాడు. దేవరాజు శక్రుడు ఎనుబదినాలుగువేల దేవతలతో ఇక్కడే సత్యాలను దర్శించాడు. ఈ ప్రదేశంలో మహాప్రాతిహార్యాన్ని చూపించాడు. ఈ ప్రదేశంలో త్రయస్త్రింశస్వర్గంలో వర్షావాసాన్ని గడుపుతూ జన్మనిచ్చిన తల్లికి ధర్మాన్ని బోధించి, దేవగణాలతో పాటు భూమికి దిగివచ్చాడు" అన్నాడు. ఆ తర్వాత స్థవిరుడు రాజును కుశీనగరానికి చేర్చి, పరినిర్వాణస్థలాన్ని చూపుతూ కుడిచేతిని చాచి ఇలా అన్నాడు – "ఈ ప్రదేశంలో మహారాజా! భగవానుడు బుద్ధకార్యాన్నంతా ముగించి నిర్వాణధాతువులోకి పరినిర్వృతుడైనాడు." ఇంకా

"దేవ మానవ అసుర యక్ష నాగులను అక్షయమైన ధర్మవినయంలో సుశిక్షితులను చేసి, ఇక శిక్షణ పొందగినవారెవరూ లేరని గుర్తించి, ప్రశాంతబుద్ధితో ఆ పరమకారుణికుడైన మహర్షి శాంతిని పొందాడు" అన్నాడు.

విని రాజు మూర్ఛితుడై పడిపోయి, చన్నీటిని చల్లిన తర్వాత తేరుకున్నాడు. రాజు తెలివిని పొందిన తర్వాత పరినిర్వాణ ప్రదేశానికి నూరువేల బంగారు నాణాలను ఇచ్చి, చైత్యాన్ని నిర్మింపజేశాడు.

అప్పుడు స్థవిరుని పాదాలపైబడి "స్థవిరోత్తమా! భగవానుడు తన అగ్రశ్రావకులని ప్రకటించినవారి శరీరధాతువులను కూడా దర్శించి, పూజించుకుంటాను" అన్నాడు. స్థవిరుడు "సాధు! సాధు! మహారాజా! మీ ఆలోచన శుభకరమైనది" అని రాజును జేతవనంలో ప్రవేశింపజేసి కుడిచేతిని చాపి "మహారాజా! ఇదే సారిపుత్రస్థవిరుని స్తూపం.

పూజించండి" అన్నాడు. రాజు "వారి గుణాలను వర్ణించండి" అన్నాడు.

"అతడు ద్వితీయశాస్తగా, ధర్మచక్రప్రవర్తనంలో ధర్మసేనాధిపతిగా,
ప్రజ్ఞావంతులలో మిన్నగా భగవానునిచే గుర్తింపబడినాడు."
లోకంలోని ప్రజ్ఞనంతా ఒకచోట చేర్చినా అది
సారిపుత్రుని ప్రజ్ఞలో పదహారవవంతు కూడా
కాదని తథాగతుడు అన్నాడు. ఇంకా
జినునిచే ప్రవర్తింపజేయబడిన అతుల సద్ధర్మచక్రం
ధీమంతుడైన సారిపుత్రునిచేతనే త్రిప్పబడింది.
శారద్వతీపుత్రుని గుణగణాలను పూర్తిగా తెలిసివర్ణించటం
తథాగతునకు తప్ప అన్యులకు తరం కాదు అన్నాడు.

రాజు ప్రీతిమనస్కుడై స్థవిరశారద్వతీపుత్ర స్తూపానికి నూరువేల బంగారునాణాలను ఇచ్చి అంజలిపట్టి ఇలా అన్నాడు –

"భవసంగవిముక్తుడూ, జ్ఞానవంతులలో ఉత్తముడూ
లోకంలో ప్రకాశితమైన కీర్తికలవాడూ అయిన
వీరునకు, శారద్వతీపుత్రునకు
భక్తితో నమస్కరిస్తున్నాను."

అప్పుడు ఉపగుప్తస్థవిరుడు మహామౌద్గల్యాయన స్థవిరుని స్తూపాన్ని చూపుతూ

"మహారాజా! ఇదే మహామౌద్గల్యాయనస్థవిరుని స్తూపం. పూజించండి!" అన్నాడు.

"అతని గుణాలను వివరించండి"

"అతడు బుద్ధిమంతులలో శ్రేష్ఠుడ'ని భగవానునిచే చెప్పబడినాడు. కుడికాలిబొటనవ్రేలితో శక్రదేవేంద్రుని వైజయంత ప్రాసాదాన్ని కంపింపజేశాడు. నందోపనందనాగరాజుని దమింపజేశాడు." ఇంకా

"తన కాలి బొటనవ్రేలితో శక్రునిభవనాన్ని
కంపింపజేసిన బుద్ధిమంతుడు,
దుర్దాంతుడు, భీకరుడు అయిన

భుజగేశ్వరుని దమించినవాడు,

ఆ ద్విజోత్తముడైన కోలితుడు పూజనీయుడు" అన్నాడు.

రాజు మహామౌద్గల్యాయన స్తూపానికి నూరువేల బంగారునాణాలను ఇచ్చి –

"జన్మజరాశోకదుఃఖవిముక్తుడూ, విఖ్యాతుడూ అయిన

మహామౌద్గల్యాయనునకు తలను వంచి నమస్కరిస్తున్నాను" అన్నాడు.

అప్పుడు ఉపగుప్తస్థవిరుడు మహాకాశ్యపస్తూపాన్ని చూపించి "మహారాజా! ఇది మహాకాశ్యపస్థవిరుని స్తూపం. పూజించండి" అన్నాడు.

"అతని గుణాలను వివరించండి"

"అల్పేచ్ఛగలవారిలో, సంతుష్ఠులలో, ధుతంగులలో, బోధకులలో శ్రేష్ఠుడ'ని భగవానునిచే చెప్పబడినాడు. భగవానుడు ఇతనికి అర్ధాసనమిచ్చి గౌరవించాడు. తన జీర్ణవస్త్రాన్ని ఇచ్చాడు. ఇతడు నిరాడంబర జీవితాన్ని గ్రహించి, సంఘాన్ని కలిపి ఉంచాడు." ఇంకా

"ఉదారపుణ్యక్షేత్రం, ధుతంగగుణధారి,

సర్వజ్ఞచీవరధారి, మతిమంతుడు,

సంఘాన్ని కలిపి ఉంచినవాడు,

గురువు యొక్క గుణాలను సంపూర్ణంగా వర్ణించగలిగినవాడు,

మతిమంతుడు, భగవానునిచే

అర్ధాసనమివ్వబడి గౌరవింపబడినవాడు" అన్నాడు.

రాజు అశోకుడు మహాకాశ్యపుని స్తూపానికి నూరువేల బంగారునాణాలను ఇచ్చి అంజలి ఘటించి –

"పర్వతగుహానిలయంలో మరణించినవాడు,

వైరంలేనివాడు, బంధముక్తుడు

సంతోషగుణవివృద్ధుడూ అయిన కాశ్యపస్థవిరునకు వందనం" అన్నాడు.

తర్వాత ఉపగుప్తస్థవిరుడు బక్కులస్థవిరుని స్థూపాన్ని చూపించి,

"మహారాజా! ఇది బక్కులస్థవిరుని స్థూపం. పూజించండి" అన్నాడు.

"అతని గుణాలను వివరించండి"

"ఈ మహాత్ముడు తక్కువసార్లు రోగపీడితుడైనాడు. అంతేకాదు అతడెన్నడూ ఒక ద్విపదను కూడా ఇతరులకు చెప్పలేదు."

"ఇక్కడ ఒక కాకణి (ఒక నాణెంకన్నా తక్కువ) మాత్రం ఇస్తాను" అన్నాడు రాజు.

ఆ మాటను వినగానే అమాత్యులు "దేవా! ఇంతకు ముందరిలాకాక ఇక్కడ ఒక కాకణి మాత్రమే ఎందుకు ఇస్తున్నారు?" అని అడిగారు

"వినండి" అన్నాడు రాజు.

"జ్ఞానప్రకాశంతో తన మనస్సులోని చీకటిని నశింపజేసినట్లే
ప్రాణులహితం కోసం ఎంతో చేయగలిగి ఉండికూడా
అల్పేచ్ఛత వలన అలా చేయలేదు. అతడు
తన ముక్తిని చూసుకున్నాడు కాని
ఇతరుల ముక్తికి ప్రయత్నించలేదు."

మంత్రులు అశోకుని పాదాలపైబడి, విస్మయంతో "అయ్యో! అల్పేచ్ఛతవలన ఇతడు లక్ష్యాన్ని కోల్పోయాడు" అన్నారు.

ఉపగుప్తస్థవిరుడు ఆనందస్థవిరుని స్తూపాన్ని చూపిస్తూ "ఇది ఆనందస్థవిరుని స్తూపం. పూజించండి" అన్నాడు.

"అతని గుణాలు ఎలాంటివి?"

"అతడు భగవానుని సేవకుడు. బహుశ్రుతులలో మిన్న. బుద్ధునిమాటలను సంగ్రహించినవాడు." ఇంకా

"మునిపాత్రరక్షణసమర్థుడు, స్మృతిమంతుడు,
ధృతిమంతుడు, బుద్ధిశాలి, సముద్రమంతటి జ్ఞానాన్ని విని
గుర్తుంచుకున్నవాడు, తన స్పష్టమైన తీయనిమాటలతో

దేవమానవులచే గౌరవింపబడినవాడు
సదానందుడు. సంబుద్ధుని చిత్తాన్ని తెలిసినవాడు,
విచక్షణాశీలుడు, సద్గుణాలపేటిక.
జినసంస్తుతుడు, మనోయుద్ధవిజేత" అన్నాడు.

అశోకుడు అనందస్తూపానికి ఒక కోటి బంగారునాణాలు ఇచ్చాడు. మంత్రులు "దేవా! ఇతరులందరికన్నా ఇతన్ని ఎక్కువగా ఎందుకు గౌరవిస్తున్నారు?" అన్నారు.

రాజు "వినండి" అని తన అభిప్రాయాన్ని తెలుపుతూ –

"ధర్మాత్ముడు, ధర్మమయుడు, విశుద్ధుడు అయిన
భగవానుని శరీరాన్ని కాపాడినవాడు, విశోకుడనే పేరుగలవాడు,
ఈ కారణం చేత అతడు పూజనీయుడు.
నేడు ధర్మదీపం ప్రకాశిస్తూ ప్రజ్ఞతో
క్లేశాలచీకటిని తొలగిస్తూ ఉందంటే
అందుకు ఈ సుగతపుత్రుడే కారణం.
ఈ కారణం చేత అతడు పూజనీయుడు.
సముద్రజలాన్ని వహించటానికి
సముద్రమే సరిపోతుంది కాని గోష్పాదం కాదు.
నాథుడు ఆతని ధార్మికశక్తిని గుర్తించే
అతన్ని సూత్రాంతికుడుగా అభిషేకించాడు" అన్నాడు.

అని రాజు స్థవిరుని స్థూపాన్ని అర్చించి, ఉపగుప్తస్థవిరుని పాదాలపైపడి సంతోషంతో ఇలా అన్నాడు –

"వందలపుణ్యకార్యాలు చేసిపొందిన
నా మానవజన్మ సఫలమైంది.
రాజైశ్వర్యస్థిరప్రభావం వలన
ఉత్తమసారాన్ని గ్రహించాను.
లోకాన్ని తెల్లని మేఘాలవంటి
స్తూపాలతో అలంకరించాను.

సాటిలేని ఈ శాసనంలో నేడు
నేను దుష్కరకార్యాన్ని చేయలేదా?"

ఈ మాటలు పలికి రాజు అశోకుడు ఉపగుప్తస్థవిరుని వద్ద సెలవు తీసుకొని వెళ్లిపోయాడు. రాజు బుద్ధుని జన్మస్థలానికి, బోధిమండపానికి, ధర్మచక్రప్రవర్తన స్థలానికి, మహాపరినిర్వాణస్థలానికి నూరువేలు, నూరువేలు ఇచ్చినా బోధివృక్షం పట్ల అతనికి ప్రత్యేకశ్రద్ధ కలిగింది. ఎందుకంటే భగవానుడు ఇక్కడే అనుత్తర సమ్యక్సంబోధిని పొందాడు. అందువలన అతడు బోధివృక్షానికి అత్యంతవిలువైన వజ్రాలను కానుకగా పంపాడు.

అశోకునికి తిష్యరక్షిత అనే పట్టపురాణి ఉండేది. ఆమెకు "రాజు నాతో సుఖిస్తూ, విలువైన వజ్రాలను బోధివృక్షానికి పంపుతున్నాడే" అని ఈర్ష్య లిగింది. ఆమె మాతంగిని పిలిపించి "నీవు నా సవతియైన బోధివృక్షాన్ని చంపగలవా?" అన్నది. "చంపగలను కాని కార్షాపణాలు ఇవ్వాలి" అన్నది.

మాతంగి బోధివృక్షం వద్ద మంత్రాన్ని జపించి, దాని చుట్టూ దారాన్ని కట్టింది. బోధివృక్షం మొత్తం ఎండిపోసాగింది. సేవకులు "దేవా! బోధివృక్షం ఎండిపోతుంది" అని రాజుకు విషయాన్ని తెలియజేస్తూ

"ఎక్కడ కూర్చుండి తథాగతుడు
లోకక్షేమంకరమైన సర్వజ్ఞత్వాన్ని పొందాడో,
ఓ నరేంద్రా! ఆ బోధివృక్షం మరణించనున్నది" అన్నారు.

విని రాజు మూర్ఛితుడై భూమిపై పడిపోయాడు. చన్నీరు చల్లిన తర్వాత తేరుకొని, కొంచెం తెలివి వచ్చిన తర్వాత ఇలా అన్నాడు –

"ఆ వృక్షరాజాన్ని చూచినపుడల్లా నేను
స్వయంభూ అయిన భగవానుని చూచినట్లే తలంచాను.
భగవానుని ఆ వృక్షం చనిపోతే నేను కూడా చనిపోతాను."

రాజు శోకార్తుడై ఉండటం చూచి తిష్యరక్షిత "దేవా! బోధి లేకపోతే ఏమి? నేను దేవరవారిని సుఖింపజేయనా!" అన్నది. రాజు "అది స్త్రీకాదు. భగవానుడు దేనిక్రింద అనుత్తర సమ్యక్సంబోధిని పొందాడో ఆ బోధివృక్షం" అన్నాడు. తిష్యరక్షిత మాతంగిని

పిలిపించి "బోధివృక్షాన్ని ఎప్పటిలా మార్చగలవా?" అన్నది. మాతంగి "దానిలో ఏమాత్రం ప్రాణం మిగిలి ఉన్నా ఎప్పటిలా మార్చగలను" అన్నది.

ఆమె దాని చుట్టూ కట్టిన దారాన్ని విప్పి, వృక్షం చుట్టూ త్రవ్వించి, రోజుకు వేయి పాలకుండలచే తడిపించింది. కొంతకాలానికి వృక్షం యథాస్థితికి చేరుకుంది.

రాజపురుషులు అశోకునితో "దేవా! శుభవార్త! బోధివృక్షం యథాస్థితికి చేరుకుంది" అన్నారు. రాజు అపరిమితమైన ఆనందంతో బోధివృక్షాన్ని చూస్తూ ఇలా అన్నాడు –

"బింబిసారాది పార్థివేంద్రులు చేయని
సత్కార్యాలను రెంటిని నేను చేస్తాను.
బోధివృక్షానికి కుండలకొలది సుగంధ
జలాలతో స్నానం చేయిస్తాను.
పాంచవార్షిక ఉత్సవాలను నిర్వహించి
సంఘాన్ని సత్కరిస్తాను."

అప్పుడు రాజు బంగారు, వెండి, స్ఫటికమయమైన వేయి కుండలను సుగంధజలాలతో నింపాడు. పెద్దమొత్తంలో అన్నపానాలను సిద్ధం చేయించాడు. రాశులకొలది గంధమాల్యపుష్పాలను సేకరించాడు. స్నానం చేసి, శుభ్రమైన కొత్తబట్టలను వేసుకొని, అష్టశీలాలను పాటిస్తూ ఉపోసథాన్ని అవలంబించాడు. అప్పుడు ఒక చిన్న చెంచాతో అగరుని తీసుకొని తన నివాసపు పైకప్పు మీదికి పోయి, అన్ని దిక్కులకూ తిరుగుతూ తన మీద అనుగ్రహంతో సమావేశానికి రావాలని  బుద్ధుని శ్రావకులను ప్రార్థించాడు –

"కామదోషాలను జయించినవారు,
శాంతేంద్రియులు అయిన సుగతుని శిష్యులు
ఒకచోట చేరుదురుగాక! నరులచే,
దేవతలచే పూజింపదగినవారు, సమ్మానార్హులూ
నన్ననుగ్రహించి వత్తురుగాక!
ముక్తసంగులూ, ప్రశాంతిలో,

ఆత్మనిగ్రహంలో ఆనందించేవారూ,
ఆర్యులని అసుర, దేవ, మానవులచే స్తుతింపబడినవారూ,
అయిన సుగతధర్మరాజపుత్రశ్రేష్ఠులు నన్ననుగ్రహించి వత్తురుగాక!
రమ్యమైన కాశ్మీరపురంలో నివసించేవారూ,
అంధవనంలో నివసించే ధీరులూ,
మహావనంలో, రేవతకంలో నివసించేవారూ
నన్ననుగ్రహించి వత్తురుగాక!
అనవతప్తసరోవరం వద్ద నివసించేవారూ
పర్వతాలవద్ద, సెలయేళ్ల వద్ద, కొండగుహలలో
నిరంతర ధ్యానమగ్నులై యుండేవారూ
అయిన జినసుతులు దయతో నేడు
ఇక్కడకు చేరుకొందురు గాక!
శైరీషకమనే శ్రేష్ఠభవనంలో నివసించేవారూ,
శోకరహితులూ అయిన వాదిశ్రేష్ఠుని పుత్రులు
నన్ననుగ్రహించటానికి కరుణామానసులై
ఇక్కడకు వత్తురుగాక!
గంధమాదనపర్వతంపై నివసించే మహాతేజోమూర్తులు
ఈ ఆహ్వానాన్ని మన్నించి, కరుణతో
ఇక్కడకు వత్తురుగాక!"

రాజు ఇలా పలుకగానే మూడువందల వేల భిక్షువులు అక్కడకు చేరారు. వారిలో ఒక వందవేలు అర్హత్తులు. రెండువందలవేలు శైక్ష్యులూ, కల్యాణకారులైన పృథగ్జనులు. వారెవ్వరూ వృద్ధాసనంలో (స్థవిరాసనంలో) కూర్చోలేదు. రాజు వారిని "మీలో ఎవ్వరూ వృద్ధాసనంలో ఎందుకు కూర్చోలేదు" అని అడిగాడు. వారిలోనుండి షడభిజ్ఞలను పొందిన యశుడనే పేరుగల భిక్షువు ఇలా అన్నాడు – "మహారాజా! అది వృద్ధాసనం" అన్నాడు. రాజు "మీకన్న వృద్ధులైన వారు ఉన్నారా?" అన్నాడు. స్థవిరుడు "ఉన్నారు మహారాజా! సింహనినాదులలో శ్రేష్ఠుడని బుద్ధునిచే చెప్పబడిన పిండోలభరద్వాజుని అగ్రాసనం అది" అన్నాడు.

అప్పుడు రాజు సంతోషంతో కదంబపుష్పంవలె శరీరం రోమాంచితం కాగా "బుద్ధుని చూచిన భిక్షువు ఇంకా జీవించి ఉన్నాడా?" అన్నాడు.

స్థవిరుడు "ఉన్నాడు మహారాజా! బుద్ధుని చూచిన పిండోలభరద్వాజుడనే భిక్షువు ఇప్పటికీ జీవించి ఉన్నాడు."

రాజు "నేను అతన్ని చూడగలనా?" అన్నాడు.

స్థవిరుడు "మహారాజా! ఇక్కడే చూస్తారు. అతడు వచ్చే వేళయింది" అన్నాడు. రాజు ప్రీతిమనస్కుడై ఇలా అన్నాడు –

"ఆ భరద్వాజగోత్రుని, ఉదారసత్త్వుని దర్శించి
నేనిక్కడ సాటిలేని లాభాన్ని,
అనుత్తర ఉత్తమసుఖాన్ని
పొందనున్నాను."

రాజు చేతులుజోడించి ఆకాశంవేపు చూపు నిలిపి నిలబడ్డాడు. అప్పుడు అనేకవేల అర్హతులు అర్ధచంద్రాకారంలో తనను పరివేష్ఠించియుండగా, పిండోలభరద్వాజుడు రాజహంసలా గగనతలంనుండి దిగి వృద్ధాసనంలో కూర్చున్నాడు. పిండోలభరద్వాజ స్థవిరుని చూచి ఆ వేలభిక్షువులు లేచినిలబడ్డారు. అశోకుడు కూడా పిండోలభరద్వాజుని చూశాడు. తెల్లని కేశాలతో అతని శిరస్సు పండిపోయింది. పొడవైన కనుబొమ్మల వెంట్రుకలు క్రిందికిజారి కన్నులను కప్పివేశాయి. అతని శరీరం ప్రత్యేకబుద్ధునిలా ఉంది. చూచి రాజు వ్రేళ్లనుండి పడిపోయిన చెట్టులా సర్వశరీరంతో పిండోలభరద్వాజుని పాదాలపై పడిపోయాడు. అతని పాదాలను ముద్దుపెట్టుకొని లేచి వీరాసనంలో భూమిపై కూర్చుండి అంజలిపట్టి పిండోలభరద్వాజ స్థవిరుని చూస్తూ ఇలా అన్నాడు –

"శత్రువులను చంపి, సముద్రాన్ని అలంకారంగా కలిగిన
పర్వతసహిత భూమండలాన్ని ఏకపాత్రగా పొందినపుడు కూడా
స్థవిరుని చూచినప్పుడు కలిగినంత సంతోషం కలుగలేదు" అని స్థవిరునితో –

"మీ దర్శనం వలన నేడు నేను తథాగతుని చూచినవాడనైనాను. మీరు దయతో స్వయంగా దర్శనమివ్వటం నా ఆనందాన్ని రెండింతలు చేసింది. అయితే స్థవిరోత్తమా!

మీరు త్రైలోక్యనాథుడు, నా గురువు అయిన బుద్ధభగవానుని చూశారా?" అన్నాడు. స్థవిర పిండోలభారద్వాజుడు రెండు చేతులతో తన కనుబొమలవెంట్రుకలను పైకెత్తి, రాజు అశోకుని చూస్తూ ఇలా అన్నాడు –

"ద్వాత్రింశ మహాపురుషలక్షణాలంకృతుడు
శరత్కాలచంద్రవదనుడు, తప్తకాంచనతేజోవంతుడు,
అనుపముడు, క్లేశముక్తుడు,
బ్రహ్మస్వరాన్ని అతిక్రమించినవాడు
అయిన మహర్షిని నేను చూచాను."

రాజు ఇలా అన్నాడు – "స్థవిరోత్తమా! మీరు భగవానుని ఎక్కడ చూశారో చెప్పండి" స్థవిరుడు ఇలా అన్నాడు – "మహారాజా! భగవానుడు మారపరివారాన్ని గెలిచి, అయిదువందలమంది అర్హతులతో మొదటిసారి రాజగృహానికి వచ్చి, వర్షావాసాన్ని గడిపినపుడు నేను అక్కడే ఉన్నాను. దక్షిణార్హుడైన అతన్ని నేను చక్కగా చూశాను." ఇంకా

వీతరాగుడై, వీతరాగులచే పరివేష్ఠింపబడిన
మహాముని, తథాగతుడు రాజగృహంలో
వర్షావాసం చేస్తూండగా నేను
అక్కడే, ఆ సంబుద్ధుని ప్రక్కనే ఉన్నాను.
ఆ ముని నన్నూ, నేను ఆయననూ చూసుకున్నాము.

ఇంకా మహారాజా! భగవానుడు శ్రావస్తిలో తైర్థికులను గెలవటానికి మహాప్రాతిహార్యాన్ని చేస్తూ అకనిష్ఠలోకం వరకు బుద్ధప్రతిమలను సృష్టించినపుడు నేను అక్కడే ఉన్నాను. నేను ఆ బుద్ధలీలను చూశాను. అంతేకాదు

భగవానుడు బుద్ధిప్రభావాన్ని చూపి, చెడుమార్గంలో ఉన్న తైర్థికులను నిగ్రహించినపుడు ఓ రాజా! నేను ప్రజలకు ఆనందాన్ని కలిగించిన ఆ దశబలుని ఆ క్రీడను చూశాను.

మహరాజా! భగవానుడు త్రయస్త్రింశ దేవలోకంలో వర్షావాసాన్ని గడిపి, జన్మనిచ్చిన తల్లికి ధర్మోపదేశం చేసి, దేవగణాలతో ఆవరింపబడి సంకాశ్యనగరంలో

దిగినపుడు నేను అక్కడే ఉన్నాను. అక్కడ దేవమానవ వైభవాలను, ఉత్పలవర్ణ నిర్మించిన చక్రవర్తి వైభవాన్ని తిలకించాను.

"వాదిశ్రేష్ఠుడు దేవలోకంలో వర్షావాసాన్ని గడిపి
మానవలోకానికి దిగివస్తూన్నపుడు
అతిసమీపంనుండి అగ్రసత్త్వుడైన
ఆ మహామునిని చూశాను."

మహారాజా! అనాథపిండకుని కూతురు సుమగధ అయిదువందల అర్హతులతో భగవానుని ఆహ్వానించినపుడు ఆయన బుద్ధిశక్తితో పర్వతశైలాన్ని గ్రహించి, ఆకాశమార్గంలో పుండవర్ధనానికి వెళ్లాడు. ఆ సమయంలో భగవానుడు 'ఈ లోకంలో ధర్మం ఉన్నంతవరకు పరినిర్వాణాన్ని పొందవద్దని' నాకు చెప్పాడు. ఇంకా

"నాయకుడు, గురువు బుద్ధిబలంతో
సుమగధ ఆహ్వానంపై పుండ్రవర్ధనానికి పోయినపుడు
నేను బుద్ధిబలంతో ఒక పర్వతాన్ని చీరి, దానిపై కూర్చుండి
శీఘ్రంగా అతన్ని అనుసరించి,
పుండవర్ధనానికి వెళ్లాను.
అక్కడ ఆ శాక్య కులోత్పన్నుడు, ఆ కారుణికుడు నన్ను
ధర్మం అంతర్హితం కానంతవరకు నిర్వాణం పొందవద్దని ఆజ్ఞాపించాడు."

ఇంకా మహారాజా! మీరు పూర్వం బాలభావంతో భగవానుడు రాజగృహంలో భిక్షకై ప్రవేశిస్తూన్నపుడు 'పిండిని ఇస్తున్నాను' అనే భావంతో భగవానుని పాత్రలోకి దుమ్మును ఇవ్వగా రాధాగుప్తుడు దానిని అనుమోదించినపుడు, మీ గురించి భగవానుడు నేను పరినిర్వాణం చెందిన నూరేండ్లకు ఈ బాలుడు పాటలీపుత్రనగరంలో అశోకుడనే రాజుగా పుట్టి, చతుర్భాగచక్రవర్తియై, 'ధార్మికుడు', 'ధర్మరాజు' అని పేరు వహించి, నా శారీరకధాతువులను విస్తరింపజేసి, ఎనుబదినాలుగువేల ధర్మరాజిక స్తూపాలను నిర్మిస్తాడని చెప్పినపుడు నేను అక్కడే ఉన్నాను.

"మీరు బాలభావంతో బుద్ధుని పాత్రలో
దుమ్మును దానంగా వేసినపుడు

నేను అక్కడే ఉన్నాను" అన్నాడు.

అశోకుడు "స్థవిరోత్తమా! మీరు ఇప్పుడు ఎక్కడ ఉంటున్నారు?" అన్నాడు.

"సరోవరరాజానికి ఉత్తరంగా గంధమాదనపర్వతంపై
ఓ నృపేంద్రా! సబ్రహ్మచారులతో కలిసి నివసిస్తున్నాను."

రాజు "ఎందరు అనుచరులతో నివసిస్తున్నారు?" అన్నాడు.

"ఓమానవేంద్రా! కల్మషరహితులూ,
ప్రాపంచిక విషయాలపట్ల స్పృహ లేనివారూ అయిన
అరువదివేల మంది అర్హతులతో కలిసి నివసిస్తున్నాను."

అయినా మహారాజా! ఈ ప్రశ్నలెందుకు? భిక్షుసంఘానికి భోజనం ఇవ్వాలి. వారు భుజించిన తర్వాత నేను వారినుద్దేశించి రెండు మాటలు మాట్లాడతాను."

"అలాగే! స్థవిరులు ఆజ్ఞాపించినట్లే జరుగుగాక! కాని బుద్ధమూర్తికి ప్రతిరూపమైన బోధివృక్షానికి నేను స్నానం చేయించాలి. ఆ వెంటనే భిక్షుసంఘానికి ఇష్టమైన భోజనం పెడతాను"

అప్పుడు రాజు ఉద్ఘోషకుడు సర్వమిత్రుని పిలిచి "నేను ఆర్యసంఘానికి లక్షబంగారునాణాలు ఇవ్వాలనుకుంటున్నాను. అలాగే వేయికుండల సుగంధజలంతో బోధివృక్షానికి స్నానం చేయించాలనుకుంటున్నాను. నా పేరుతో ఈ పంచవార్షిక ఉత్సవాన్ని ప్రకటించు!" అన్నాడు.

అప్పటికి కునాలుని (కుణాలుడు కాదు) కండ్లు బాగానే ఉన్నాయి. అతడు రాజుకు కుడిప్రక్కన కూర్చున్నాడు. అతడు రెండు వ్రేళ్లను లేపి 'తాను అంతకు రెండింతలు ఇస్తా'నని ప్రకటించాడు. చేతిసైగతో దక్షిణను పెంచిన కునాలుని చూచి, అక్కడున్నవారందరూ నవ్వారు.

రాజు కూడా నవ్వి "ఓ రాధాగుప్తా! కానుకను ఎవరు పెంచారు?" అన్నాడు.

రాధాగుప్తుడు "దేవా! పుణ్యార్థులైన ప్రాణులెవరో పెంచారు" అన్నాడు.

"సరే! అలాగయితే నేను మూడులక్షల బంగారునాణాలను ఇస్తాను. వేయికుండల సుగంధజలంతో బోధికి స్నానం చేయిస్తాను. నా పేరుతో పంచవార్షిక ఉత్సవాన్ని ప్రకటించు" అన్నాడు.

అప్పుడు కునాలుడు నాలుగువ్రేళ్లను లేవనెత్తాడు. రాజు రోషంతో "రాధాగుప్తా! లోకజ్ఞానం లేకుండా నాతో పోటీపడుతున్నది ఎవరు?" అన్నాడు. కోపించిన రాజును చూచి రాధాగుప్తుడు అతని పాదాలపైబడి ఇలా అన్నాడు – "దేవా! నరేంద్రులైన తమరితో పోటీపడగలవారెవరు? గుణవంతుడైన కునాలుడే తండ్రితో పోటీపడుతున్నాడు." అప్పుడు రాజు కుడివైపున కూర్చునియున్న కునాలుని చూచి ఇలా అన్నాడు – "స్థవిరోత్తమా! నేను కోశాగారం ఒక్కటి తప్ప, రాజ్యాన్ని, అంతఃపురాన్ని, అమాత్యగణాన్ని, నన్ను, కునాలుని ఆర్యసంఘానికి సమర్పించుకుంటున్నాను.'' చందనం, కుంకుమ, కర్పూరవాసనలుగల పాలతో, స్వర్ణ, రజత, స్ఫటిక, వైడూర్యమయమైన అయిదువేల కుండలలో నింపబడిన నానాసుగంధజలాలతో బోధికి స్నానం చేయిస్తాను. శతసహస్ర పుష్పాలను బోధిప్రముఖ ఆర్యసంఘానికి సమర్పిస్తాను. నా పేరుమీద ఈ పంచవార్షిక ఉత్సవాన్ని ప్రకటించండి!

"కోశమొక్కటితప్ప, సమృద్ధమైన రాజ్యాన్ని,
పురాన్ని, అమాత్యగణం అంతటినీ,
నన్నూ, గుణవంతుడైన కునాలునీ
పుణ్యక్షేత్రమైన సంఘానికి అర్పించుకుంటున్నాను" అన్నాడు.

పిండోల భరద్వాజుడు ప్రముఖుడుగాగల భిక్షుసంఘానికి ఈ విధంగా దానాన్ని అర్పించి, రాజు బోధివృక్షానికి నాలుగువేపులా వేదికను నిర్మింపజేసి, తాను స్వయంగా దానిపైకెక్కి, నాలుగువేలకుండల పాలతో బోధికి స్నానం చేయించాడు. స్నానం చేయించినవెంటనే వృక్షం ఎప్పటిలా మారిపోయింది. ఇలా చెప్పబడింది –

"నరపతి బోధివృక్షానికి స్నానం చేయించినంతనే
బోధివృక్షం కోమలమైన పచ్చని చిగుళ్లను వేసింది.
పచ్చనికోమలమైన చిగుళ్లను చూచి రాజు

అమాత్యగణమూ, పౌరులతోపాటు
అంతులేని హర్షాన్ని పొందాడు."

అప్పుడు రాజు బోధికి స్నానం చేయించి భిక్షుసంఘాన్ని భుజింప చేయాలనుకున్నాడు. అప్పుడు యశుడనే స్థవిరుడు ఆయనతో ఇలా అన్నాడు – "మహారాజా! ఉన్నతమైన దక్షిణకు అర్హమైన ఆర్యసంఘం కూర్చుండి ఉంది. ఎటువంటి కొరతలేకుండా వారిని భుజింపజేయండి."

రాజు స్వయంగా పూనుకొని వృద్ధభిక్షువులు మొదలుకొని, క్రొత్తవారివరకు అందరికీ వడ్డించాడు. ఒకచోట ఇద్దరు శ్రామణేరులు స్నేహంతో ఒకరికొకరు ఆహారపదార్థాలను ఇచ్చుకోవటం చూశాడు. ఒకరు పిండిని ఇస్తే రెండవవ్యక్తి కూడా పిండిని ఇస్తున్నాడు. ఒకరు ఖాద్యాన్ని ఇస్తే రెండవవ్యక్తి కూడా ఖాద్యాన్ని ఇస్తున్నాడు. ఒకరు కుడుమును ఇస్తే రెండవవ్యక్తి కూడా కుడుమును ఇస్తున్నాడు. వారిని చూచి రాజు "ఈ శ్రామణేరులు పిల్లలాటలు ఆడుకుంటున్నారు" అని నవ్వుకున్నాడు.

మొత్తం సంఘానికి వడ్డించి, వృద్ధులవద్దకు వచ్చాడు. స్థవిరుడు "మహారాజా! మీకేదైనా అసంతోషాన్ని కలిగించిందా?" అన్నాడు.

రాజు "లేదు. కాని అక్కడ ఇద్దరు శ్రామణేరులు పిల్లలు మట్టితో ఇళ్లు కట్టుకొని ఆడుకుంటున్నట్లుగా ఆడుకుంటున్నారు" అన్నాడు.

స్థవిరుడు "అలా అనవద్దు. మహారాజా! వారు ఉభతోభాగముక్తులైన (శారీరకమైన, మానసికమైన క్లేశాలు పోయిన) అర్హతులు" అన్నాడు.

విని రాజు సంతోషపడ్డాడు. సంఘానికి ఇవ్వాలనుకున్న చీవరదానాన్ని ఆ ఇద్దరు శ్రామణేరులతో ఆరంభించాలనుకున్నాడు. వెంటనే ఆ శ్రామణేరులు రాజు ఉద్దేశాన్ని తెలుసుకొని 'అతని పుణ్యాన్ని ఇంకా పెంచుదాం' అనుకొని ఒకరు పాత్రను తేగా ఇంకొకరు రంగును సిద్ధం చేయసాగారు.

శ్రామణేరులను రాజు "దేనికోసం ఈ ప్రయత్నం" అని అడిగాడు. వారు "దేవరవారు మాతో మొదలుపెట్టి భిక్షుసంఘానికి చీవరదానం చేయాలనుకున్నారు. అందుకే ఆ చీవరాలను రంగులో ముంచుతున్నాం" అన్నారు.

విన్న రాజు "నేను కేవలం మనస్సులో అనుకున్నాను. మాటలతో చెప్పలేదు. వీరు పరుల చిత్తాన్ని గ్రహించే మహాత్ములు" అనుకొని సర్వశరీరంతో వారి పాదాలమీదపడి అంజలిపట్టి ఇలా అన్నాడు –

"ఇటువంటి సాధుజనులు
సంతోషించటం వలన తేలికగా దొరికే
పుణ్యంకోసమే మౌర్యుడు
తన భృత్యులు, స్వజనులు,
పౌరులతో, ఈ దానయజ్ఞాన్ని చేశాడు."

రాజు "మీతోనే ఆరంభించి నేను భిక్షుసంఘానికి త్రిచీవరాలను కప్పాలనుకున్నాను" అన్నాడు. అప్పుడు రాజు అశోకుడు పంచవార్షికాన్ని ముగిస్తూ భిక్షువులందరిని మూడు చీవరాలతో కప్పి, నాలుగులక్షల బంగారునాణాలను సంఘానికి దానం చేసి, భూమిని, అంతఃపురాన్ని, మంత్రిగణాన్ని, తనను, కునాలుని విడిపించుకున్నాడు. భగవానుని శాసనంలో అతని శ్రద్ధ మరింతగా పెరిగింది.

# కునాలుని కథ

రాజు అశోకుడు ఎనుబదినాలుగువేల ధర్మరాజికలను ప్రతిష్ఠాపించిననాడే అశోకరాజు భార్య పద్మావతీదేవి పుత్రుని ప్రసవించింది. అతడు రూపవంతుడు, చూడచక్కనివాడు, చూసేవారి కన్నులకు సంతోషాన్ని కలిగించేవాడు.

"దేవా! ఆనందరకమైన వార్త. తమరికి పుత్రుడు జన్మించాడు" అని రాజుకు చెప్పారు. రాజు "మౌర్యవంశ పరమప్రకాశమైన ధర్మంతో నేను రాజ్యం చేస్తూండగా పుత్రుడు జన్మించి నాకు గొప్పసుఖాన్ని కలిగించాడు. ఇతడు ధర్మాన్ని వృద్ధిపొందించేవాడు కావాలి కనుక ధర్మవివర్ధనుడని పేరుపెట్టండి" అన్నాడు.

కుమారుని రాజువద్దకు తెచ్చినపుడు రాజు కుమారుని చూచి, ప్రీతిమనస్కుడై –

"నా పుత్రుని కన్నులు అందమైనవి, శుభకరమైనవి,<br>
నీలికలువలవంటి కన్నులతో అలంకరింపబడి,<br>
అతని ముఖం సంపూర్ణచంద్రబింబంలా శోభిస్తూ ఉంది"

అనుకొని అమాత్యులను "ఇటువంటి కన్నులను మీరెప్పుడైనా చూశారా?" అని అడిగాడు. అమాత్యులు "దేవా! ఇటువంటి కన్నులుగల మనుష్యుని చూడలేదు. పర్వతరాజమైన హిమాలయంలో కునాలమనే పక్షి ఉంటుంది. ఇవి ఆ కునాలపక్షి కన్నుల్లా ఉన్నాయి" అన్నారు –

"హిమరాజగిరిశిఖరాలపై<br>
నీటిలో ప్రవాళపుష్పాలు పూసేచోట ఉండే<br>
కునాలపక్షి నేత్రాల్లాగా ఉన్నాయివి."

అప్పుడు రాజు "కునాలపక్షిని తీసుకురండి!" అన్నాడు.

అతని మాటను పైన యోజనం వరకు యక్షులూ, క్రింద యోజనం వరకు

నాగులూ విన్నారు. అప్పుడు యక్షులు వెంటనే కునాలపక్షిని తెచ్చారు. రాజు దానిని చాలాసేపు చూచి తన పుత్రుని కన్నులు అచ్చం కునాలపక్షి కన్నుల్లాగే ఉండటం గమనించాడు. అప్పుడు రాజు "కుమారుడు కునాలుడనే పేరు కలవాడగుగాక!" అన్నాడు.

అతని కన్నులమీది అనురాగంతో పృథ్వీపతి తన
కుమారుని కునాలుడని పిలిచాడు.
ప్రపంచమంతటా ఆ ఉత్తమసత్త్వుడు,
ఆ రాజతనయుడు అదే పేరుతో తెలియబడినాడు.

క్రమంగా యువరాజు పెరిగిన తర్వాత కాంచనమాల అనే కన్యతో వివాహం జరిగింది. ఒకనాడు అశోకుడు కునాలునితో కుక్కుటారామానికి వెళ్లాడు. అక్కడ అర్హతుడు, షడభిజ్ఞుడైన సంఘస్థవిరుడు యశుడు 'కుమారుని కళ్లు కొద్దికాలంలోనే పోతాయ'ని తెలుసుకున్నాడు.

అతడు రాజుతో "కునాలుని స్వకర్మలలో ఎందుకు ప్రవేశపెట్టలేదు?" అన్నాడు. రాజు "కునాలుడు తమరు ఆజ్ఞాపించినట్లుగా చేస్తాడు" అన్నాడు. కునాలుడు సంఘస్థవిరుని పాదాలపైబడి "స్థవిరోత్తమా! ఏమి ఆజ్ఞ" అన్నాడు. స్థవిరుడు "కునాలా! కన్నులు అనిత్యమని ధ్యానించు."

"కుమారా! చపలాత్మకమూ, వేల దుఃఖాలకు ఆకరమూ అయిన
ఈ కన్నులను నిరంతరం పరిశీలించు.
వాటిలో అనురక్తులైన అజ్ఞానులు
చెడ్డపనులెన్నో చేస్తారు" అన్నాడు.

అతడు దానినే అభ్యసిస్తూ, చింతన చేస్తూ. ఏకాంతంలో, శమంలో ఆనందిస్తూ గడుపసాగాడు.

ఒకనాడు అతడు రాజనివాసానికి దూరంగా ఏకాంతంలో కన్ను మొదలైన ఆయతనాలను పరిశీలించి వాటి అనిత్యాది లక్షణాలను చింతన చేస్తూ ఉన్నాడు, అప్పుడు అశోకుని పట్టపురాణి తిష్యరక్షిత అక్కడికి వచ్చి కునాలుని ఒంటరిగా చూచి ఆ కన్నులమీది అనురాగంలో అతన్ని కౌగలించుకొని –

"నయనాభిరామమైన నీ శరీరసంపదను,
ప్రకాశవంతమైన నీ నేత్రయుగళాన్ని చూచి
అగ్ని కారడవిని దహించునట్లుగా
నా హృదయం మదనాగ్నితో దహించుకొని పోతున్నది" అన్నది.

విని కునాలుడు రెండు చేతులతో చెవులను మూసుకొని –

"నేను మీకు కుమారుడను,
మీరు నాకు తల్లి.
అలాంటి మాటలను
నాతో మాట్లాడగూడదు.
అధర్మమార్గాన్ని వదలిపెట్టు!
అపాయమార్గానికి అదే కారణం" అన్నాడు.

తిష్యరక్షిత తనకు అవకాశం దొరుకకపోవటం వలన కోపంతో ఇలా అన్నది –

"కోరికతో వచ్చిన నన్ను తిరస్కరించావు.
ఓ దుర్బుద్ధీ! నీకు కాలం మూడింది."

కునాలుడు –

"అటువంటి పని సజ్జనులతో ధిక్కరింపబడి,
స్వర్గానికి కొనిపోయే ధర్మాన్ని చెరుపుతుంది.
సజ్జనులు ఛీత్కరించే పని చేసి బ్రతకటం కన్న
తల్లీ! ధర్మంలో విశుద్ధభావంతో నిలిచి
చనిపోవటమే మంచిది" అన్నాడు.

అప్పటినుండి తిష్యరక్షిత 'కునాలుని ఎలా శిక్షింపజేయాలా' అని అతని తప్పులకోసం వెదకసాగింది.

రాజు అశోకునికి విరుద్ధంగా ఉత్తరాపథంలో తక్షశిల తిరుగుబాటు చేసింది. అది విన్న రాజు తానే పోవాలనుకున్నాడు. మంత్రులు "దేవా! కుమారుని పంపండి" అన్నారు.

అప్పుడు రాజు కునాలుని పిలిచి ఇలా అన్నాడు – "వత్సా! ఎదురు తిరిగిన తక్షశిలానగరాన్ని అణచటానికి నీవు అక్కడికి పోవాలి."

కునాలుడు "దేవా! వెళతాను" అన్నాడు.
తన మనోరథాన్ని గుర్తెరిగిన పుత్రుని
రాజు దగ్గరకు పిలుచుకొని,
వాత్సల్యపూర్ణమైన మనస్సుతో
విహారయాత్రకు ఆజ్ఞాపించాడు.

రాజు అశోకుడు నగరాన్ని, మార్గాన్ని అలంకరింపజేసి, వృద్ధులను, రోగులను, దీనులను మార్గం నుండి తొలగించి, ఒకే రథంపై ఎక్కి కుమారునితోపాటు పాటలీపుత్రంనుండి బయలుదేరాడు. వీడ్కోలు చెప్పివచ్చేటపుడు కుమారుని కంఠాన్ని కౌగలించుకొని కన్నులను చూస్తూ –

"కుమారుని ముఖపద్మాన్ని చూస్తూ
ఇటువంటి కన్నులను నిరంతరం
దర్శించే చక్షుష్మంతులు ధన్యులు" అన్నాడు.

జ్యోతిష్యబ్రాహ్మణుడొకడు కొద్దికాలంలోనే కుమారుని కన్నులు పోతాయని గ్రహించి, ఆ కండ్లపట్ల ఎంతో అనురక్తితో ఉన్న అశోకరాజును చూచి –

"మహీపతి అనురక్తుడైన
సుఖానుకూలమైన, సంపత్కరమైన
ఆ నేత్రాలు త్వరలోనే నశిస్తాయి.
కుమారుని చూస్తూ సంతోషంతో
స్వర్గంలా ఉన్న ఈ పట్టణం
ఆ విషాదాన్ని చూడలేక
శోకంలో మునిగిపోతుంది" అన్నాడు.

కునాలుడు క్రమంగా ప్రయాణం చేసి తక్షశిలను చేరుకున్నాడు. తక్షశిలాపౌరులు మూడున్నరయోజనాల దూరం దారిని, నగరాన్ని అలంకరించి పూర్ణకుంభాలను తీసుకొని ఎదురుపోయారు.

విన్న తక్షశిలాపౌరులు రత్నపూర్ణఘటాలను తీసుకొని
బహుమాన్యుడైన కుమారునికి ఎదురుపోయారు.

ఎదురుపోయి అంజలిపట్టి "మేము కుమారునికిగాని, రాజు అశోకునికిగాని వ్యతిరేకులం కాము. కాని దుష్టులైన అమాత్యులు మమ్ములను అవమానించారు" అని, వారు కునాలుని మహాగౌరవంతో తక్షశిలలో ప్రవేశింపజేశారు.

అశోకరాజుకు గొప్పవ్యాధి కలిగింది. అతనికి నోటినుండి మలం రాసాగింది. అన్ని రోమకూపాలనుండి అశుచి ప్రవహించసాగింది. వైద్యులు దానికి చికిత్స చేయలేకపోయారు. రాజు "కునాలుని పిలిపించి, రాజును చేస్తాను. ఇటువంటి బ్రతుకువలన ప్రయోజనమేమి?" అన్నాడు.

అదివిన్న తిష్యరక్షిత 'కునాలుడు రాజయితే నన్ను బ్రతకనివ్వడు' అనుకొని, రాజుతో "నేను మిమ్ములను బాగుచేస్తాను కాని వైద్యులనెవ్వరినీ దగ్గరికి రానీయవద్దు" అన్నది. అలాగే అన్నాడు రాజు. అప్పుడు తిష్యరక్షిత వైద్యులతో "ఎవరైనా స్త్రీగాని, పురుషుడుగాని రాజువ్యాధివంటి వ్యాధితో బాధపడేవారు మీ దృష్టికి వస్తే నాకు చూపించండి" అన్నది.

ఒకానొక గొల్లవానికి అటువంటి వ్యాధి సోకింది. అతని భార్య వైద్యులకు ఆ వ్యాధిని గురించి తెలిపింది. వైద్యుడు "అతడు వస్తే వ్యాధిని పరీక్షించి వైద్యం చేస్తాను" అన్నాడు. గొల్లవాడు వైద్యునివద్దకు వచ్చినంతనే, వైద్యుడు తిష్యరక్షిత వద్దకు అతనిని తీసుకుపోయాడు. తిష్యరక్షిత వానిని ఒక రహస్యమైన స్థలానికి తీసుకొనిపోయి చంపించి, కడుపును తెరచి అతని జీర్ణకోశాన్ని చూసింది. పేగులలో ఒక పెద్దక్రిమి కనిపించింది. అది పైకిపోతే అశుచి దానితో పైకి పోతుంది. అది క్రిందికి పోతే క్రిందికి పోతుంది. దానిపై మిరియాలను ప్రయోగించింది కాని వానితో అది చనిపోలేదు. పిప్పళ్లను, సొంఠిని ప్రయోగించి చూసింది అయినా చనిపోలేదు. చివరకు ఉల్లిగడ్డను వాడగా దాని స్పర్శకు చనిపోయింది, ఈ విషయాన్ని ఆమె రాజుకు తెలిపి "దేవా! ఉల్లిగడ్డను తినండి, ఆరోగ్యవంతులౌతారు" అని నివేదించింది. రాజు "దేవీ! నేను క్షత్రియుడను. ఉల్లిగడ్డను ఎలా తినగలను?" అన్నాడు. రాణి "దేవా! ప్రాణాన్ని కాపాడుకోవటానికి మందుగా తినవచ్చును" అన్నది.

రాజు ఉల్లిగడ్డను తిన్నాడు. ఆ క్రిమి చనిపోయి, మలమార్గంద్వారా బయటకు పోయింది. రాజు ఆరోగ్యవంతుడైనాడు. అందువలన రాజు సంతుష్టుడై తిష్యరక్షితకు వరం ఇవ్వాలనుకొని “నీకే వరం కావాలి” అన్నాడు. ఆమె “దేవా! వారం వరకు నేను రాజ్యాన్ని పాలిస్తాను” అన్నది. మరి “నేనేమౌతాను” అన్నాడు రాజు. “వారం తర్వాత మీరే రాజౌతారు” అన్నది తిష్యరక్షిత.

రాజు తిష్యరక్షితకు వారం పాటు రాజ్యాన్ని ఇచ్చాడు. ఆమె ‘నేనో, కునాలుడో ఏదో ఒకటి తేలిపోవాలి’ అనుకున్నది. అప్పుడు ‘కునాలుని కళ్లను పెరికివేయాలని’ తక్షశిలా పౌరులకు  ఒక కపటపు లేఖను వ్రాసింది.

“బలవంతుడు, ప్రచండుడు అయిన రాజు అశోకుడు
తక్షశిలాజనాన్ని ఆజ్ఞాపిస్తున్నాడు,
నా శత్రువు, వంశాన్ని కళంకితం చేసినవాడూ అయిన
కునాలుని కళ్లను పెరికివేయండి!”

ఏదైనా పని త్వరగా కావాలనుకున్నపుడు రాజు అశోకుడు పత్రంపై తన పండ్లతో ముద్రవేసి పంపుతాడు. ఆ రాత్రి తిష్యరక్షిత రాజు నిద్రించినపుడు దంతముద్రను తీసుకోవటానికి అశోకునివద్దకు పోయింది. కాని అశోకుడు ఎందుకో భయపడి నిద్రలేచాడు. “దేవా! ఏమైంది” అని అడిగింది తిష్యరక్షిత.

“ఓ రాణీ! నాకొక పీడకల వచ్చింది. అందులో రెండు గ్రద్ధలు కునాలుని కళ్లను పెరికివేయాలని ప్రయత్నిస్తున్నాయి” అన్నాడు.

“కుమారునికి శుభమగుగాక” అన్నది తిష్యరక్షిత.

రాజు మరల నిద్రపోయాడు. కాని రెండవసారి కూడా భయపడి లేచి అతడు “రాణీ! మళ్లీ నేను మంచి కలను చూడలేదు” అన్నాడు.

“ఏమి కల చూశారు?” అన్నది రాణి.

“నేను కునాలుని చూశాను. అతడు పెద్దవెంట్రుకలూ, గడ్డంతో, పొడవైనగోళ్ళతో నగరంలో ప్రవేశిస్తున్నాడు” అన్నాడు రాజు.

రాణి “కుమారునకు శుభమగుగాక” అన్నది.

రాజు మళ్లీ నిద్రపోయాడు. తిష్యరక్షిత నిద్రించిన రాజు దంతముద్రలను లేఖపై తీసుకొని దానిని తక్షశిలకు పంపించింది. నిద్రలో రాజు తన దంతాలు ఊడిపోతున్నట్లు మళ్లీ స్వప్నాన్ని చూశాడు.

ఆ రాత్రి గడిచిన తర్వాత రాజు జ్యోతిష్కులను పిలిపించి "ఈ విధమైన స్వప్నాలకు ఎటువంటి ఫలితం ఉంటుంది?" అన్నాడు. జ్యోతిష్కులు "దేవా! ఇటువంటి స్వప్నాలను చూసినవారి కుమారుని కళ్లు పెరికివేయబడతాయి" అన్నారు. ఇంకా వారు

"స్వప్నంలో ఎవరి దంతాలు ఊడిపడిపోతాయో వారి
పుత్రుని కళ్లు పెరికివేయబడతాయి.
ఇది పుత్రనాశనాన్ని సూచిస్తుంది" అన్నారు.

విన్న రాజు అశోకుడు వెంటనే ఆసనంనుండి లేచి నాలుగుదిక్కులా దేవతలకు అంజలిఘటించి యాచిస్తూ –

"శాస్త్రపట్ల, ధర్మంపట్ల, గుణప్రధానమైన సంఘంపట్ల శ్రద్ధగల
దేవతలందరూ, లోకంలోని ఉత్తమ ఋషులందరూ
నా తనయుడు కునాలుని రక్షింతురుగాక!" అన్నాడు.

ఆ లేఖ క్రమంగా తక్షశిలకు చేరుకుంది. పౌరులు, జానపదులూ ఆ లేఖను చూసినప్పటికీ కునాలుని ఉత్తమగుణాలతో సంతుష్టులై ఉండటం వలన వెంటనే అప్రియం పలుకటానికి ఉత్సాహం చూపలేదు. ఎట్టకేలకు "రాజు చండుడు, దుశ్శీలుడు, తన స్వంతకుమారునే క్షమించనివాడు, మనలను క్షమిస్తాడా?" అనుకొని –

"మునివృత్తికలవాడు, శాంతుడూ, సకలప్రాణి హితాభిలాషీ
అయిన కుమారుని ద్వేషించేవారు
ఇతరులను ద్వేషించకుండా ఎలా ఉండగలరు?" అన్నారు.

అప్పుడు వారు విషయాన్నంతా కునాలునికి తెలియజేశారు. లేఖను తెప్పించారు. కునాలుడు దానిని చదివించుకొని విని శాంతంగా "మీకు ఏది మేలనుకుంటే అది చేయండి" అన్నాడు. కునాలుని కళ్లను తీయటానికి చండాలురు పిలిపించబడ్డారు. వారు చేతులు జోడించి "మేము ఈ పని చేయలేము.

చంద్రునివంటి ముఖంనుండి కళ్లను పెకిలించి,
ఈ ముఖంలోని చంద్రకాంతిని ఏ మూఢనరుడు తొలగించగలడు?" అన్నారు.

తన కళ్లను పెకిలిస్తే వారికి కుమారుడు కిరీటాన్ని ఇస్తానన్నాడు. 'అది తప్పక చెడువిపాకానికి దారితీస్తుంద'ని వారు ఒప్పుకోలేదు. చివరకు పద్దెనిమిది వంకలు గలవాడొకడు ముందుకు వచ్చి "నేను పెరికివేస్తాను" అన్నాడు. ఆ సమయంలో కునాలునికి స్థవిరుని మాటలు మనస్సులో నిలిచాయి. ఆ మాటలను స్మరించుకొని ఆయన ఇలా అన్నాడు –

"ఈ విపత్తిని తెలిసే కల్యాణమిత్రులు,
నా సుఖాన్ని కోరేవారు, హితైషులు
తత్త్వవాదులు, వీతక్లేశులైన మహాత్ములు
'ఇదంతా అనిత్యం, ఏదీ నిలకడగా ఉండదు' అని ధర్మాన్ని బోధించారు."

"అనిత్యతను చూస్తూ, గురూపదేశాన్ని స్మరించుకొని
మనస్సును చలింపనీయను. నేత్రాల అనిత్యతను గుర్తించిన నేను
వాటి పెరికివేతకు భయపడను. ఓ సౌమ్యా! రాజుయొక్క కోరికను
నెరవేర్చు. నా కండ్లు పెరికివేయబడినా బాధపడను. నేను
చక్షువులు అనిత్యానికి ఆశ్రయమని వాటి సారాన్ని తెలుసుకున్నాను."

అప్పుడు కునాలుడు ఆ పురుషునితో 'ఒక కంటిని పెరికి నా చేతిలో పెట్టు' అన్నాడు. అతడు కునాలుని కంటిని పెరుకటం ఆరంభించగానే శతసహస్రప్రాణులు

"అయ్యో! ఇది చాలా దుఃఖం!
నిర్మలకాంతితో వెలిగే చంద్రుడు ఆకాశంనుండి
పడిపోతున్నాడు. తామరపూలవనంనుండి
సుందరమైన తామర పెకిలించబడుతుంది" అని ఘోషించాయి.

ఆ శతసహస్రప్రాణులు ఏడుస్తూండగా కునాలుని నయనం పెకిలింపబడి అతని చేతిలో పెట్టబడింది. ఆ కంటిని తీసుకొని కునాలుడు –

"ఓ మాంసపుముద్దా! నీవు ముందరిలా రూపాలను

ఎందుకు చూడలేవు? నీపై ఆధారపడినవారు
మూఢులు. వారు మోసగింపబడినారు.
విబుధులను ఆశ్రయించినవారిచే
గర్హింపబడినారు. ఇది నీటిబుడగవంటిది,
నిర్విషయకమైనది, అస్వతంత్ర్యమైనది అని
నిరంతరం చూస్తూ, అప్రమత్తులై
ఉండేవారిని ఇది దుఃఖింపజేయజాలదు" అన్నాడు.
అన్ని విధాలా దాని అనిత్యతను చింతించి కునాలుడు
ఆ ప్రజలు చూస్తూండగానే
స్రోతాపత్తిఫలాన్ని పొందాడు.

సత్యాన్ని దర్శించిన కునాలుడు ఆ పురుషునితో ఇలా అన్నాడు – "ఇక నా రెండవ కంటిని కూడా పెకిలించు" అప్పుడు వాడు రెండవకంటిని కూడా పెకిలించి చేతిలో పెట్టాడు. మాంసనేత్రాలు పెకిలింపబడినా కునాలుడు విశుద్ధప్రజ్ఞాచక్షువులు కలవాడై ఇలా అన్నాడు –

"నా మాంసచక్షువులు పెకిలింపబడినా,
అతిదుర్లభమైన విశుద్ధప్రజ్ఞాచక్షువును పొంది
నేను ఆనందిస్తున్నాను.
నాయందు పుత్రభావాన్ని రాజు వదలిపెట్టినా
మహాత్ముడైన ఆ ధర్మరాజు బుద్ధునికి పుత్రుడుగా ఉన్నాను.
శోకదుఃఖాలను కలిగించే ఐశ్వర్యానికి దూరమైనా
దుఃఖశోకాలను నశింపజేసే ధర్మసంపదను పొందాను."

తర్వాత 'అది అశోకుని ఆదేశం కాదని, ఆ పని చేసింది తిష్యరక్షిత' అని కునాలుడు విని, ఇలా అన్నాడు –

"తిష్యరక్షితదేవి చిరకాలం ఆయుష్షుతో,
బలంతో, సుఖంగా ఉండుగాక!
ఆమె ఈ పని చేసినందువల్లనే

నేను నా లక్ష్యాన్ని సాధించగలిగాను."

కునాలుని కండ్లు పెరికివేయబడినాయని కాంచనమాల విన్నది. విని ఆమె సభాసదుల మధ్యనుండి భర్తయైన కునాలుని సమీపించి రక్తం ఓడుతున్న ముఖాన్ని చూసి, మూర్ఛితురాలై భూమిపై పడిపోయింది. చన్నీరు చల్లిన తర్వాత లేచి, కొంత తెలివి వచ్చిన తర్వాత ఎలుగెత్తి ఏడుస్తూ ఇలా అన్నది –

"నా వైపు చూస్తూ, నాకు ఎంతో సంతోషాన్ని కలిగించే
ప్రియమైన, మనోహరమైన, నా ప్రాణసమానమైన ఆ నేత్రాలు
నా విపత్తులను చూడదలచుకోలేదు కాబోలు
అందుకే ఆ శరీరాన్ని వదలిపోయాయి."

అప్పుడు కునాలుడు భార్యను ఓదారుస్తూ అన్నాడు – "ఏడవవద్దు! శోకించటం నీకు తగదు. స్వయంకృతం వల్లనే ఈ ఫలితం కలిగింది."

"ఈ ప్రపంచం కర్మవలన ఏర్పడిందనీ,
మానవుడు బాధలు అనుభవించటానికే పుట్టాడనీ,
ఇష్టమైనవారినుండి ఎడబాటు లోకధర్మమనీ
గుర్తించి ప్రియా! నీవు కన్నీరు కార్చవద్దు!"

అప్పుడు కునాలుడు భార్యతోసహా తక్షశిలనుండి బయటకు పోవలసి వచ్చింది. తల్లికడుపులో పడినప్పటినుండి అతడు పరమ సుకుమార శరీరుడు. శ్రమతో కూడిన పనిని అసలే చేయలేడు. కేవలం వీణను మాత్రం వాయించగలడు. ఇప్పుడు ఆ వీణావాదనం వలన లభించిన ఆహారాన్ని భార్యతోపాటు తింటూ పయనిస్తున్నాడు.

కాంచనమాల ఏ మార్గంవెంట భర్తతో, చతురంగబలాలతో పాటలీపుత్రంనుండి వచ్చిందో, ఆ మార్గం వెంట ఇప్పుడు కన్నులు లేని భర్తతో ఒంటరిగా పాటలీపుత్రానికి పోయింది. అశోకుని ఇంటిలో ప్రవేశించబోతుండగా ద్వారపాలకులు నివారించారు. వారు అశోకుని యానశాలలో ఉండవలసివచ్చింది. అక్కడ కునాలుడు రాత్రి ప్రత్యూషసమయంలో వీణావాదనాన్ని ఆరంభించాడు. 'కండ్లుపెరికివేయబడినా, సత్యదర్శనం మాత్రం అయింది' అనే భావాన్ని వ్యక్తీకరించే పాటను పాడసాగాడు –

"శుద్ధమైన జ్ఞానదీపంతో
చక్షురాది ఆయతనాలను చూసే ప్రాజ్ఞులు
సంసారంనుండి ముక్తులౌతారు.
ఒకవేళ నీవు భవదుఃఖపీడితుడవై,
దోషాన్ని నిశ్చయించి,
నిశ్చలసుఖాన్ని పొందాలనుకుంటే
వెంటనే ఈ ఆయతన విషయాలను త్యజించాలి."

ఆ గీతశబ్దాన్ని రాజు అశోకుడు విన్నాడు. విని ప్రీతిమనస్కుడై ఇలా అనుకున్నాడు –

'ఈ వీణాస్వరాన్ని, శ్రుతినిబట్టి దీన్ని కునాలుడే నాకోసం పాడుతున్నట్లుగా ఉంది.'

కుమారుడు ఇంటికి వచ్చికూడా ఇంకా ఎవరినీ చూడాలనుకోవటం లేదేమో!'

రాజుఅశోకుడు ఒకానొక పురుషుని పిలిచి ఇలా అన్నాడు –

"శ్రద్ధగా విను!
ఈ గీతశబ్దం కునాలుని గీతశబ్దంలా లేదా?
అది కర్మల అసమంజసత్వాన్ని చెపుతున్నట్లుగా ఉంది.
ఆ శబ్దం వలన గున్నను కోల్పోయిన
ఏనుగులా నేను ఎంతో చలించిపోయాను.
వెళ్లు! వెళ్లి కునాలుని తీసుకురా!"

సేవకుడు యానశాలకు పోయాడు. కాని కళ్లు పెరికివేయబడి, ఎండకు ఎండి, దుమ్ము ధూళి పేరుకొనిపోయిన కునాలుని గుర్తించలేకపోయాడు. అందువలన అతడు అశోకునివద్దకు తిరిగిపోయి "దేవా! అతడు కునాలుడు కాడు. భార్యతోపాటు తమ యానశాలలో నివసిస్తున్న ఒక అంధుడు" అన్నాడు.

అది విని అశోకుడు అంతకుముందు తాను చూచిన అశుభకరమైన స్వప్నాలను గుర్తుకు తెచ్చుకొని అశాంతికి గురియై 'నిశ్చయంగా కునాలుని నేత్రాలు పోయి ఉంటాయి' అనుకొని అతనితో ఇలా అన్నాడు –

"ఆ యాచకుని వెంటనే ఇక్కడికి తీసుకొని రావాలి.
పుత్రవ్యసనచింతతో నేను శాంతిని పొందలేకున్నాను."

ఆ పురుషుడు మరలా యానశాలకుపోయి కునాలునితో "పుత్రా! నీవెవరు? నీ పేరేమి?" అన్నాడు. కునాలుడు

"ఈ పృథ్వి ఎవరి వశంలోకి తేబడి, దాసిలా ప్రవర్తిస్తుందో,
అట్టి మౌర్యవంశవర్ధనుడైన,
అశోకరాజు పుత్రుడను. కునాలుడను.
అంతేకాదు నేను
ఆదిత్యబంధువైన సమ్మక్సంబుద్ధుని
కుమారుడను కూడా!" అన్నాడు.

అప్పుడు కునాలుడు భార్యతోపాటుగా అశోకుని ముందుకు తేబడినాడు. కన్నులు పెరికివేయబడి, గాలి, ఎండలచే ఎండి, వీధిలో పారవేయబడి, ధూళి పేరుకొనిపోయిన వస్త్రంతో తయారుచేయబడిన కౌపీనాన్ని అస్తవ్యస్తంగా నడుముకు చుట్టుకొని ఉన్న కునాలుని ఆకృతిమాత్రాన్నే రాజు అశోకుడు చూచి గుర్తుపట్టక "నీవు కునాలుడవేనా?" అన్నాడు. కునాలుడు "దేవా! నేను కునాలుడనే" అన్నాడు. విని రాజు మూర్ఛితుడై భూమిపై పడిపోయాడు."

"కన్నులు పెరికివేయబడిన కునాలుని చూచి
మనస్సు దుఃఖంతో నిండిపోగా,
పుత్రశోకంతో దహించుకొనిపోయిన
రాజు అశోకుడు నేలపై పడిపోయాడు."

ముఖంపై చన్నీటిని చల్లి రాజును ఆసనంపై కూర్చుండబెట్టారు. తేరుకొన్న తర్వాత రాజు కుమారుని కంఠాన్ని కౌగలించుకొని కన్నీరు చెంపలను తడుపగా, మాటి మాటికి నుదుటిని కొట్టుకొంటూ విలపించాడు –

"పూర్వం నేను కునాలపక్షివంటి కన్నులు కలవాడని
కునాలుడని పేరు పెట్టాను.

ఆ కన్నులు పోయినతర్వాత ఇప్పుడు పుత్రుని
'కునాలా!' అని ఎలా పిలవాలి?"

ఇంకా ఇలా అన్నాడు –

"సాధువులాంటి కుమారా!
నీ ముఖం అందమైన కన్నులను కోల్పోయి
జాబిల్లి జారిపడగా, చీకటి క్రమ్మిన
ఆకాశంలా ఎలా అయ్యింది? నాయనా!
మానవోత్తముడవు, సాధుచిత్తుడవు.
మునిసదృశుడవు, అద్వేషచిత్తుడవు
అయిన నీపట్ల ఇటువంటి దుష్కార్యాన్ని చేసి
నాకు అంతులేనిశోకాన్ని కలిగించిన
ఆ నిర్దయుడెవ్వడు? అందుకు కారణమేమిటో
త్వరగా చెప్పు! నాగులు వదలిన పిడుగుతో
కాలిపోతున్న అడవిలా ఉంది నా శరీరం" అన్నాడు.

అప్పుడు కునాలుడు తండ్రికి నమస్కరించి –

"రాజా! జరిగినదానికి చింతించగూడదన్న
మునివాక్యాన్ని నీవు వినలేదా!
ప్రత్యేకబుద్ధులు, బుద్ధులు కూడా
కర్మకు అతీతులు కారు. అది అంతబలమైనది.
సామాన్యులు కూడా తమ కర్మఫలాలనే
పొందుతారని చెప్పబడింది.
ప్రాణులకర్మలు ఎన్నటికీ ముగియవు.
ఈ లోకంలో ప్రాణిచేసినకర్మఫలాలు అతనివే.
అయినపుడు నేను దీనిని ఇతరులు
చేశారని ఎలా అనగలను?
మహారాజా! అపరాధాన్ని చేసి అపరాధినైనది నేనే. ఇటువంటి దురదృష్టాన్ని

తెచ్చిన కర్మలను చేసినవాడను నేనే."

"శస్త్రాలు, పిడుగులు, అగ్ని, పన్నగాల విషం,
నిర్మలమైన ఆకాశాన్ని
బాధింపలేవు. కాని
ప్రాణులశరీరాన్నే లక్ష్యంగా చేసుకున్నపుడు
అమంగళకరమైన దుఃఖాలు తమ
గురిని ఛేదిస్తాయి" అన్నాడు.

రాజు శోకాగ్నితో కాలిపోతూ –

"కుమారా! నీ కన్నులను పెరికిందెవ్వరు?
ఈ నీ సుమధుర జీవితాన్ని హరించిందెవ్వరు?
నా హృదయం ప్రచండమైన శోకాగ్నిలో పడింది.
చెప్పు సుతా! నేను వారిని వెంటనే దండిస్తాను" అన్నాడు.

ఎట్టకేలకు 'ఇది తిష్యరక్షిత చేసినపని' అని రాజు విన్నాడు. విని రాజు తిష్యరక్షితను పిలిచి ఇలా అన్నాడు –

"ఓ నీచురాలా! నీవు భూమిలోనికి కృంగిపోవెందుకు?
నీ తలను గొడ్డలితో కొట్టి నరుకుతాను.
ఆత్మవంతుడు అధర్మయుక్తమైన
సంపదలను విడుచునట్లుగా ఓ పాపకారిణీ!
నిన్ను నేను వదలిపెట్టాను."

రాజు క్రోధాగ్నితో జ్వలిస్తూ తిష్యరక్షితను చూస్తూ –

"నీ నేత్రాలను పెకిలిస్తాను.
నీ పొట్టను వాడియైన ఇనుపగోళ్లతో చీలుస్తాను.
బ్రతికియుండగానే శూలానికి ఎక్కిస్తాను.
రంపంతో ముక్కు కోస్తాను.
కత్తితో నాలుకను కోస్తాను.

శరీరాన్నంతా విషంతో నింపి
చంపివేస్తాను" అన్నాడు.

ఇలా అనేకవిధాలుగా ఆమెను చంపే పద్ధతుల గురించి రాజు మాట్లాడాడు. కాని కరుణామయుడైన కునాలుడు తన తండ్రి మాటలను విని –

"తిష్యరక్షిత అనార్యకర్మను చేసింది కాని
స్త్రీవధ అనే అనార్యకర్మను మీరు చేయగూడదు.
"ప్రభూ! సుగతునిచే వర్ణింపబడిన
మైత్రీ, సహనాలతో సమానంగా
ఫలితాన్ని ఇచ్చేది ఇంకేదీ లేదు"

అని మరలా తండ్రికి నమస్కరించి చేతులు జోడించి,
సత్యవాక్కులను ఇలా పలికాడు.

"మహారాజా! నేను
ఏమాత్రం బాధపడటం లేదు.
నా కండ్లను పెరుకటానికి
ప్రత్యక్షకారణమైన తల్లిపట్ల నేను
ప్రసన్నభావంతో ఉండటమే నిజమైతే
ఈ సత్యప్రతిజ్ఞ వలన నా కళ్లు
ఎప్పటిలా తిరిగివచ్చుగాక!"

అలా అనగానే ముందరికన్న ఎక్కువశోభతో రెండుకండ్లు మళ్లీ వచ్చాయి. రాజు అశోకుడు తిష్యరక్షితపట్ల కోపంతో ఆమెను దహనగృహంలో ప్రవేశింపజేసి కాల్చివేశాడు. తక్షశిలపౌరులు కూడా చంపబడ్డారు.

భిక్షువులకు సంశయం కల్గింది. అన్ని సంశయాలనూ ఛేదించే ఆయుష్మంతుడు ఉపగుప్తస్థవిరుని "కునాలుడు చేసిన ఏ కర్మకు ఫలంగా అతని కండ్లు పెరుకబడినాయి?" అని అడిగారు.

స్థవిరుడు "ఆయుష్మంతులారా! వినండి!

అతీతంలో పూర్వం వారాణసిలో ఒకానొక వేటగాడు ఉండేవాడు. అతడు హిమాలయానికి పోయి జింకలను చంపేవాడు. ఒక సమయంలో అతడు హిమాలయానికి వెళ్లాడు. అక్కడ వలపన్ని ఐదువందల జింకలను ఒక గుహలో ప్రవేశింపజేశాడు. అప్పుడు అతనికి "ఈ ఐదువందల జింకలను ఒకేసారి చంపితే మాంసం కృళ్లిపోతుంది. వాటి కళ్లను పెరికినట్లయితే అవి పారిపోవు' అనిపించి ఆ ఐదువందల మృగాలకళ్లను పెరికివేశాడు."

"ఆయుష్మంతులారా! ఆ వేటగాడు ఎవరు? కునాలుడే. అనేకవందల జింకల కళ్లను పెరికివేసిన ఆ కర్మఫలితంగా అనేకవేలసంవత్సరాలు అతడు నరకంలో దుఃఖాన్ని అనుభవించాడు. ఆ విశేషకర్మ ఫలంగానే ఆ తర్వాత ఐదువందల జన్మలలో ప్రతిసారీ అతని కళ్లు పెరికివేయబడినాయి."

"ఏ కర్మఫలంగా అతడు ఉన్నతవంశంలో జన్మించాడు? రూపవంతుడైనాడు? సత్యాన్ని దర్శించాడు?"

"ఆయుష్మంతులారా! వినండి! అతీతంలో పూర్వకాలం మానవుల ఆయువు ఎనుబదినాలుగువేల సంవత్సరాలు ఉన్నపుడు క్రకుచ్ఛందుడనే పేరుగల సమ్యక్సంబుద్ధుడు లోకంలో జన్మించాడు."

ఆ క్రకుచ్ఛంద సమ్యక్సంబుద్ధుడు బుద్ధకార్యాన్ని పూర్తిచేసి, నిరుపాధిశేష నిర్వాణధాతువును పొందాడు. అతనికి రాజు అశోకుడు నాలుగు రత్నాలతో స్తూపాన్ని నిర్మించాడు. రాజు అశోకుడు చనిపోయిన తర్వాత ఒక శ్రద్ధలేని రాజు పాలనకు వచ్చాడు. దొంగలు స్తూపంలోని రత్నాలను ఎత్తుకొనిపోయారు. కర్ర, మట్టి మాత్రమే మిగిలాయి. ప్రజలు అక్కడికి పోయి శిథిలస్థూపాన్ని చూచి దుఃఖించసాగారు.

ఆ సమయంలో ఒక శ్రేష్ఠిపుత్రుడు ఉండేవాడు. అతడు "ఎందుకు ఏడుస్తున్నారు" అని అడిగాడు. వారు "క్రకుచ్ఛందబుద్ధుని స్తూపం నాలుగు రత్నాలతో శోభించేది. ఇప్పుడది శిథిలమైపోయింది" అన్నారు.

అతడు ఆ శిథిలస్థూపాన్ని బాగుచేయించి, క్రకుచ్ఛందబుద్ధుని శరీరప్రమాణంతో మూర్తిని చేయించి నిలిపాడు. తర్వాత అతడు "క్రకుచ్ఛందబుద్ధునివంటి శాస్త నాకు లభించుగాక! నేను అందుకు తగినవాడను అగుదును గాక!" అని ప్రణిధానం చేశాడు.

ఆయుష్మంతులారా! ముందరిజన్మలో కునాలుడే ఆ శ్రేష్ఠిపుత్రుడు. అతడు ఆ క్రకుచ్ఛందబుద్ధుని స్తూపాన్ని బాగుచేయించినందువలన, ఆ కర్మఫలంగా ఉన్నతవంశంలో పుట్టాడు. ప్రతిమను నిలిపినందువలన రూపవంతుడైనాడు. అతడు ప్రణిధానం చేసినందువలన క్రకుచ్ఛందబుద్ధునివంటి శాక్యమునియైన బుద్ధశాస్త్ర శాసనాన్ని పొంది, సత్యాలను దర్శించాడు.

ఇది కునాలావదానం.

# అశోకుని చివరి రోజులు

రాజు అశోకుడు భగవానుని శాసనంలో శ్రద్ధకలవాడైన తర్వాత భిక్షువులతో ఇలా అన్నాడు – "భగవచ్ఛాసనానికి (ధర్మానికి) పెద్దమొత్తంలో ఎవరు దానమిచ్చారు?" భిక్షువులు "అనాథపిండక గృహపతి" అన్నారు. రాజు "అతడు భగవచ్ఛాసనానికి ఎంత ఇచ్చాడు?" అన్నాడు. భిక్షువులు "నూరు కోట్లు" అన్నారు. విని రాజు కొంతసేపు ఆలోచించి ఇలా అన్నాడు – "అతడు ఒక గృహపతిగా ఉండి భగవానుని శాసనానికి వందకోట్లు ఇచ్చాడు. నేను కూడా భగవానుని శాసనానికి వందకోట్లు ఇస్తాను"

అతడు ఎనుబదినాలుగువేల ధర్మరాజిక స్తూపాలను నిర్మించి, ప్రతిచోటా లక్ష బంగారునాణాలు ఇచ్చాడు. బుద్ధుడు పుట్టినచోట, బోధిని పొందినచోట, ధర్మచక్రప్రవర్తనం చేసినచోట, పరినిర్వాణం చెందినచోట, ఈ అన్నిచోట్లా ఒక్కొక్క లక్ష బంగారు నాణాలు ఇచ్చాడు. పంచవార్షికాన్ని నిర్వహించాడు. అక్కడ నాలుగు లక్షలు ఇచ్చాడు. ఒకవంతు అర్హతులు, రెండువంతుల శైక్ష్యులు, కల్యాణకరపృథగ్జనులూగల మూడు లక్షలమంది భిక్షుసంఘాన్ని భుజింపజేశాడు. కోశాగారం తప్ప తక్కిన రాజ్యాన్ని, అంతఃపురాన్ని, అమాత్యులను, తనను, కునాలుని సంఘానికి కుదువబెట్టుకుని, నాలుగులక్షల బంగారునాణాలు ఇచ్చి విడిపించుకున్నాడు. ఇలా బుద్ధుని ధర్మానికి తొంబదియారు కోట్లను దానంగా ఇచ్చాడు.

అప్పుడతడు రోగపీడితుడైనాడు. రాజుకు 'ఇక మిగిలిన దానాన్ని ఇవ్వలేనేమో' అనిపించి మనస్సు వికలమైంది.

పూర్వజన్మలో దుమ్మును దానం చేసినప్పుడు వెంట ఉన్నవాడు, ఇప్పుడు అమాత్యుడుగా ఉన్న రాధాగుప్తుడు రాజు అశోకుడు వికలమనస్కుడుగా ఉండటం చూసి పాదాలపైబడి దోసిలిపట్టి ఇలా అన్నాడు –

"దేవా!
శత్రుసమూహాలు కన్నెత్తి చూడజాలని
చండ దివాకరునివంటి మీ ముఖం,
పద్మాలవంటి వందల పెదవులతో
ముద్దాడబడిన మీ ముఖం
ఎందుకు కన్నీటితో ఆవరింపబడింది?"

రాజు "రాధాగుప్తా! నేను ధనం నాశనమౌతుందనో, రాజ్యం నాశనమౌతుందనో, చనిపోతాననో శోకించటం లేదు. కాని ఆర్యులతో ఎడబాటు కలుగుతుందని శోకిస్తున్నాను" అన్నాడు.

'నేను మరల సర్వగుణసంపన్నమైన,
నర దేవ పూజితమైన సంఘాన్ని
ఉత్తమ అన్నపానాలతో
పూజించలేకపోతాను కదా'
అని చింతించి కన్నీరు కారుస్తున్నాను'

ఇంకా రాధాగుప్తా! "నేను సంఘానికి కోటి ఇస్తానని మాటయిచ్చాను. ఆ నామాట ఇంకా పూర్తికాలేదు" అన్నాడు. అప్పుడు రాజు మిగిలిన నాలుగుకోట్లు కూడా ఇస్తానని, కుక్కుటారామానికి బంగారునాణాలను పంపటం ఆరంభించాడు.

అప్పుడు కునాలుని కొడుకు సంపది యువరాజుగా ఉన్నాడు. అతనితో మంత్రులు "కుమారా! అశోకుడు కొంతకాలం మాత్రమే రాజుగా ఉంటాడు. ఈలోపున అతడు ధనాన్నంతా కుక్కుటారామానికి పంపుతాడు. రాజుకు కోశాగారమే బలం. కనుక ధనాన్ని పంపకుండా నివారించాలి" అన్నారు.

కుమారుడు ధనాన్ని ఇవ్వవద్దని కోశాగారికునికి చెప్పాడు. అప్పుడు రాజుకు బంగారుపాత్రలలో ఆహారం తెచ్చేవారు. భుజించినతర్వాత ఆ సువర్ణపాత్రలను రాజు కుక్కుటారామానికి పంపసాగాడు. బంగారుపాత్రలలో ఆహారాన్ని తేవటం మాని వెండి పాత్రలతో తేసాగారు. వాటిని కూడా రాజు కుక్కుటారామానికి పంపించాడు. వెండిపాత్రలు

కూడా నిషేధింపబడినాయి. మట్టిపాత్రలతో ఆహారం తేబడింది. చివరికి అశోకుని చేతిలో సగం ఉసిరికాయ మాత్రమే మిగిలింది. అప్పుడు రాజు అశోకుడు ఉద్విగ్నుడై మంత్రులను, పౌరులను సమావేశపరిపించి ఇలా అన్నాడు "ఇప్పుడీ పుడమికి రాజెవ్వరు?"

అప్పుడు అమాత్యులు ఆసనాలనుండి లేచి రాజు అశోకునివైపు దోసిలిపట్టి, నమస్కరించి "దేవా! పృథ్వీపతి మీరే" అన్నారు. అప్పుడు రాజు అశోకుడు కన్నులలో నీరు నిండగా ఇలా అన్నాడు –

"నన్ను మభ్యపెట్టటానికి అబద్ధం
ఎందుకు చెపుతారు? నా ప్రభుత్వం పోయింది!
నా అధికారం ఇప్పుడు సగం ఉసిరికాయకు
మాత్రమే పరిమితమైంది.
నదీముఖద్వారంలోని వరదవంటి
ఈ ఐశ్వర్యానికి ధిక్కారం.
మానవేంద్రుడనైన నేను
భీకరమైన దారిద్ర్యాన్ని పొందాను."

'సంపదలన్నీ విపత్తులకే కారణమన్న' భగవానుని మాటను ఎవడు కాదనగలడు? సత్యాన్ని మాట్లాడే గౌతముడు దానిని ఎంతో బలంగా తెలిపాడు. నేడు నా మాట ఎవరూ వినటం లేదు. నేను ఎన్నిసార్లు ఆజ్ఞాపించినా, అవి అన్నీ పెద్ద కొండశిలను ఢీకొన్న నదీప్రవాహంలా వెనుకకు తిరిగిపోతున్నాయి.

"ఒకప్పుడు ఏకచ్ఛత్రాధిపతిగా భూమండలాన్ని
పాలించి, శత్రువులను మర్ధించినవాడు,
పేదలను, ఆపన్నులను ఓదార్చినవాడు,
నేడు తన ఆధారాన్ని కోల్పోయి,
క్రింద పడిపోయాడు.
నేడు దీనుడైన ఈ రాజు
పూలూ, ఆకులూ రాలిన అశోకవృక్షంలా
వైభవహీనుడై, కృశిస్తున్నాడు" అన్నాడు.

అప్పుడు రాజు అశోకుడు దగ్గరలో ఉన్న సేవకుని సంబోధించి “సౌమ్యా! నేడు అధికారాన్ని కోల్పోయినా, గతంలో నేను చేసిన మంచిపనులను దృష్టిలో ఉంచుకొని ఈ ఒక్కపని చేసిపెట్టు! ఈ సగం ఉసిరికాయను తీసుకొని కుక్కుటారామానికి వెళ్ళి దానిని సంఘానికి సమర్పించు! నాకు మారుగా సంఘానికి ప్రణామం చేసి, ‘జంబూద్వీపాన్ని వైభవంగా పాలించిన రాజు కానుక ఇది. నా ఈ చివరి కానుకను సంఘంలోని ప్రతిఒక్కరికీ అందేటట్లు పంచండి!’ అని చెప్పు!”

ఇంకా అతడు

“నేడు ఇదే నా చివరికానుక,
నా రాజ్యమూ, వ్యక్తిత్వమూ పోయాయి.
ఆరోగ్యం చెడి, మందులూ, వైద్యులూ కూడా లేని నాకు
సంఘం ఒక్కటే దిక్కు. అందువలన
సంఘానికి నేను సమర్పించిన
నా ఈ చివరికానుకను మీరందరూ
పంచుకోండి!” అన్నాడు.

రాజు అశోకుని మాటలు విని ‘‘అలాగే దేవా!’’ అని ఆ పురుషుడు కుక్కుటారామానికిపోయి వృద్ధభిక్షువులముందు నిలిచి, దోసిలిపట్టి ఆ సగం ఉసిరికాయను సంఘానికి ఇచ్చి –

“ముందు ఏకచ్ఛత్రాధిపతిగా పృథ్విని పాలించి,
మధ్యాహ్నసూర్యునిలా లోకాన్ని తపింపజేసిన రాజు
నేడు అదృష్టహీనుడై, తనకర్మలచే వంచితుడై,
అస్తంగత సూర్యునిలా తన వైభవాన్ని కోల్పోయాడు” అని

భక్తితో తలవంచి నమస్కరించి, లక్ష్మియొక్క చపలచిత్తానికి గుర్తుగా ఉన్న ఆ సగం ఉసిరికాయను వారికి ఇచ్చాడు. అప్పుడు సంఘస్థవిరుడు భిక్షువులతో –

“భదంతులారా! దీనిని నేడు మీరు స్వీకరించి, ఉద్వేగాన్ని పొందాలి. ఇతరుల విపత్తులు చింతను కలిగిస్తాయని భగవానుడు కూడా అన్నాడు. అయినపుడు ఈ సమయంలో ఉద్వేగాన్ని పొందని సహృదయుడెవడు!” ఎందుకంటే –

"త్యాగశూరుడు, నరేంద్రుడు,
మౌర్యవంశశ్రేష్ఠుడు, జంబూద్వీపాధిపతి
నేడు ఈ సగం ఉసిరికాయకు మాత్రమే అధిపతి.
భృత్యులు ఆ భూమిపతి అధికారాన్ని హరించగా
విస్తారసంపదల మదగర్వంతో నిండిన
పృథగ్జనుల్లాగా, కేవలం ఈ సగం ఉసిరికాయను మాత్రమే
మనకు అర్పించగలిగాడు" అని

ఆయన ఆ సగం ఉసిరికాయను నూరి రసంలో కలిపి సంఘానికి వడ్డించాడు.

అప్పుడు రాజు అశోకుడు రాధాగుప్తునితో అన్నాడు. "చెప్పు రాధాగుప్తా! ఈ పృథ్వీపతి ఎవరు?"

అప్పుడు రాధాగుప్తుడు అశోకుని పాదాలపైబడి అంజలిపట్టి "దేవా! ఈ పృథ్వీపతి తమరే" అన్నాడు. అప్పుడు రాజు అశోకుడు కొంచెం లేచి నాలుగుదిక్కులను పరికించి సంఘానికి అంజలి ఘటించి ఇలా అన్నాడు –

"కోశాగారం తప్ప ఈ సముద్రపర్యంత
మహాపృథ్విని సంఘానికి సమర్పిస్తున్నాను" ఇంకా

"సముద్రవసనధారి, బహురత్నాలంకృతముఖి
అయిన ఈ వసుంధరను
మందరపర్వతంతోపాటు, ప్రాణులతోపాటు
సంఘానికి సమర్పిస్తున్నాను.
సంఘమే దాని ఫలాన్ని అనుభవిస్తుంది." ఇంకా

"ఈ దానంతో నేను ఇంద్రలోకాన్ని,
బ్రహ్మలోకఫలాన్ని కోరటం లేదు.
ప్రవహించేనీటిలా చపలమైన
రాజ్యసంపదను కూడా కోరటం లేదు.
దొంగలు హరించలేనిదీ, ఆర్యులు ప్రశంసించేది,

శాంతికి ఆకరమైనదీ అయిన
మనోప్రభుత్వాన్ని కోరుతున్నాను.”

ఆ విధంగా పత్రాన్ని వ్రాసి, దంతముద్రను వేసి ఉంచాడు. అలా మహాపృథ్విని సంఘానికి దానం చేసి రాజు చనిపోయాడు. మంత్రులు ఆ శరీరాన్ని నీలి, పసుపురంగు శిబికలో తీసుకొనిపోయి పూజించి, దహింపజేశారు, తర్వాత వారు క్రొత్తరాజును నిలుపుదామనుకుంటుండగా రాధాగుప్తుడు “రాజు అశోకుడు ఈ మహాపృథ్విని సంఘానికి ఇచ్చాడు” అన్నాడు. మంత్రులు “ఎందుకోసం” అన్నారు.

రాధాగుప్తుడు “భగవానుని ధర్మానికి నూరుకోట్లు ఇవ్వాలనేది అశోకరాజు సంకల్పం. ఆయన తొంబదియారు కోట్లు ఇచ్చాడు. ఆ తర్వాత ఆయనమాట ఎవరూ వినలేదు. అందుకోసం రాజు మహాపృథ్విని సంఘానికి ఇచ్చాడు” అన్నాడు.

మంత్రులందరూ కలిసి నాలుగుకోట్లను సంఘానికి ఇచ్చి, పృథ్విని విడిపించుకుని, సంపదిని రాజ్యంలో నిలిపారు.

సంపది కొడుకు బృహస్పతి. బృహస్పతి కొడుకు వృషసేనుడు. వృషసేనుని కొడుకు పుష్యధర్ముడు. పుష్యధర్ముని కొడుకు పుష్యమిత్రుడు. అతడు మంత్రులను ఆహ్వానించి “నా పేరు చిరకాలం నిలిచి ఉండాలంటే ఏమి చేయాలి?” అన్నాడు.

వారు ఇలా అన్నారు – “దేవరవారి వంశంలో అశోకుడనే రాజు ఉండేవాడు. అతడు ఎనుబదినాలుగువేల ధర్మరాజికలను నిర్మించాడు. భగవచ్ఛాసనం ఉన్నంతవరకూ అతని పేరు నిలిచి ఉంటుంది. దేవరవారు కూడా ఎనుబదినాలుగువేల ధర్మరాజికలను నిర్మించాలి.”

రాజు “అశోకరాజు గొప్పవాడు. ప్రఖ్యాతుడు. ఆయనలా మనం చేయలేము. ఇంకేమైనా ఉపాయం లేదా?” అని అడిగాడు. అతని బ్రాహ్మణ పురోహితుడు పృథగ్జనుడు. భగవానుని శాసనంలో విశ్వాసం లేనివాడు. అతడు “దేవా! నిర్మించటం వలన, నాశనం చేయటంవలన ఈ రెండు కారణాలవలన పేరు చిరస్థాయిగా ఉంటుంది. అశోకరాజు ఎనుబదినాలుగువేల ధర్మరాజికలను స్థాపించటం వలన ఆయన పేరు చిరస్థాయిగా నిలిచిపోయింది. మీరు వాటిని నాశనం చేస్తే మీ పేరు చిరస్థాయిగా ఉంటుంది” అన్నాడు.

అప్పుడు రాజుపుష్యమిత్రుడు చతురంగబలకాయాన్ని సిద్ధపరచి, 'భగవానుని ధర్మాన్ని నాశనం చేస్తాను' అని కుక్కుటారామానికి పోయాడు. ద్వారంనుండి సింహనాదం వెలువడింది. రాజు భయపడి పాటలీపుత్రంలో ప్రవేశించాడు. ఆ విధంగా రెండు మూడుసార్లు జరిగింది. చివరికి అతడు సంఘాన్ని సమావేశపరచి, "నేను భగవానుని శాసనాన్ని నాశనం చేయబోతున్నాను. మీకు స్తూపాలు కావాలా? సంఘారామాలు కావాలా?" అన్నాడు. భిక్షువులు 'స్తూపాలు కావాల'న్నారు. పుష్యమిత్రుడు సంఘారామాన్ని మొత్తం నాశనం చేసి, భిక్షువులను చంపి వెళ్లిపోయాడు.

కొంతకాలం తర్వాత సాకలనగరానికి వెళ్లి 'భిక్షువు తలను తెచ్చి ఇచ్చినవారికి వందదీనారాలను ఇస్తాన'ని ప్రకటించాడు. అక్కడ ధర్మరాజికలో ఒక అర్హతుడు ఉండేవాడు. అతడు తన బుద్ధిశక్తి వలన తలలను సృష్టించి రాజుకు ఇవ్వసాగాడు. విషయాన్ని విన్న రాజు అర్హతుని చంపించటానికి ప్రయత్నించాడు. అతడు నిరోధసమాపత్తిలో చేరిపోయాడు కాని అవతలివైపుకు పోలేకపోయాడు. అతనిని చంపజాలక రాజు అచటినుండి కోష్ఠకానికి పోయాడు.

దంష్ట్రనివాసి యక్షుడు 'అయ్యో భగవానుని ధర్మం నశిస్తుంది. కాని నేను శీలవ్రతధారిని. ఎవరికీ అప్రియం చేయజాలను. మరి ధర్మాన్ని ఎలా కాపాడాలి?' అనుకున్నాడు. అప్పుడు కృమిశుడనే ఇంకొక యక్షుడు దంష్ట్రనివాసి యక్షుని కూతురును పెండ్లి చేసుకోవాలనుకుని, దంష్ట్రనివాసిని అడిగాడు. దంష్ట్రనివాసి "నీవు పాపకర్మలు చేసేవాడవు" అని తొలుత కూతురును ఇవ్వటానికి ఒప్పుకోలేదు. కాని చివరకు 'భగవానుని ధర్మాన్ని కాపాడి, నిలుపటానికి ప్రయత్నించాల'నే నిబంధన మీద తన కూతురును కృమిశయక్షునికి ఇచ్చాడు.

పుష్యమిత్రరాజు వెనుక అంగరక్షకుడుగా ఒక పెద్ద యక్షుడు ఉండేవాడు. అతడు కాపాడటం వలన రాజును ఎవరూ చంపలేకపోయారు. కాని దంష్ట్రనివాసియక్షుడు ఆ యక్షుని పట్టుకొని పర్వతాలలోనికి తీసుకొనిపోయాడు. రాజు భయపడి దక్షిణసముద్రం వేపు పారిపోయాడు. కాని అక్కడ కృమిశయక్షుడు పెద్దపర్వతాన్ని లేవనెత్తి పుష్యమిత్రుడూ, అతని సైన్యం మీద పడవేశాడు. దానివలన అతనికి 'సునిహితుడు' అనే పేరు వచ్చింది. పుష్యమిత్రుని మరణంతో మౌర్యవంశం అంతమైంది.

శ్రీ అశోకావదానం సమాప్తం.

# జ్ఞప్తి చతుర్థకర్మ

(క) జ్ఞప్తి చతుర్థకర్మ – ఒక వ్యక్తికి భిక్షువు కావటానికి తగిన అన్ని అర్హతలు ఉన్నాయని నిశ్చయమైన తర్వాత భిక్షుసంఘ సమావేశంలో తెలివిపరుడు, సమర్థుడూ అయిన భిక్షువు సంఘానికి ఈ విధంగా సూచన (జ్ఞప్తి) చేస్తాడు –

జ్ఞప్తి (సూచన) – భన్తే! సంఘం నామాట వినుగాక! ఈ పేరుగల ఆయుష్మంతుని శిష్యుడు ఉపసంపదను కోరుచున్నాడు. ఇతనిలో ప్రవ్రజ్యకు విఘ్నకారకమైన విషయాలేమీ లేవు. ఇతనికి పాత్ర, మూడు చీవరాలు ఉన్నాయి. ఇతడు ఈ పేరుగల భిక్షువును ఉపాధ్యాయునిగా స్వీకరించి, సంఘం నుండి ఉపసంపదను యాచిస్తున్నాడు. ఒకవేళ సంఘానికి ఇది తగినది అనిపిస్తే, ఈ పేరుగల వానికి, ఈ పేరుగల ఆయుష్మంతుని ఉపాధ్యాయత్వంలో ఉపసంపదను ఇచ్చుగాక! ఇది జ్ఞప్తి. సంఘసమ్మతికోసం ఈ విషయాన్ని మూడుసార్లు వినిపించటాన్ని అనుశ్రావణం అంటారు.

(ఖ) అనుశ్రావణం – భన్తే! సంఘం నామాట వినుగాక! ఈ పేరుగల ఆయుష్మంతుని శిష్యుడు ఉపసంపదను కోరుచున్నాడు. ఇతనిలో ప్రవ్రజ్యకు విఘ్నకారకమైన విషయాలేమీ లేవు. ఇతనికి పాత్ర, మూడు చీవరాలు ఉన్నాయి. సంఘం ఈ పేరుగల అభ్యర్థికి ఈ పేరుగల ఆయుష్మంతుని ఉపాధ్యాయత్వంలో ఉపసంపదను ఇస్తుంది. ఇందుకు సమ్మతించినవారు మౌనంగా ఉండాలి. సమ్మతించనివారు మాట్లాడవచ్చును. రెండవసారికూడా అదే విషయాన్ని చెపుతున్నాను. మూడవసారికూడా అదే విషయాన్ని చెపుతున్నాను. ఒక జ్ఞప్తి, మూడు అనుశ్రావణాలు ఉండటం వలన దీనిని జ్ఞప్తిచతుర్థకర్మ అంటారు. ఆ తర్వాత ధారణ ఉంటుంది.

ధారణ – ఈ పేరుగలవానికి, ఈ పేరుగలవాని ఉపాధ్యాయత్వంలో సంఘం ఉపసంపదను ఇచ్చింది. సంఘం ఇందుకు సమ్మతించింది కనుకనే మౌనంగా ఉన్నదని అనుకుంటున్నాను.



**శ్రీ మోక్షానంద** 1952లో నిజామాబాద్ జిల్లాలోని తిమ్మాపూర్ గ్రామంలో ఒక వ్యవసాయ కుటుంబంలో జన్మించారు. వీరి తల్లిదండ్రులు శ్రీమతి లింగమ్మ, శ్రీ సోమ గంగారాం.

ప్రాథమికవిద్య తిమ్మాపూర్‌లోను, హైస్కూల్ చదువు మోర్తాడ్‌లోను పూర్తిచేసిన వీరు, ఉన్నతవిద్యను ఆర్మూర్‌లోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలోను, నిజామాబాద్ గిరిరాజ కళాశాలలోను పూర్తిచేశారు.

హైస్కూలు దశలోనే స్వామి వివేకానంద జీవితచరిత్రను చదివి ప్రభావితులైన వీరిలో ధార్మిక చింతన మొదలై 1970లో మోర్తాడ్‌లోని నారాయణ మహర్షులవద్ద ధ్యానదీక్ష స్వీకరించి, 1978లో సన్యసించారు. పతంజలి యోగదర్శనాన్ని, ఉపనిషత్తులను అధ్యయనం చేసిన వీరు కొంతకాలం పరివ్రాజకులుగా హిమాలయాలలోను, ఉత్తర భారతదేశంలోను సంచరించారు. ప్రస్తుతం తిమ్మాపూర్‌లో ఆశ్రమాన్ని స్థాపించుకొని ధార్మికజీవితం గడుపుతున్నారు.

బౌద్ధధర్మాన్ని నిశితంగా పరిశీలించి లోతుగా అధ్యయనం చేస్తున్న శ్రీ మోక్షానంద 'వినయపిటకాన్ని', 'ధమ్మపదాన్ని', 'విశుద్ధిమార్గాన్ని', 'చైనాయాత్రికుడు ఫాహియాన్ భారతదేశయాత్ర'ను ఇప్పటికే అనువదించారు. ఆ వరుసలోనిదే 'అశోకావదానం'.

**ధర్మ దీపం**

బౌద్ధ సంప్రదాయ సంస్కృతుల పునరుద్ధరణ, పరిరక్షణ, విస్తరణకు అంకితమైన ధర్మసంస్థ.